اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ

# శాంతిబాట

సంతోషమయ జీవనానికి మార్గదర్శి

సంపుటి 1 | సెప్టెంబర్ 2009 | సంచిక 2

Rs. 15/-



**ఖుర్'ఆన్ డిక్షనరీ, పదానువాదంతో వ్యాఖ్యానం ప్రారంభం**
ఖుర్'ఆన్ అవగాహనకు ఇల్మ్ అత్తఫ్సీర్ తప్పనిసరి

**మనిషిని నాశనం చేసే మహా వినాశనకరమైన పాపం ఏమిటి?**
మీ సంతోషాన్ని నాశనంచేసే 7 పాపాలలోని ఒక పాపం గురించి ...

**ఇన్ని సంవత్సరాలుగా నేనొక మనిషిని పూజించానా?**
ఓ సోదరి ఆవేదన - తిరిగి గూటికి శీర్షికలో ...

**19వ శతాబ్దపు తీవ్రవాద దాడుల్లో ఏ ఒక్కటీ ముస్లిములు చేయలేదు**
అప్పటి తీవ్రవాదులెవరు? ఏ వర్గానికి చెందినవారు? అప్పుడూ ఇస్లాం ఉందిగా! న్యాయంగా ఆలోచించండి!

**ఆధునిక సైన్స్‌కి పునాదిరాళ్ళను వేసిన వారెవరు?**
వారిని మరిచారా? వారి గురించే తెలియదా? గట్టి పునాదిని వేసిన వారి గురించి తెలుసుకోండి

**అద్భుత సృష్టి: మానవ కంటి నిర్మాణంలో అద్భుతం!**
డార్విన్ సిద్ధాంతం శాస్త్రీయ వాస్తవం కాదు

**మరెన్నో ఆలోచింపజేసే వ్యాసాలు .....**
ఈ పత్రిక ముస్లిములకే కాదు, ఆలోచించే ప్రతీ మనిషి కోసం

# అల్లాహ్  ALLAH

## సకల లోకాలను సృష్టించిన ఆ సృష్టికర్త పేరు : అల్లాహ్

### ఇది అరబీ పదమా?

వాస్తవానికి మూసా(అ) [Moses] వారి మాతృభాషయైన హెబ్రూలో కూడా
ఆ పేరు 'అల్లాహ్'

ఈసా(అ) [Jesus] వారి మాతృభాషయైన అరమాయిక్ భాషలో కూడా
ఆ పేరు 'అల్లాహ్' ܐܠܗܐ

మూడు భాషలలోనూ అల్లాహ్ అనే పదానికి మూలం 3 అక్షరాలు

అరబీ - (అలిఫ్, ا లామ్, ل హ ه) అరమాయిక్ - (అలెఫ్, ܐ లామెద్, ܠ హే ܗ) హెబ్రూ - (అలెఫ్ א, లామెద్, ל హే ה)

పురాతన సెమిటిక్ భాషలలో సకల లోకాలను సృష్టించిన సృష్టికర్త పేరు "అల్లాహ్".
లిపిలో తేడా ఉండవచ్చు గాని పలకడం (ఉచ్ఛారణ) ఒకటే.

'ఆరాధ్యుడు' అనే పదానికి అరబీ, అరమాయిక్, హెబ్రూ భాషల మూడింటిలోనూ 'ఇలాహ్' అనే పిలుస్తారు.

అరబీ గ్రామర్ ప్రకారం 'అల్ + ఇలాహ్' = 'అల్ ఇలాహ్' అవుతుందేగాని,
ఆ పదాల కలయిక 'అల్లాహ్' అనే పదానికి సమానం కాదు. ఇది ఒక ప్రత్యేక పదం.

'అల్లాహ్' అనే పదం అసమాన (UNIQUE) పదం. మరి అల్లాహ్ ఎలా ఉంటారు?

ఆయన ఒక్కడు. ఆయన ఎవరికీ తండ్రి కాడు. ఆయన ఎవరికీ జన్మించనూ లేదు. ఎవరి సహాయం అవసరం లేనివాడు.
ఆయనను పోలినదేదీ ఈ విశ్వంలో లేదు. అల్లాహ్ నుద్దేశించి 'మేము' అని వాడబడిన పదం బహువచనం కాదు.
Royal Plural. ఆయనను పోలినదేదీ విశ్వంలో లేనప్పుడు ఇలా ఉంటారని ఊహించ సాధ్యం కాదు.

'దేవుడు' అనే తెలుగు పదానికి 'దేవుళ్ళు' అను బహువచన పదం ఉంది.
'అల్లాహ్' అనే పదానికి బహువచన పదం గాని, స్త్రీ లింగ పదంగాని లేదు.

**గాలి, నీరు, భూమి, సూర్యుడు అందరికీ ఒకటే. వీటిని సృష్టించిన సృష్టికర్త కూడా ఒక్కడే!
సర్వాన్ని సృష్టించిన వానికి పేరు మార్చుకోవలసిన అవసరం ఎంతమాత్రం లేదు.
సృష్టి మొదలు నుండి సృష్టి అంతం వరకూ ఒకటే పేరు. ఆ పేరే "అల్లాహ్"**

"సకల లోకాలను సృష్టించిన ఆ సృష్టికర్త పేరు ఏమిటి?" లో ప్రవక్తలందరూ ప్రార్థించింది 'అల్లాహ్'నే అని హెబ్రూ, అరమాయిక్ భాషా వాక్యాలతో నిరూపించడం జరిగింది. ఈ పుస్తకాన్ని ఉచితంగా పంపిణీ చేసినవారు: ట్రూవిజన్ ఎడ్యుకేషనల్ సొసైటీ (వైజాగ్), వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ (సామర్లకోట)

రమదాన్ - షవ్వాల్ హి. 1430

# శాంతిబాట

మాసపత్రిక రూ. 15/-

సంపుటి 1 సంచిక 2 సెప్టెంబర్ 2009

2-8-31, కోటబజార్, సామర్లకోట 533 440

Phone:9347046090 Email:velugubaata@gmail.com

**1** **అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం :** ఖుర్'ఆన్ గ్రంథ అధ్యయనానికి ప్రోత్సాహం - సూరే ఫాతిహా అర్థాలతో ఖుర్'ఆన్ డిక్షనరీ మరియు సైన్స్ ఆఫ్ తఫ్సీర్ ప్రారంభం

**5** **ప్రపంచ శాంతిదూత 'ముహమ్మద్(స)' వారి బోధనలు, ఆచరణలు :** సమాజంలోని సమస్యలకు పరిష్కార మార్గం - ఈ నెల ప్రత్యేకం : ఇస్లామీయ జీవన విధానంలో నిషిద్ధమైన 'వడ్డీ/అధర్మసంపాదన' పై విశ్లేషణ.

**9** **తిరిగి గూటికి :** ఏ సృష్టి ధర్మంతో బిడ్డ జన్మించిందో, తిరిగి ఆ ధర్మానికే చేరుకున్న సోదరుడు లేదా సోదరి గురించి (వారి మాటలలో). సోదరి రుబా డి. ఖేవర్ (అమెరికా) యొక్క సంతోషమయ జీవనం గురించి ...

**15** **ఖుర్'ఆన్ మరియు సైన్స్ :** ఆధునిక సైన్స్ యొక్క ఇస్లామీయ మూలాలు గురించి .... చరిత్ర మడతలలో దాయబడిన నిజాలు ... నిజ చరిత్ర వెలుగు - ఇస్లాంలో మస్జిద్ యొక్క పాత్ర.

**18** **డార్విన్ సిద్ధాంతం - శాస్త్రీయ వాస్తవం కాదు :** సృష్టికర్త యొక్క అద్భుత సృష్టిపై శాస్త్రీయ వర్ణన. అవాస్తవాల ప్రచారంపై ఖండన - కంటిలో అద్భుతం

**21** **జ్ఞానం - అజ్ఞానం :** జ్ఞానులనుకొనే వారి అజ్ఞానాన్ని బయటపెట్టడం. నాస్తికుల అజ్ఞానాన్ని దూరం చేసే ప్రయత్నం ..

**26** **నాస్తికుని ఓ ప్రశ్న :** ప్రాచీన యుద్ధాలన్నీ ఆహారం కొరకే, కొన్ని చోట్ల ఆహారం ఎందుకు దొరకదు? ఇస్లాం ధర్మాన్ని అనుసరించే వారిలో పేదరికం ఎందుకుంది - శాంతిబాట జవాబు

**29** **టెర్రరిజం :** టెర్రరిజానికి ఏ మతం పేరును అతికించకుండా, 'ఇస్లాం'నే అతికించి ముస్లిములనే టార్గెట్‌గా ఎందుకు పెట్టుకున్నారు? కనులు మూసుకున్న మీడియా యొక్క కనులు తెరిపించే ప్రయత్నం. 19వ శతాబ్దంలో జరిగిన తీవ్రవాద దాడుల వివరాలు - పరిశోధనాత్మక వ్యాసం

**33** **బాలబాలికలకు ప్రత్యేకం :** ఇస్లాం పరిచయం. పాఠ్య పుస్తకాలలో సైన్స్ డిస్కవరీల గురించి నేర్చుకున్న అసత్యాలను ఎత్తిచూపడం మరియు వాస్తవాల వివరణ

**35** **ఖుర్'ఆన్‌ను అర్థం చేసుకుంటూ చదువుదాం :** నెలకు 24 అరబీ పదాల చొప్పున 30 నెలలలో ఖుర్'ఆన్‌లోని 80 శాతం పదాలను నేర్పించాలని..

'శాంతిబాట' చందాదారులుగా చేరగోరువారు మీ పూర్తి ఎడ్రస్ మరియు ఫోన్ నెంబర్లతో సహా **రూ. 180/-** M.O. చేయవలసిన చిరునామా: **వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**, 2-8-31, కోట బజార్, సామర్లకోట-533440

ఎడిటర్:
**ఎమ్.డి. అతహరుల్లా**

**ఎడ్వయిజరీ బోర్డ్:**
డా॥ సలీమ్ పాషా
డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు
ఎమ్.డి. అఫ్ఫాన్ ఉమ్రీ

**సహాయకులు:**
**వెలుగుబాట**
ఎడ్యుకేషనల్ సొసైటీ
మరియు
**ట్రూవిజన్**
ఎడ్యుకేషనల్ సొసైటీ
సభ్యులు

**Printed by**
Md. Athaharullah

**Published by**
Md. Athaharullah

**on behalf of**
Velugubaata Educational Society
(R.No. 569/2008), Samalkot-533440

and

**Printed at**
'*Akash Industries*',G-14, Industrial Estate, Samalkot - 533440

and

**Published at**
2-8-31, Kota Bazar,
Samalkot - 533440,

**Editor:** Md. Athaharullah
Phone : 9347046090,
Email: velugubaata@gmail.com
RNI Title Code APTEL11019

ఈ పత్రికలో ప్రచురించిన వ్యాసాల గురించిగాని, లేదా ఇతర వివరాలకుగాని సంప్రదించండి

**డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు,** *M.Sc.,Ph.D.*
**Cell : 9491103017**

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ (అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో)

# కృతజ్ఞతలు

రమదాన్ పవిత్ర మాసంలో తొలి రోజున అసర్ నమాజ్ తరువాత సామర్లకోట మస్‌జిద్‌లో తొలి సంచికను విడుదల చేయడం జరిగింది. విడుదలైన గంటలోపునే విశేష స్పందన లభించింది. ఇది అంతా 'అల్లాహ్' చూపిన కరుణ. క్రిందటి సంవత్సరం రమదాన్ నెలలోనే ఈ మాసపత్రిక ప్రారంభించాలని సంకల్పించాము. సంచికను కూడా తయారుచేసుకుని, రిజిస్ట్రేషన్ కోసం ధరఖాస్తును న్యూఢిల్లీకు పంపడం, అక్కడి నుండి 'శాంతిబాట' పేరును ఓ.కే. చేయడంలో చాలా ఆలస్యం జరిగింది.

ఏదైనా ఓ మంచి ధార్మిక కార్యక్రమం చేయాలని ఓ సోదరునికి ఆలోచన వచ్చాక, ఆ ఆలోచనను బలపరస్తూ నీతో మేమున్నామంటూ, మనకు అల్లాహ్ కృప ఉంటే చాలంటూ ప్రోత్సహించే వారున్నంతవరకూ, 'శాంతిబాట' లాంటి పత్రికలకు అల్లాహ్ మార్గం సుగమం చేస్తారని మా విశ్వాసం. ఏ మంచిపని మొదలుపెట్టినా అడ్డంకులు రావడం సహజమే! కాని అటువంటి అడ్డంకులను మేము ఊహించని విధంగా తొలగించి, అల్లాహ్ మాపై రమదాన్ నెల తొలిరోజునే కరుణను కురిపించారు. దాని ఫలితమే ఈ గొప్ప స్పందన.

తొలి సంచికలోని శీర్షికల డిజైన్, వాటి వ్యాసాలు తయారుచేయడానికి 6 నెలలపాటు నిరంతరం అల్లాహ్ పేరుతో కృషి చేయడం జరిగింది.

ఈ 'శాంతిబాట'కు చందా కట్టిన సోదరులు, ఈ పుస్తకాన్ని ఖరీదు చేస్తున్నామని అనుకోవద్దు. మీరు ఓ ధార్మిక కార్యక్రమంలో మాకు చేయూతను ఇస్తున్నట్లుగా భావించండి. మీరిచ్చిన ఈ ఆసరాకి మా హృదయపూర్వక కృతజ్ఞతలు. అల్లాహ్ మనందరిని శాంతిబాటలో పయనించేలా చేయుగాక! (ఆమీన్). 'శాంతిబాట' టైటిల్ కోసం అప్లై చేయడం దగ్గరనుండి ఈ రోజు వరకూ ఆఫీస్‌ల చుట్టూ మా టీమ్‌లోని ఓ సోదరుడు తిరుగుతూనే ఉన్నాడు. ఈ కృషి మరియు శ్రమ అంతా కూడా ఈ పత్రికను నిర్విరామంగా నడపాలనే సంకల్పంతోనే జరిగింది.

'నేనింతవరకూ ఇటువంటి పత్రికను చదవలేదు. దయచేసి ఈ పత్రికను ఎలాంటి పరిస్థితులలోనూ మూయవద్దు' అని ఓ సోదరుడు చెప్పారు. ఆ సోదరుని ప్రోత్సహానికి మా కృతజ్ఞతలు. ఆపే ఉద్దేశ్యం అయితే మాకు లేదు. లాభాన్ని ఆశించకుండా మంచి సంకల్పంతో, నిస్వార్ధంగా, నిజాయితీగా అల్లాహ్ పేరుతో ప్రారంభించిన పత్రిక ఇది. ఆయన కృప మాపై ఉన్నంత వరకూ ఈ 'శాంతిబాట' పయనం ఆగదు.

మస్‌జిద్‌లో నియమించుకున్న ఇమామ్ గారు రావడం మానివేస్తే, ఇన్షాఅల్లాహ్, నమాజ్‌లు ఆగిపోవు కదా! అలాగే ఏ ఒక్కరో లేనంత మాత్రాన పత్రిక ఆగదు. ఆ స్థానంలోకి మరో విశ్వాసిని అల్లాహ్‌యే తీసుకువస్తారు. అన్ని వ్యాసాలు అందరికీ ఇష్టం కాకపోవచ్చు. లేదా అన్ని వ్యాసాలు అందరికీ అర్థం కాకపోవచ్చు. అయినప్పటికిని అన్ని వ్యాసాలపై ప్రశంసల జల్లు కురిసింది. 'అల్లాహ్' సాయముంటే ఇటువంటివి జరగడం సహజమే!

పత్రిక యొక్క ఒక సంచికకు మరియు దాని తరువాత వచ్చే సంచికకు మధ్య 30 రోజుల కంటే ఎక్కువ వ్యవధి కాకుండా ఇన్షాఅల్లాహ్ జాగ్రత్తలు తీసుకుంటాము. 'శాంతిబాట'ను మరింత మెరుగ్గా అందించడానికి సద్విమర్శలను పంపండి. సంతోషంగా స్వీకరిస్తాం. కొందరు సోదరులు మనియార్డర్ చేసారు. వాటిపై అడ్రస్ మాత్రమే ఉందిగాని, ఫోన్ నెంబర్ లేదు. దయచేసి ఫోన్ నెంబర్ వివరాలను పంపమని వారిని కోరుతున్నాము.

పత్రికను చూడకుండానే, మేము పంచిన కరపత్రాలను (పాంప్లెట్స్‌ను) చదివి, మాపై నమ్మకంతో చందాదారులుగా చేరిన సోదరులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాము.

ఎటువంటి ఫండ్ లేకుండా, పాఠకుల చందాపై నడుపబడే ఈ పత్రికను 'వ్యాపార పత్రిక'గా భావించవద్దని, పాఠక సోదరులందరికీ విజ్ఞప్తి చేసుకుంటున్నాము. ప్రపంచవ్యాప్తంగా జరిగే పరిశోధనను అందరికీ అందించాలనే తపనేగాని, ఈ పత్రిక ద్వారా ఉపాధి పొందాలనే ఉద్దేశ్యం మాకు లేదు.

ఖరీదైన పేపర్‌తో, క్వాలిటీ ప్రింటింగ్‌తో, పోస్టల్ ఛార్జ్ (రూ. 9/-)లతో కలిసి, ఒకొక్క కాపీకి 23 రు॥లు ఖర్చుఅవుతుంది. 2 పుస్తకాలను లేదా అంతకంటే ఎక్కువ పుస్తకాలను ఒకే ప్యాకెట్‌లో పోస్ట్ చేస్తే ఖర్చు బాగా తగ్గుతుంది. కనుక ఒకే ఏరియాలో ఉండే పాఠకులు మాకు పోస్టల్ రిజిస్ట్రేషన్ వచ్చేవరకూ వారందరికీ అనువుగా ఉండే ఒకే ఎడ్రస్‌ని మాకు తెలియజేస్తే, మా ఆర్థికభారాన్ని తగ్గించిన వారవుతారు. ఇది మా ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడానికి మేము చేస్తున్న రిక్వెస్ట్ మాత్రమే. ఇందులో ఎటువంటి బలవంతం లేదు. చందాదారులను చేర్పించి చేయూత నివ్వమని మనవి చేసుకుంటున్నాము.

**- శాంతిబాట టీమ్**



# అరబీ భాషలో
# సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం



## అధ్యాయం -1 : "ప్రారంభం"

1. అనంత కరుణామయుడు, అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

2. అల్‌హమ్దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్
   **అన్ని పొగడ్తలు మరియు కృతజ్ఞతలు సకల లోకాలకు ప్రభువు, పోషకుడు అయిన అల్లాహ్ కొరకే**

3. అర్రహ్‌మా నిర్రహీమ్
   **అనంత కరుణామయుడు, అపార కరుణాప్రదాత**

4. మాలికి యౌమిద్దీన్
   **తీర్పు దినానికి సర్వాధికారి**

5. ఇయ్యాక న'అబుదు వ ఇయ్యాక నస్‌త'ఈన్
   **నిన్నే మేము ఆరాధించేది మరియు నీ సహాయాన్నే మేము అర్థించేది**

6. ఇహ్‌దినస్ సిరాతల్ ముస్తఖీమ్
   **మాకు ఋజుమార్గం (సన్మార్గం) వైపునకు మార్గదర్శకత్వం వహించు**

7. సిరాతల్లజీన అన్‌అమ్‌త అలైహిమ్ గైరిల్ మగ్‌దూబి అలైహిమ్ వలద్దాల్లీన్
   **వారి మార్గం ఎవరిపై నీ అనుగ్రహాన్ని ప్రసాదించావో,**
   **నీ కోపానికి గురియైన వారిది కాదు,**
   **మార్గభ్రష్టులైనవారిది (వారి మార్గం) కాదు.**

## 1. సూరహ్ అల్-ఫాతిహా

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

| | | | |
|---|---|---|---|
| الْعٰلَمِيْنَ | رَبِّ | لِلّٰهِ | اَلْحَمْدُ |
| (అ)ల్'ఆలమీన్ | రబ్బి | లిల్లాహి | అల్‌హమ్దు |
| **సకల లోకాలకు** | **ప్రభువు, పోషకుడు** | **అల్లాహ్ కొరకు** | **అన్ని పొగడ్తలు, కృతజ్ఞతలు** |
| | الرَّحِيْمِ | | الرَّحْمٰنِ |
| | (అ)ర్రహీమ్ | | అర్రహ్‌మాని |
| | **అపార కరుణాప్రదాత** | | **అనంత కరుణామయుడు** |
| | الدِّيْنِ | يَوْمِ | مٰلِكِ |
| | ద్దీన్ | యౌమి | మాలికి |
| | **(ఆ) తీర్పు (యొక్క)** | **దినం (యొక్క)** | **సర్వాధికారి** |
| نَسْتَعِيْنُ | وَ اِيَّاكَ | نَعْبُدُ | اِيَّاكَ |
| నస్‌త'ఈన్(ను) | వ ఇయ్యాక | న'అబుదు | ఇయ్యాక |
| **మేము సహాయాన్ని అర్థించేది** | **మరియు నిన్నే** | **మేము ఆరాధించేది** | **నిన్నే** |
| | الْمُسْتَقِيْمَ | الصِّرَاطَ | اِهْدِنَا |
| | (అ)ల్ముస్తఖీమ్(మ) | స్సిరాత | ఇహ్‌దిన |
| | **ఆ ఋజు** | **ఆ మార్గాని(కి)** | **మాకు మార్గదర్శకత్వం వహించు** |
| | اَنْعَمْتَ | الَّذِيْنَ | صِرَاطَ |
| | అన్'అమ్‌త | (అ)ల్లజీన | సిరాత |
| | **(నీ)అనుగ్రహాన్ని ప్రసాదించావో** | **వారి (యొక్క)** | **(ఆ) మార్గం** |
| | الْمَغْضُوْبِ | غَيْرِ | عَلَيْهِمْ |
| | (అ)ల్మగ్‌దూబి | గైరి | అలైహిమ్ |
| | **(నీ)ఆగ్రహానికి గురియైనవారు** | **కాదు** | **వారిపై** |
| | الضَّآلِّيْنَ | وَلَا | عَلَيْهِمْ |
| | ద్దాలీన్ | వల(లా) | అలైహిమ్ |
| | **మార్గభ్రష్టులైనవారియొక్క** | **మరియు కాదు** | **వారిపై** |

గమనిక : బ్రాకెట్లలో ఇచ్చిన పదాలను చదవనవసరం లేదు

**అరబీ వాక్యాలను కుడివైపునుండి ఎడమవైపుకు చదవాలి**

## సూరహ్ అల్-ఫాతిహా పదాల అర్థాలు

| | | |
|---|---|---|
| 1. | యొక్క, తో, చే, లో (*preposition*) | بِ |
| 2. | పేరు (నామవాచకం) | اِسْمٌ |
| 3. | * అమిత కరుణామయుడు, మేలు చేసేవాడు దయగలవాడు, కనికరించేవాడు | اَلرَّحْمَانُ |
| 4. | * అపార కృపాశీలుడు, దయగలవాడు | اَلرَّحِيْمُ (ر ح م) |
| 5. | ఆ పొగడ్తలు, కృతజ్ఞతలు, (రక్షణార్థం అప్పగింత),జ్ఞాపకం చేసుకోవడం, సంతోషపూర్వక ఆశ్చర్యంతో పొగడ్త | اَلْحَمْدُ (ح م د) |
| 6. | కొరకు, వలన (*preposition*) | لِ |
| 7. | సకల లోకాలకు పోషకుడు, సకల లోకాలకు, ప్రాణులకు ప్రభువు | رَبِّ الْعَالَمِيْنَ |
| 8. | యజమాని, సర్వాధికారి | مَالِكِ (م ل ك) |
| 9. | రోజు | يَوْمِ |
| 10. | తీర్పు, మత ధర్మం, విశ్వాసం | اَلدِّيْنِ |
| 11. | నిన్నే | اِيَّاكَ |
| 12. | మేము ఆరాధించేది | نَعْبُدُ (ع ب د) |
| 13. | మరియు | وَ |
| 14. | మేము సహాయాన్ని అర్థించేది | نَسْتَعِيْنُ |
| 15. | సహాయాన్ని అడగడం | اِسْتَعَانَ (ع و ن) |
| 16. | మార్గదర్శకత్వం వహించు, నిర్దేశించు సన్మార్గంపై నడిపించు, మార్గాన్ని చూపు తెలియజేయి | اِهْدِ (ه د ي) |
| 17. | మాకు, మా, మా యొక్క (బహువచనం) | نَا |
| 18. | మార్గం, దిశ | صِرَاطَ |
| 19. | తిన్ననైన, ధర్మమైన, ఖచ్చితమైన, నిజాయితీతో కూడిన, ఋజుప్రవర్తనగల | مُسْتَقِيْمَ |
| 20. | ఎవరైతే (బహువచనం) | اَلَّذِيْنَ |
| 21. | నీవు అనుగ్రహించావు, నీ కరుణ కురిపించావు | اَنْعَمْتَ (ن ع م) |
| 22. | వారి మీద, వారి పైన | عَلَيْهِمْ |
| 23. | తప్పు | غَيْرِ |
| 24. | నీ ఆగ్రహానికి గురిఅయ్యారో | مَغْضُوْبِ (غ ض ب) |
| 25. | లేదు, కాదు, వద్దు | لَا |
| 26. | మార్గభ్రష్టులు(దారి తప్పిన వారు), మంచిమార్గం నుండి దూరంగా పోయినవారు | اَلضَّآلِّيْنَ (ض ل ل) |

అరబీ అక్షరాలను, పదాలను కుడివైపునుండి ఎడమవైపుకు చదవాలి. పైన తెలిపిన కొన్ని అరబీ పదాల బ్రాకెట్లలో విడి అక్షరాలను ఇవ్వడం జరిగింది. వీటిని మూలం అంటారు. ఇలాంటి మూడు అక్షరాల ఒకే మూలంతో అనేక పదాలు ఉత్పన్నమౌతాయి. అరబీ భాష మూలాలపై ఆధారపడిన భాష. బావంపై ఆధారపడిన భాష కాదు. *పైన ఇచ్చిన 3 మరియు 4వ పదాల అర్థాలను విపులంగా మొదటి సంచికలో చర్చించాము.

## దివ్య ఖుర్'ఆన్ పరిచయం

నిజానికి ఖుర్'ఆన్ గ్రంథం యొక్క పూర్తి పరిచయం మొదటి సంచికలో చేయాలి. కాని తొలిసంచిక ద్వారా శీర్షిక యొక్క ప్రధానోద్దేశ్యాన్ని తెలియజేయాలనే తపనతో, పరిచయం పూర్తి కాకుండానే గ్రంథంలోని తొలి వాక్యాన్ని వివరించడం జరిగింది.

ఈ రెండవ సంచికలో పరిచయలోటును పూరిస్తున్నాము.

సాధారణంగా ఏదైనా ఓ పుస్తకం వ్రాయడానికి రచయితలు ఒక టెక్నిక్ లేదా రెండు, మహా అయితే మూడు టెక్నిక్స్ వాడతారు. కాని అల్లాహ్ గ్రంథమైన ఖుర్'ఆన్‌లో 36 టెక్నిక్స్‌ను ఇప్పటివరకూ పరిశోధకులు గుర్తించారు.

అయితే ఈ వివరాలను మాచే ప్రచురణ కాబోయే "దివ్య ఖుర్'ఆన్ - అరబీ భాషలోనే ఎందుకు అవతరించింది?" పుస్తకంలో పూర్తిగా ఇన్షాఅల్లాహ్ అందించాలనుకుంటున్నాము.

ప్రామాణిక అంతర్జాతీయ సైన్స్ పత్రికలలో, పరిశోధనా వ్యాసాలను వివరంగా ప్రచురిస్తారు. అయితే ఆ వ్యాసానికి ముందు ఒక చిన్న పేరా ఒకటి ఉంటుంది. కొన్ని పత్రికలలో ఈ పేరాలోని పదాల సంఖ్య 100కు మించి ఉండకూడదు. మరి కొన్నింటిలో గరిష్ఠంగా 250 పదాలుంటాయి. ఈ పేరానే Abstract అంటారు. ఆ Abstract ని ఎలా వ్రాయాలంటే, ఎన్ని పేజీల వ్యాసమైనా సరే, ఆ వ్యాసం యొక్క సారాన్ని ఆ చిన్న Abstract లో పొందుపరచాలి. ఎవరైనా ఆ Abstract చదివితే, ఆ వ్యాసం గురించి ఒక నిర్ణయానికి రాగలుగుతారు.

అయితే 1400 సం॥ల క్రితమే అవతరించిన అత్యంత ప్రామాణిక గ్రంథమైన ఖుర్'ఆన్ గ్రంథంలోని మొదటి సూరహ్, దివ్య ఖుర్'ఆన్‌కి Abstract లాంటిదే. ఈ ఫాతిహా సూరహ్‌లో ఖుర్'ఆన్ యొక్క సారముంటుంది.

రెండవ వాక్యం సృష్టి గురించి చెబుతుంది. ఎన్నో లోకాలున్నాయని,

వాటన్నింటికీ ప్రభువు, పోషకుడు అల్లాహ్‌యేనని, సమస్త పొగడ్తలు ఆయన కొరకేనని చెప్పడం ద్వారా ఆయన గొప్పతనాన్ని, అలాగే సమస్త కృతజ్ఞతలు ఆయన కొరకేనని చెప్పడం ద్వారా మనకి అన్నిరకాల 'మేలు'ను కలిగించేది ఆయనేనని స్పష్టం చేస్తుంది. అనంత కరుణా మయుడు మరియు అపార కృపాశీలుడు అని చెప్పడం ద్వారా ఆయన యొక్క దయా, క్షమాగుణం, విశ్వాసులపై ఆయనకు గల ప్రేమ గురించి తెలియజేస్తుంది.

నాలుగవ వాక్యం 'తీర్పు దినానికి సర్వాధికారి'లో చాలా ముఖ్య విషయాలు ఇమిడి ఉన్నాయి. తీర్పుదినం ఎప్పుడు వస్తుంది? ప్రళయం వచ్చి, సమస్తం నాశనమైన తర్వాత, అంటే విశ్వం ముగింపు అయిన తర్వాత వస్తుంది.

అసలు తీర్పుదినం అంటే ఏమిటి?

ఓ మనిషిని స్వర్గానికి లేదా నరకానికి పంపడానికి నిర్ణయం జరిగే రోజు. మనిషి చేసే మంచి ఆచరణలు ఈ స్వర్గం కొరకే! మనిషి ఈ భూమి మీద బ్రతికే కొద్దికాలం కూడా ఆ తీర్పుదిన పరీక్ష కొరకే!

అంటే ఈ నాలుగు వాక్యాలలో సృష్టి ఆరంభం నుండి అంతం వరకూ, సమస్త జీవుల సృష్టి మరియు వాటి అంతం వరకూ, తిరిగి మనుష్యులకు ప్రాణం పోసి, తీర్పు చెప్పి వారికి శాశ్వత నివాసానికి పంపడం వంటి విషయాలున్నాయి. మనిషికి కావలసింది శాశ్వత నివాసం వరకూ వెళ్ళడం వరకే. అందుకే దైవగ్రంథం కావాలి. ఈ దైవగ్రంథం మరేమిటో కాదు, ఆ శాశ్వత నివాసానికి వెళ్లడానికి, ఎలా వెళ్లాలో చెప్పే సూచనలిచ్చే గైడ్.

శాశ్వత నివాసానికి చేరిన తర్వాత ఈ గ్రంథం యొక్క అవసరం లేదు. ఎందుకంటే మంచి ఆచరణలతో స్వర్గం చేరిన వారికి, ఇక ఆచరణల అవసరం లేదు. ఉదాహరణకు మంచి మార్కులతో పాసయ్యి ఉద్యోగం పొందిన వానికి, మరలా ఆ పుస్తకాలను చదివి పరీక్ష వ్రాయవలసిన అవసరం లేదు కదా!

నరక నివాసానికి చేరిన వానికి, తిరిగి మంచి ఆచరణలను ఆచరించి స్వర్గానికి వెళ్ళడానికి అవకాశం లేదు. ఏ ఆచరణ జరిగినా అది ఈ భూమి మీదే జరగాలి. కాబట్టి నరకనివాసికి కూడా ఈ గ్రంథం అప్పుడు ఉపయోగపడదు.

ఆ తర్వాత చెప్పిన వాక్యాలు, ఆ శాశ్వత నివాసమైన 'స్వర్గాన్ని' పొందడం ఎలాగో, 'నరకాని'కి దూరం కావడం ఎలాగో 'దారి'ని చూపమని అల్లాహ్ యొక్క దాసుడు వేడుకునే మాటలు.

ఈ సూరహ్ పూర్తి అయిన వెంటనే, రెండవ సూరహ్‌నుండి ఆఖరిది అయిన 114వ సూరా వరకూ, దైవదాసుడు కోరుకున్న మార్గాన్ని అల్లాహ్ చూపించారు. ఈ విధంగా 6,236 ఖుర్'ఆన్ వాక్యాలలోని మొదటి 7 వాక్యాలు, మిగిలిన 6,229 వాక్యాలకు సారాంశమని తెలుసుకోవాలి.

## దివ్య ఖుర్'ఆన్ గ్రంథానికి వ్యాఖ్యానం (తఫ్సీర్)

## *Science of Tafsir*

**ఇల్మ్ అత్తఫ్సీర్** (వ్యాఖ్యాన విజ్ఞానం)

తఫ్సీర్ అనే పదానికి అరబీ భాషలో భాషాపరమైన అర్థం 'తెరవడం' లేదా 'వివరించడం', 'అర్థం చేసుకోవడం' లేదా 'వ్యాఖ్య'. టెక్నికల్‌గా చెప్పాలంటే తఫ్సీర్ విజ్ఞానమనేది విషయపరిజ్ఞానంలో ఓ భాగం - ఇందులో ఖుర్'ఆన్ గ్రంథం యొక్క అర్థాలను వివరించడం మరియు ఆ మహా గ్రంథంయొక్క ఆదేశాలను మరియు వివేకాన్ని, నీతివచనాలని స్పష్టంగా మరియు ఓపెన్‌గా వర్ణించడం.

మహాప్రవక్త ముహమ్మద్(స)వారి నుద్దేశించి దివ్య ఖుర్'ఆన్ (16:44)లో అల్లాహ్ ఇలా చెప్పడం జరిగింది:

> **"ఇప్పుడు ఈ జ్ఞాపికను (ఖుర్'ఆన్ గ్రంథాన్ని) నీపై అవతరింప జేసింది, వారి వద్దకు అవతరింపజేయబడిన దానిని వారికి నీవు స్పష్టంగా వివరించటానికి మరియు బహుశా వారు ఆలోచిస్తారేమో!"**

మరలా, ఖుర్'ఆన్ గ్రంథం (3:164)లో ఇలా చెబుతోంది :

> **"వాస్తవానికి అల్లాహ్ విశ్వాసులకు మహోపకారం చేశాడు, వారి నుండియే వారి మధ్య ఒక ప్రవక్త (ముహమ్మద్)ను లేపాడు, అతను, ఆయన (అల్లాహ్) సందేశాలను వారికి వినిపిస్తున్నాడు. మరియు వారి జీవితాలను సంస్కరించి పావనం చేస్తున్నాడు, మరియు వారికి గ్రంథాన్ని మరియు వివేకాన్ని బోధిస్తున్నాడు మరియు వాస్తవానికి వారు ఇంతకు ముందు స్పష్టంగా మార్గభ్రష్టత్వంలో పడి ఉన్నారు"**

పై ఆయత్‌లను బట్టి, ముహమ్మద్(స) వారు ఖుర్'ఆన్‌లోని పదాలను బోధించడమే కాకుండా, వాటిని చాలా వివరంగా అర్థమయ్యేలా చెప్పేవారన్న విషయం మనకు స్పష్టమౌతుంది.

ముహమ్మద్(స)వారు ఈ భూమిపై జీవించియున్నంత కాలం, ఏ ఆయత్ (ఖుర్'ఆన్ వాక్యం) గురించి అయినా వివరంగా తెలుసు కోవాలంటే, అదేమంత సమస్య కాలేదు. ప్రవక్త(స)వారి సహచరుల (శిష్యుల)కు ఏదైనా ఇబ్బంది ఎదురైతే, ఆయన(స)తో చెప్పుకుని, సంతృప్తికరమైన జవాబును పొందేవారు.

కాని ఆయన మరణం తరువాత, దివ్య ఖుర్'ఆన్ యొక్క తఫ్సీర్‌ని కూడా జ్ఞానం యొక్క ఓ శాశ్వత భాగంగా భద్రపరచవలసిన అవసరం కలిగింది. దివ్య ఖుర్'ఆన్ యొక్క పదాలతో పాటు, వాటి యొక్క ఖచ్చితమైన అర్థాలను ముస్లిం సమాజం కొరకు 'నాస్తికులు, మతభ్రష్టులు మరియు ప్రక్కదారిపట్టించేవారి'నుండి భద్రపరచడం మరియు సంరక్షించవలసి వచ్చింది.

అర్థాలను వక్రీకరించే అవకాశం లేకుండా చేయాలి. కాబట్టి

''..... అలాంటి వ్యక్తి (ముహమ్మద్ (స)) పలికిన వచనం ప్రకృతి హృదయం నుండి ప్రత్యక్షంగా వెలువడిన వాణి. మానవులు దాన్ని వింటారు. తప్పనిసరిగా వినాలి కూడా. మరి దేన్నీ విననంత శ్రద్ధగా దాన్ని వినాలి. దానితో పోల్చి చూస్తే ప్రపంచంలో మరేదయినా సరే అంతా కేవలం శూన్యం''

**- థామస్ కార్లైల్** (ఖుర్'ఆన్ పై వ్యాఖ్య)

అల్లాహుతాలా యొక్క కరుణ మరియు తౌఫీఖ్‌తో, ఈ అద్భుత లక్ష్యాన్ని సాధించగలిగారు. ఎంత సమర్ధంగా చేశారంటే, ఈ రోజు మనం ఎటువంటి అనుమానానికి లోనవకుండా, అల్లాహ్ యొక్క చిట్టచివరి గ్రంథం యొక్క పదాలనే కాకుండా, ముహమ్మద్(స)వారు మరియు ఆయన(స) కొరకు ఎటువంటి త్యాగానికైనా ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే సహాబీల (శిష్యుల) ద్వారా మనకందిన తఫ్సీర్ మరియు వివరణలు కూడా రక్షింపబడ్డాయి.

ఏయే విధాలుగా ముస్లిమ్ ఉమ్మత్ తఫ్సీర్ జ్ఞానాన్ని రక్షించి భద్రపరిచారు? ఈ అన్వేషణలో వారు ఎలాంటి తీవ్రమైన కష్టాలను ఎదుర్కొన్నారు? ఎన్ని దశలలో ఈ క్లిష్ట ప్రయత్నం జరిగింది?

ఇదంతా చెప్పాలంటే ఓ పెద్ద పారవశ్యం కలిగించే చరిత్ర. వీటి గురించి మరో శీర్షికలో చెప్పుకుందాం. ఇన్షా అల్లాహ్!

**తఫ్సీర్ మూలాలు :**

**1. దివ్య ఖుర్'ఆన్ :**

దివ్య ఖుర్'ఆన్‌లోని జ్ఞానాన్ని వివరించడానికి మొదటి మూలం దివ్య ఖుర్'ఆన్ గ్రంథమే!

ఖుర్'ఆన్‌లో ఒకొక్కచోట కొన్ని విషయాలు చాలా క్లుప్తంగా చెప్పబడతాయి. ఇలా తరచుగా గ్రంథంలో వస్తూనే ఉంటాయి. ఇలాంటి వాక్యాలకి వివరణ అవసరం. ఇలాంటి వాక్యాన్ని మార్పు లేకుండా స్పష్టంచేసేది - ఖుర్'ఆన్‌లోని మరో వాక్యమే!

ఉదాహరణకు ఈ వ్యాసంలో '**సూరహ్ అల్-ఫాతిహ**'లోని "**ఇహ్దినస్ సిరాతల్ ముస్తఖీమ్ సిరాతల్లజీన అన్‌అమ్‌త అలైహిమ్**" అనే వాక్యానికి అర్థం: "మాకు సన్మార్గం వైపునకు మార్గదర్శకత్వం వహించు. వారి మార్గం ఎవరిపై నీ అనుగ్రహాన్ని ప్రసాదించావో"

ఈ వాక్యంలో చెప్పబడిన "**అల్లాహ్ యొక్క అనుగ్రహాన్ని పొందిన వారెవరు?**" ఈ వాక్యం యొక్క అర్థాన్ని మాత్రమే తీసుకుంటే, విషయం స్పష్టం కావడం లేదు కదా! ఇక్కడ వివరణ కావాలి.

అయితే ఖుర్'ఆన్ గ్రంథంలోని మరో వాక్యంలో ఆ అనుగ్రహం పొందిన వారిని చాలా స్పష్టంగా గుర్తించడం జరిగింది. వారి గురించి తెలుసుకోవడానికి క్రింది ఖుర్'ఆన్ వాక్యాన్ని (4:69) చూడండి:

> **"మరియు ఎవరు అల్లాహ్‌కు మరియు ప్రవక్తకు విధేయులై ఉంటారో, అలాంటివారు అల్లాహ్ అనుగ్రహం పొందిన ప్రవక్తలతోనూ, సత్యవంతుల తోనూ, (అల్లాహ్) ధర్మం కొరకు ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల (షహీదుల)తోనూ, సద్వర్తనలతోనూ చేరి ఉంటారు. మరియు అలాంటివారి సాంగత్యం ఎంతో మేలైనది"**

కాబట్టి గ్రంథంలోని ఏదైనా ఒక వాక్యం అర్థం కాకపోతే వివరణ కొరకు, వ్యాఖ్యాతలు మొట్టమొదట ఆ విధంగా ఖుర్'ఆన్‌లోనే మరోచోట ఎక్కడైనా ఉందేమోనని పరీక్షిస్తారు. ఒకవేళ అటువంటి వాక్యం ఉంటే, వివరణ కోసం వారు మొదట ఎంచుకునేది ఆ వాక్యాన్నే!

**(తఫ్సీర్ యొక్క మరికొంత భాగం వచ్చే సంచికలో ...)**

**కపట ముస్లిములున్నారు జాగ్రత్త!**

ఈ వ్యాసంలోని తఫ్సీర్‌లో కొందరు వ్యక్తులు మనల్ని తప్పుదోవ పట్టిస్తారని చెప్పడం జరిగింది. వారి గురించి ఉదాహరణపూర్వకంగా వివరించవలసి ఉంది.

ఒక వ్యక్తిని బలంతో ఎదిరించి నాశనం చేయలేని మరో వ్యక్తి, స్నేహంతో అదే పనిని సులువుగా చేయగలుగుతాడు. అతనితో స్నేహం చేసి, నిజమైన స్నేహితుడుగా నటించి, నెమ్మది, నెమ్మదిగా అతన్ని వ్యసనపరున్ని చేసో లేదా మరో విధంగానైనా సరే నాశనం చేస్తాడు. కాని ఆ మోసాన్ని గుర్తించేలోగా నాశనమైపోయే వారెంతమందో!

యూదులను ఈ కపట విశ్వాసులకి మంచి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ముస్లిములం అయిపోయామంటూ, ముస్లిములతో ఉంటూనే, వారిలో ఇస్లాం ధర్మంపై అనుమానాలను తీసుకువచ్చి, 'ఇస్లాం' ధర్మాన్ని నాశనం చేయాలని ప్రయత్నించారు. ఫలితం - చివరకు వారే నాశనమయ్యారు.

యూదులతో ఈ సమస్య తీరిపోలేదు. ప్రస్తుతం అటువంటి మోసపూరిత కార్యక్రమాలను తూర్పుగోదావరి జిల్లాలోని ఓ సంస్థ చేస్తుంది. వారి కార్యకలాపాలు చాపకింద నీరులా రాష్ట్రమంతా వ్యాపిస్తున్నాయి.

వీరు తమకు అనుకూలంగా ఉండే తెలుగులోని ఖుర్'ఆన్ అనువాదాన్ని తీసుకుని, సందర్భాన్ని వదిలేసి, ఏదో ఒక వాక్యాన్ని తీసుకుని, ముస్లిములలో అనుమానం కలిగేలా చేస్తూ, అల్లాహ్‌పై వారికున్న విశ్వాసాన్ని రూపుమాపాలని ప్రయత్నిస్తున్నారు. ముస్లిములు ఇవేమీ పట్టించుకోకుండా గాఢనిద్రలో ఉన్నారు కాబట్టి, ఇప్పటికే ఇస్లాం ధర్మంపై చెడు ప్రచారాన్ని వారు చాలా వరకూ చేయగలిగారు. చేస్తున్నారు.

అందుకే ఖుర్'ఆన్‌ను బాగా అధ్యయనం చేయండి. అవగాహనను పెంచుకోండి. మీకర్థమై, అవగాహన కలిగిన విషయాలను తోటి ముస్లిం సోదరులకు మరియు ముస్లిమేతరులకు వివరించండి. అలా జరిగిననాడు, ఇలాంటి కపట విశ్వాసులు పలాయనం చిత్తగిస్తారు.

అలాంటి దుర్మార్గులనుండి భవిష్యత్తులో మీ పిల్లలను కాపాడుకోవడానికి అల్లాహ్ పేరుతో కృషి చేయండి. అందుకొరకు కూడా ఈ శీర్షిక ఉపయోగపడేలా ఉండాలని అల్లాహ్ పేరుతో ప్రయత్నిస్తున్నాము.

అనువాదాలు మానవులు చేసేవి. వాటిలో దోషాలు తప్పనిసరిగా ఉంటాయి. అందుకే అరబీ నేర్చుకోండి. అల్లాహ్ వాగ్దానం చేశారు కాబట్టి, ప్రళయం వచ్చేవరకూ ఖుర్'ఆన్ గ్రంథంలోని అరబీ వాక్యాలను ఎవరూ వక్రీకరించలేరు. మా ఉద్దేశ్యం అనువాదాలు, వ్యాఖ్యానాలు చదవవద్దని కాదు. మీకు అందుబాటులో ఉన్న అన్ని అనువాదాలను దగ్గరుంచుకుని చదవండి. అల్లాహ్ మీకందరికీ మేలు చేయుగాక! (ఆమీన్)

ఈ వ్యాసంలో వివరించిన సైన్స్ ఆఫ్ తఫ్సీర్‌ని 'ముఫ్తీ ముహమ్మద్ షఫీ ఉస్మానీ వారి 'మారిఫుల్ ఖుర్'ఆన్' యొక్క ఇంగ్లీష్ అనువాదం నుండి గ్రహించడం జరిగింది. వారికి కృతజ్ఞతలతో శాంతిబాట టీమ్

ప్రపంచ శాంతి దూత

సన్మార్గ బోధకుడు
నాయకుడు
ఆదర్శనీయుడు

# ముహమ్మద్ (స) వారి

## బోధనలు ఆచరణలు

మంచిగా మానవత్వంతో బ్రతకమనే హితబోధను ప్రతి మనిషి తన ఊహతెలిసిన దగ్గరనుండి వింటూనే ఉంటాడు. అయితే ఏది మంచి? ఏది చెడు? కొంతమంది తమ దృష్టిలో ఫలానా విషయం మంచిది అని సమర్థిస్తారు. అదే విషయాన్ని మరికొందరు పూర్తి చెడుగానూ తీసుకుంటారు. అంతెందుకు, ఒకే మనిషిలో ఒకే పనిపై, తన జీవితంలోని వివిధ దశలలో వేర్వేరు అభిప్రాయాలు జనిస్తాయి. నిజంగా మంచి చెడులపై మనుషులయొక్క వ్యక్తిగత అభిప్రాయాలనే గనుక పరిగణనలోకి తీసుకుంటే, అన్ని పనులూ మంచి పనులే. అలాగే అన్నీ కూడా చెడ్డపనులే అవుతాయి.

కేజీ బరువున్న వస్తువును, ప్రపంచంలో ఎక్కడకు తీసికెళ్లినా అది కేజీ బరువే ఉంటుంది. అలాగే కొలతలకు కూడా ప్రపంచవ్యాప్తంగా ఒకటే ప్రమాణముంది.

మరి మనిషి జీవనానికి లేదా ఆచరణకు ప్రపంచవ్యాప్తంగా అలాంటి ఓ ప్రమాణం లేదా? ప్రపంచంలోని ఏ మారుమూలనుండి ఏ వ్యక్తిని తీసుకున్నా, అతని శారీరక నిర్మాణం, అతని అవయవాల పనితీరు తదితర అంశాలన్నీ మిగతా ప్రాంతాలలోని మనుషులలాగే ఒకే విధంగా ఉంటాయి కదా!

మనిషి అనే ఈ జీవయంత్రాన్ని తయారుచేసి, దానికి అవసరమైన పోగ్రామింగ్‌ను చేసిన సృష్టికర్తకే తెలుసు - ఈ మనిషికి ఏది మంచి చేస్తుందో, ఏది చెడు చేస్తుందోనన్న విషయం.

మంచి చెడుల ప్రమాణాలు ఖుర్‌ఆన్‌లో ఉన్నాయి. అయితే ఆ ప్రమాణాల ప్రకారంగా ఎటువంటి సందేహానికి లోనవకుండా ఉండేందుకు ముహమ్మద్(స) మనందరి శిక్షణకై ఎన్నో విషయాలను ఆచరించి చూపారు. ఖుర్‌ఆన్ యొక్క ఆదేశాల ప్రకారంగా దైవప్రవక్త ముహమ్మద్ (స)ఆచరించిన పనులను మరియు ఆయన యొక్క ప్రవచనాలను హదీస్‌లు అంటారనే విషయం చాలామందికి తెలుసు. సమకాలీన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, వేల సంఖ్యలో ఉన్న హదీసులలోని కొన్ని హదీసులను ఎన్నుకొని ఈ శీర్షిక ద్వారా ఇన్షాఅల్లాహ్ అందిస్తూ ఉంటాము.

**క్రిందటి సంచికలో సుందర సమాజ స్థాపనలో 'విద్య' యొక్క ప్రాముఖ్యతను ముహమ్మద్(స) బోధనల ద్వారా వివరించడం జరిగింది. ఆ బోధనలను అర్థం చేసుకుని, ముస్లిములు తొలి యూనివర్శిటీ స్థాపకులుగా, ఆధునిక సైన్స్‌కి వ్యవస్థాపక శాస్త్రవేత్తలుగా ఉన్నతస్థితికి చేరుకున్నారు. ఆ పూర్వ వైభవం మరలా రావాలంటే హదీసు జ్ఞానమెంత అవసరమో తెలియజేయడం జరిగింది. ఈ నెల ఎన్నుకున్న విషయం 'వడ్డీ'. సమాజాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో 'విద్య'కు ఎంత ప్రాముఖ్యత ఉందో, సమాజాన్ని సర్వనాశనం చేయగల సామర్థ్యం అంతకంటే ఎక్కువగా 'వడ్డీ'కి ఉంది.**

2

## ఈనెల వెలుగు వడ్డీ / అధర్మ సంపాదన

**హజ్రత్ అబూహురైరా(రజి) ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త(స) ఇలా చెప్పారు: "ఏడు మహా వినాశనకరమైన పాపాలకు దూరంగా ఉండండి". దానికి సహచరులు "దైవ ప్రవక్తా! ఏమిటవి?" అని అడిగారు. ఆయన చెప్పారు : "అల్లాహ్‌కు సహవర్తుల్ని నిలబెట్టడం, చేతబడి చేయటం, అల్లాహ్ నిషిద్ధం చేసిన ప్రాణిని అన్యాయంగా చంపటం, వడ్డీ తినటం, అనాథుని సొమ్ము తినటం, శతృవులతో యుద్ధం జరిగినప్పుడు వెన్ను చూపి పారిపోవడం, అమాయకులూ, సౌశీల్యవతులూ అయిన విశ్వాస స్త్రీల మీద అభాండాలు వేయటం.**
(సహీహ్ బుఖారి, నెం. **2766**, *సంపుటి 4, వసాయా పుస్తకం, 23వ అధ్యాయం: 'అల్లాహ్ యొక్క ఆదేశం'* )

حدَّثنا عَبْدُ العَزيز بنُ عَبْدِ اللهِ قالَ : حدَّ
ثَني سُلَيمانُ بنُ بلال، عَنْ ثَوْرِ بنِ زَيْدٍ
المَدَنيِّ عَنْ أبي الغَيْثِ، عَنْ أبي هُرَيْرَةَ
رَضِيَ اللهُ عَنْهُ عَنِ النَّبيِّ (ﷺ) قالَ
:((اجْتَنِبُوا السبعَ الموبِقاتِ)) قالُوا : يا
رسولَ الله، وما هُنَّ؟ قالَ: ((الشِّرْكُ باللهِ،
والسِّحْرُ، و قَتْلُ النَّفس الَّتي حَرَّمَ اللهُ إلَّا
بالحَقِّ، وأكْلُ الرِّبا، وأكْلُ مالِ اليَتيم،
والتَّوَلِّي يَوْمَ الزَّحْفِ، وقَذْفُ المُحْصَناتِ
المُؤْمِناتِ الغافِلاتِ

ఇస్లాం ధర్మం మన అభ్యున్నతి కోసం 'విద్య' యొక్క అవసరాన్ని తెలియజేస్తూ ఓ మంచి మార్గాన్ని చూపెట్టినప్పటికిని అది హితబోధ మాత్రమేగాని, ఆదేశం (ఆజ్ఞ) ఎంత మాత్రం కాదు. తప్పనిసరిగా చేయవలసిన పనికాదు. కాని ఆ హితబోధను అనుసరిస్తే ఎంతో లాభదాయకమన్న విషయం - ఓ చారిత్రక సత్యం.

విద్య వలన సమాజమెంత సుందరమౌతుందో తెలుసుకున్నాం. వడ్డీని ఇస్లాం ధర్మం హరామ్(నిషిద్ధం) చేసేసింది.

**"... అల్లాహ్ వ్యాపారాన్ని హలాల్ (ధర్మ సమ్మతం) చేశాడు మరియు వడ్డీని హరామ్(నిషిద్ధం) చేశాడు..."** (దివ్య ఖుర్'ఆన్ 2:275)

కనుక ముస్లిములందరూ ఆ నిషేధాన్ని అమలుపరచక తప్పదు. ఇది ఆదేశం! ఇది అల్లాహ్ యొక్క ఆజ్ఞ. పై అల్లాహ్ ఆజ్ఞను ఎవడైనా తిరస్కరించి వడ్డీని హలాల్ అని చెబితే వాడు కాఫిర్ అవుతాడు.

'వడ్డీ' మహా వినాశనకరమైన పాపాలలో ఒక పాపంగా చెప్పబడిందంటే, అది సమాజానికి ఎంత ప్రమాదకారో అర్థం చేసుకోండి.

అయితే ఇస్లాం ధర్మం 'వడ్డీ'ని ఎందుకు పాపంగా నిర్ణయించింది? దీని వలన సమాజానికి ఏ రూపంలో నష్టం జరుగుతుంది?

అసలు నిజం 'సృష్టికర్త అయిన అల్లాహ్'కే తెలుసు. అయితే ఈ విషయంలో మా అనుభవాలను కొన్ని మీ ముందుంచి, మా అభిప్రాయాలను మీతో పంచుకోవాలను కుంటున్నాము.

వ్యాపారం చేయడాన్ని ఇస్లాం ధర్మం హలాల్ చేసింది. వ్యాపార లావాదేవీలకై కొన్ని నియమాలను కూడా ఏర్పాటు చేసింది. వ్యాపారమన్నాక లాభనష్టాలుంటాయి కదా! అన్ని వ్యాపారాలలాగే 'వడ్డీ వ్యాపారం' కూడా ఓ వ్యాపారమేనని కొంతమంది భావిస్తున్నారు. అది వ్యాపారం ఎంతమాత్రం కాదని పైన ఇచ్చిన ఖుర్'ఆన్ ఆయత్ ద్వారా స్పష్టంగా తెలుస్తుంది. డబ్బును ఏదైనా ఓ వ్యాపారంలో పెట్టుబడిగా పెట్టవచ్చుగాని, డబ్బునే వ్యాపార వస్తువుగా చేయకూడదు.

అల్లాహ్‌పై భరోసాతో ఇస్లాం ధర్మం ప్రకారంగా బ్రతికేవారికి ఈలోకంలోనూ, పరలోకంలోనూ మేలు జరుగుతుందని ఖుర్'ఆన్ మరియు హదీస్ గ్రంథాల ద్వారా స్పష్టంగా చెప్పడం జరిగింది.

అయితే ఇక్కడ ఇహలోకంలో మేలు అనగానే, దాని గురించి కొందరు మరో విధంగా భావించవచ్చు. దైవం ఈ లోకంలో మేలు చేయడం అంటే అమితంగా డబ్బు, బిల్డింగ్‌లు, కార్లు, ఎటువంటి లోటు లేని ఖరీదైన జీవితాన్ని ప్రసాదించడంగా తలపోస్తున్నారు.

కాని అల్లాహ్ మేలును పొందినవారు ఈ లోకంలో ఎటువంటి భయాందోళనలకు లోనుకాకుండా నిత్యం సంతోషంగా బ్రతుకుతారు. అది పేదవాడిగానైనా కావచ్చు. లేదా ధనవంతుడిగానైనా కావచ్చు.

సంతోషమనేది కష్టాలు లేదా సుఖాలతో ముడిపడి ఉండదు. అది మానసికమైనది.

ఇక పరలోకంలోని మేలు గురించిన నిజాన్ని ప్రజలు తెలుసుకుంటే 'ధర్మాన్ని' ఎలాంటి పరిస్థితులలోను విడిచిపెట్టలేరు అని వివరించే హదీసులు (ముహమ్మద్(స) వారి బోధనలు) చాలానే ఉన్నాయి.

హరామ్ (నిషిద్ధ) కార్యాలు చేసేవారికి పరలోకంలో నరకమే నివాసమని ఖుర్'ఆన్ స్పష్టం చేసింది. స్వర్గ, నరకాల గురించి ప్రత్యేకంగా వేరే వ్యాసంలో చర్చిద్దాం. ఈ చెడుకార్యాలు చేసేవారు ఎటువంటి పరిస్థితికి లోనవుతారు?

"చెడుమార్గాల ద్వారా సంపాదించిన వాళ్లు, చాలా ఆనందంతో బ్రతుకుతూ ఐశ్వర్యంలో మునిగి తేలుతున్నారని, మంచికే ఈ లోకంలో విలువలేదనీ, దేవుడు చెడ్డవాళ్లకే అన్నీ ఇస్తున్నాడు" అని చాలామంది ఆడిపోసుకోవడాన్ని మనం చూస్తూనే ఉంటాం. దూరం నుండి కొండలు నునుపు (smooth)గా ఉన్నట్లు కనిపిస్తాయి. కాని దగ్గరికెళ్లి చూస్తే గాని అందులోని ఎగుడు, దిగుడులు మనకు కనిపించవు.

మీరు నివశించే చోట అక్రమంగా సంపాదించేవారిని, వారి కుటుంబ సభ్యులను జాగ్రత్తగా గమనించండి. గమనించడం అంటే ఒకటీ, రెండు వారాలు కాదు. చాలాకాలం గమనించవలసి ఉంటుంది. గమనించాక మీకు, ఇన్షా అల్లాహ్, ఓ విషయం తెలుస్తుంది - వారి ఖరీదైన జీవితం కంటే మీ సాధారణ జీవితం ఎంత గొప్పదోనని. ఇక ఈ నెల ప్రత్యేకం - 'వడ్డీ' విషయానికొద్దాం.

**చీటిపాటలు** లేదా **చిట్‌ఫండ్స్** గురించి అందరికీ తెలిసిన విషయమే! ఈ చిట్స్ మరియు వడ్డీ వ్యాపారాలు చేసే ఓ మూడు కుటుంబాలను ఎన్నో సంవత్సరాలుగా శాంతిబాట టీమ్‌లో ఒకరినైన నేను గమనిస్తూనే ఉన్నాను. అందులోని 2 కుటుంబాలతో నాకు బంధుత్వం కూడా ఉంది. ఈ ముగ్గురికి వారి పరిచయస్థులలో మంచి పేరు కూడా వుంది. అలాగే ఆయా వ్యక్తులు చెడ్డవారు కూడా కాదు.

అయితే ఈ చీటిపాటలు (చిట్స్) మనదేశ చట్టప్రకారం అనుమతించబడిన వ్యాపారాలే కాబట్టి, వారు ఈ వ్యాపారం మామూలుగానే చేస్తూ ఉండేవారు. ఈ వ్యాపారం చట్ట వ్యతిరేకం కాదు కాబట్టి, ధర్మంగానే భావించారు. వారు చేసే వ్యాపారం పాపమని ఎప్పుడూ తలచలేదు.

దాదాపుగా తమ 50వ యేట వీరిలో ఇద్దరు చిట్‌ఫండ్ వ్యాపారం ద్వారా పూర్తిగా దివాళా తీశారు. కష్టమర్లచే అవమానించబడ్డారు. ఎంత వెలుగు వెలిగి గౌరవాన్ని పొందారో, చివరికి అంతకంటే ఎక్కువ అవమానాన్నే పొందారు. ముగ్గురూ దైన్య స్థితిలో మరణించారు. వారిలో ఒకరు మానసికంగా దెబ్బతిని, బలహీన స్థితిలో ఇల్లు వదిలి వెళ్లిపోయి, ఎక్కడ మరణించారో, వారి కుటుంబ సభ్యులకు కూడా తెలియలేదు. చాలాచోట్ల వెతికినా ఆయన దొరకలేదు. కనీసం ఆయన శవం కూడా దొరకలేదు.

ఈ ముగ్గురి కుటుంబాలలోని వారి పిల్లలు, మనవళ్ల, మనవరాళ్ళ

జీవితాలలో కూడా ఓ పోలిక కనిపించింది. వారందరి జీవితాలు ఒకే విధంగా కుటుంబ కలహాలతో, మనశ్శాంతి లేకుండా గడుపుతున్నారు. మరి వీరి జీవితాలు ఇలా కావడానికి కారణం, వారి పెద్దల వడ్డీ సంపాదనచే పోషించబడటం వలనా? లేక మరేదైనా కారణమా? ఈ విషయం అల్లాహ్‌కే తెలియాలి.

అల్లాహ్ నిషేధించిన వాటి ద్వారా అక్రమంగా సంపాదించి, తమ పిల్లలకు మంచి కట్నాలు, అంతేకాకుండా వారు సుఖంగా బ్రతకడానికి మంచి ఖరీదైన వస్తు సామాగ్రి, బిల్డింగ్స్ ఏర్పాటు చేశామని భావిస్తారు. కాని పైన చెప్పినట్లు వారు అనుకున్నది ఒకటయితే, జరిగేది మరొకటి.

**మరో వాస్తవ ఉదాహరణ:** ఈ కుటుంబాల వలే కాకుండా, మరో భిన్న కుటుంబాన్ని గత 20 సం॥లుగా గమనిస్తున్నాను. ఈ కుటుంబంలోని సభ్యులందరూ అంటే భార్యభర్తలిరువురూ, పిల్లలు ముగ్గురూ, ఇంట్లో ముసలి వారిద్దరూ కలిసి ఉదయం నుండి అర్ధరాత్రి వరకూ కష్టపడుతూనే ఉంటారు. కాని వారి ఆర్థిక స్థితి, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు, మెరుగుపడలేదు. కారణమేమిటంటే వారి వ్యాపారానికి అవసరమైన సొమ్మును ఫైనాన్సియర్‌ల దగ్గర తీసుకుంటారు. వారు అత్యధిక వడ్డీకి అప్పు ఇస్తారు. ప్రతిరోజూ కలెక్షన్‌కి వచ్చి, చిరువ్యాపారులు రోజంతా కష్టపడి సంపాదించిన దానిలోనుండి ఎక్కువ భాగాన్ని వడ్డీ రూపంలో తీసుకుంటారు. ఫైనాన్స్ చేసేవాడు కష్టపడడు గాని, కష్టపడేవారి కష్టాన్ని మాత్రం దోచుకుంటాడు. ఇలాంటి చిరు వ్యాపారులకి, చేబదులుగా తోటి వ్యక్తులు సహాయం చేస్తే కష్టపడే కుటుంబాలు ఒడ్డున పడతాయి.

'వడ్డీ' సొమ్ము పాపమని తెలుసుకుని, తీసుకోవడం మానుకుని, అవసరంలో ఉన్నవాడికి చేబదులుగా సాయంచేస్తే, ఇటువంటి చిరు వ్యాపారులు జీవితంలో నిలదొక్కుకో గలుగుతారు.

**అల్లాహ్ వడ్డీని నిషేధించారని తెలిసినా సరే, కొందరు విద్వాంసులు/ విద్వాంసులుగా ఊహించుకునేవారు, గవర్నమెంట్ బ్యాంకుల నుండి వడ్డీ తీసుకోవచ్చని, మనమేమీ బలవంతంగా వడ్డీ వసూలు చేయటం లేదని, ఎవరినీ బాధపెట్టడం లేదని మూర్ఖంగా మాట్లాడుతూ ప్రజలను తప్పు దారి పట్టిస్తున్నారు.**

మనం బ్యాంకులో దాచుకున్న సొమ్ముతో బ్యాంకు వారు వడ్డీ వ్యాపారం చేసి, ఆ వచ్చిన వడ్డీలో వారు కొంత తీసుకుని మనకు కొంత ఇస్తారు. కాబట్టి పరోక్షంగా బ్యాంకు ద్వారా మనం వడ్డీ వ్యాపారం చేసినట్లే. బ్యాంకు వారికి అప్పు తీసుకున్నవారు వడ్డీ చెల్లించకపోతే, అప్పు తీసుకున్నవాని ఆస్తులను బ్యాంకువారు జప్తు చేస్తారు లేదా వేలం వేస్తారు లేదా అతనిని జైలులో పెట్టిస్తారు. కాబట్టి బ్యాంకువారు చేసే ఈ వ్యవహారాలన్నింటిలో మనకి కూడా భాగం ఉన్నట్లే కదా!

ఆడపిల్లల పెళ్ళిళ్లు చేయడం కోసం, బ్యాంకులో ఫిక్సెడ్ డిపాజిట్ చేసి, ఆ వచ్చిన మొత్తాన్ని కట్న రూపేణా ఇచ్చి పాప పెళ్లి చేయగలిగానని సంతోషపడటం సర్వసాధారణంగా జరుగుతున్న విషయం. కాని ఆ సొమ్ము నుపయోగించుకున్న కుటుంబ పరిస్థితి భవిష్యత్తులో ఏమవుతుంది?

వారికి ఆ విషయం మాత్రం తెలియదు. **'వడ్డీ' మహా వినాశనకరమైన పాపాలలో ఒకటి అని వారికి తెలిస్తే జాగ్రత్త పడేవారేమో!**

ఒకవేళ పైన చెప్పిన వాస్తవ సంఘటనలపై మీకు అనుమానముంటే, ఆ అనుమానాన్ని తీర్చుకోవడానికై ఈ రోజు నుండే పరిశోధన ప్రారంభించండి.

అలాగే అవినీతి ద్వారా సంపాదించే వారు, తమ పిల్లల భవిష్యత్తుకు సిరిసంపదలు అందజేస్తున్నాం కాబట్టి తమ పిల్లలు కాలు మీద కాలు వేసుకుని సంతోషంగా తిన్నా సరిపోతుంది అనుకుంటారు. "అవినీతి సొమ్ము హాస్పిటల్ ఖర్చులకే" అనే నానుడి మనరాష్ట్రంలో ఎప్పటినుండో వాడుకలో ఉంది.

కాని అవినీతిపరుని ఆలోచన మాత్రం మరో విధంగా ఉంటుంది. తను ఇంత డబ్బు అక్రమంగానైనా సంపాదించాను కాబట్టే, ఈ రోజు ఇంత పెద్ద కార్పోరేట్ హాస్పిటల్‌లో వైద్యం చేయించుకో గలిగానని అనుకుంటాడు.

కాని ఇలా అక్రమంగా సంపాదించకపోతే, హాస్పిటల్‌కి వెళ్లవలసిన అవసరం అసలు రాకపోవచ్చేమోనని అనుకోడు. ఈ లాజిక్‌ని అర్థం చేసుకుంటే, సంతోష జీవనానికి తొలి అడుగు వేసినట్లే.

వడ్డీకి సంబంధించి, దైవప్రవక్త(స) వారి మరొక బోధనను బట్టి, వడ్డీలో 73 స్థాయిలున్నాయని, వాటిలోని అత్యంత హీనమైన స్థాయి యొక్క పాపం (గరిష్ఠ పాపం) ఏమిటంటే **ఒక వ్యక్తి తన కన్నతల్లిని పెళ్ళాడటం** వంటిదని అర్థమౌతుంది[1].

మరో ప్రవచనం ప్రకారం, (1) వడ్డీ తీసుకునే వారినీ (2) ఇచ్చేవారినీ, (3) ఈ లావాదేవీలను గురించి వ్రాసేవారినీ, (4) దీనికి సాక్షులుగా ఉండేవారినీ, ప్రవక్త(స) ధూత్కరించారని, వారంతా సమానులే అని చెప్పినట్లు తెలుస్తుంది[2].

వడ్డీ వలన అంతా నష్టమే. దాని వలన పొందిన సుఖమేదైనా ఉంటే అది నీటిబుడగ లాగ తాత్కాలికమే! కష్టపడి సంపాదించాలి.

**తన చేతి సంపాదనతో చేసిన భోజనం కంటే మంచి భోజనం మనిషి ఎప్పుడూ చేయలేదు.** దైవప్రవక్త దావూద్ (అ) స్వహస్తాలతో పనిచేసి, సంపాదించి భుజించేవారు'' అని బోధించారు మహనీయ ముహమ్మద్(స) (బుఖారి)

పిల్లలకు కూడా కష్టపడి బ్రతకాలన్నది నేర్పాలి. తమ పిల్లలు కష్టపడ కూడదని, తల్లిదండ్రులు వడ్డీ ద్వారా సంపాదించిన ధనరాశులను తమ పిల్లలకు అందిస్తే, వారికిచ్చిన ఆ వారసత్వ సంపద - సంపద ఎంతమాత్రం కాదు, తమ పిల్లల జీవితాలను బుగ్గిపాలు చేసే అగ్ని మాత్రమే.

1. హదీసు మకరందం, 2వ భాగం, హదీస్ నెం. 696, పేజీ 38
2. హదీసు మకరందం, 2వ భాగం, హదీస్ నెం. 695, పేజీ 37 (అల్-హాఖ్ పబ్లికేషన్స్, హైదరాబాద్)

మరి తల్లిదండ్రులు పిల్లలకు ఎటువంటి సంపద అందించాలో క్రిందటి సంచికలో వివరించాము.

ఆ సంపద వృద్ధి పొందుతూ ఉంటుంది. సంతోషంగా బ్రతకడానికి ఆ సంపదే ఎంతో విలువైన పెట్టుబడి అవుతుంది. ఇటువంటి (చదువు, సభ్యాతా సంస్కారాల) సంపదే - పిల్లలను శాంతిబాటలో పయనించేలా చేస్తుంది.

జిబహ్ చేయబడలేదని తెలిస్తే మటన్నుగాని, చికెన్నుగాని ముస్లిం సోదరులు తినరు. తినే విషయంలోనే 'హరామ్'కి దూరంగా ఉండే ముస్లిం సోదరులు, హరామ్ మాత్రమే కాకుండా మహావినాశనకరమైన పాపంగా వివరించబడిన వడ్డీకి దూరంగా ఉన్నారా?

సంతోషమయ జీవితం కోసం అల్లాహ్ చూపిన బాటలో 'వడ్డీ'కి స్థానం లేదు.

మనల్ని నాశనం చేసే వడ్డీ వద్దు. సంతోషమే ముద్దు.

- పొగత్రాగడం ఆరోగ్యానికి హానికరం
- ఆల్కహాలు సేవించడం ఆరోగ్యానికి హానికరం
- 'వడ్డీ' సొమ్ము తినడం అన్నింటికంటే హానికరం

**'వడ్డీ' గురించి ఖుర్'ఆన్ గ్రంథంలో తెలుపబడిన కొన్ని వాక్యాలు :**

"ఎవరైతే వడ్డీ తింటారో, వారి స్థితి (పునరుత్థాన దినమున) షైతాన్ తాకడం వల్ల భ్రమపరచబడిన వ్యక్తి స్థితి వలె ఉంటుంది. ఇది ఎందుకంటే వారు : వ్యాపారం కూడా వడ్డీ లాంటిదే అని చెప్పడం. కాని అల్లాహ్ వ్యాపారాన్ని హలాల్ (ధర్మ సమ్మతం) చేశాడు మరియు వడ్డీని హరామ్ (నిషిద్ధం) చేశాడు. కనుక తన ప్రభువు చేసిన ఈ హితబోధ అందే వ్యక్తి ముందు వడ్డీ తినటం త్యజిస్తే, అతను పూర్వం తిన్నదేదో తిన్నాడు. అతని వ్యవహారం చివరకు అల్లాహ్ వద్దకే పోతుంది. (ఈ ఆదేశం తరువాత ఈ చెడు వ్యవహారానికి) పాల్పడేవారు నరకవాసులవుతారు. అక్కడ వారు శాశ్వతంగా ఉంటారు." **(దివ్య ఖుర్'ఆన్ 2:275)**

"అల్లాహ్ వడ్డీని నశింపజేస్తాడు మరియు దానధర్మాలను పెంచి అధికం చేస్తాడు మరియు సత్యతిరస్కారుడు (కాఫిర్), పాపిష్టుడు అయిన వ్యక్తిని అల్లాహ్ ప్రేమించడు." **(దివ్య ఖుర్'ఆన్ 2:276)**

"ఓ విశ్వాసులారా! మీరు (నిజంగా) విశ్వాసులే అయితే, అల్లాహ్‌కు భయపడండి. మీకు రావలిసిన వడ్డీని విడిచి పెట్టండి." **(దివ్య ఖుర్'ఆన్ 2:278)**

"కాని ఒకవేళ మీరు అలా చేయకపోతే, అల్లాహ్ మరియు **ఆయన సందేశహరుని తరపు నుండి యుద్ధ ప్రకటన ఉందని తెలుసుకోండి**. కాని మీరు పశ్చాత్తాప పడితే (వడ్డీ వదులుకుంటే), మీ అసలు సొమ్ము మీకు లభిస్తుంది. మీరు అన్యాయం చెయ్యకూడదు. మీకు అన్యాయం జరుగకూడదు".

**(దివ్య ఖుర్'ఆన్ 2:279)**

"మరియు (మీ బాకీదారుడు ఆర్థిక) ఇబ్బందులలో ఉంటే, అతని పరిస్థితి కుదిరేవరకూ గడువునివ్వండి. ఒకవేళ మీరు దానమని వదిలిపెడితే అది మీకు ఎంతో మేలైనది. ఇది మీకు తెలిస్తే (ఎంత బాగుండేది)! **(దివ్య ఖుర్'ఆన్ 2:280)**

"ఓ విశ్వాసులారా! ఇబ్బడి ముబ్బడిగా పెరిగే ఈ వడ్డీని తినటం మానండి. అల్లాహ్‌కు భయపడండి. మరియు సత్య తిరస్కారుల (కాఫిర్ల) కొరకు సిద్ధం చేయబడిన నరకాగ్నికి భీతిపరులై ఉండండి." **(దివ్య ఖుర్'ఆన్ 3:130-131)**

క్రింది వాక్యం యూదులను ఉదహరిస్తూ చెప్పబడింది.

"మరియు వాస్తవానికి, వారికి నిషేధింపబడినా, వారు వడ్డీని తీసుకోవటం వలననూ మరియు వారు అధర్మంగా ఇతరుల సొమ్మును తినటం వలననూ, మరియు వారిలో అవిశ్వాసులైన వారి కొరకు మేము బాధాకరమైన శిక్షను సిద్ధపరచి ఉంచాము." **(దివ్య ఖుర్'ఆన్ 4:161)**

"ప్రజల సంపదలో చేరి పెరగాలని మీరు ఇచ్చే వడ్డీ అల్లాహ్ దృష్టిలో పెరగదు. అల్లాహ్ ప్రసన్నతను పొందే ఉద్దేశ్యంతో, మీరు ఇచ్చే జకాత్ - దానిని ఇచ్చేవారే వాస్తవంగా తమ సంపదను వృద్ధి చేసుకుంటారు. **(దివ్య ఖుర్'ఆన్ 30:39)**

సాధారణంగా ఏదైనా ఒక విషయంపై ఖుర్'ఆన్‌లో ఇవ్వబడిన వాక్యాలు మనకి అర్థంకావడం కష్టమై, వివరణ అవసరం అయినప్పుడు, ముహమ్మద్(స)వారి బోధనలను (హదీస్‌లను) రిఫర్ చేస్తాము. హదీస్‌లలో మనకి స్పష్టమైన వివరణ దొరుకుతుంది.

కాని పైన తెలిపిన ఖుర్'ఆన్ వాక్యాల ద్వారా వడ్డీ నిషేధించబడిందని, వడ్డీని తినడం మాని అల్లాహ్‌కు భయపడాలని స్పష్టంగానే తెలుస్తుంది. ఈ విషయంలో వివరణ అవసరం ఎంత మాత్రం లేదు. అయినప్పటికిని ఈ విషయంపై ముహమ్మద్(స) వారు చేసిన బోధనలను బట్టి, ఇది **ఒక మహావినాశనకరమైన పాపమని**, కొడుకు కన్నతల్లిని పెళ్లాడటంతో సమానమని చాలా స్పష్టంగా తెలుస్తుంది.

ఈ వ్యాసం చదివిన పాఠకులను మరియు ఇతరులను వడ్డీకి దూరంగా ఉంచమని అల్లాహ్‌ను వేడుకుంటున్నాము - **శాంతిబాట టీమ్**

---

ఓడలు బళ్ళు అవుతాయి. బళ్ళు ఓడలవుతాయి అంటారు. అంటే కోటీశ్వరుడు బిచ్చగాడు కావచ్చు, సాఫ్ట్‌వేర్ రంగంలో రాజులుగా చలామణి అయినవారు జైలులోనూ గడపవచ్చు. సమాజంలోని ఆర్థిక అసమానతలకు కారణభూతమైన ఈ వడ్డీ గురించి మరిన్ని వివరాలు .....

**(ఇన్షాఅల్లాహ్ వచ్చే సంచికలో)**

# తిరిగి గూటికి

ప్రారంభంలో చెప్పుకున్నట్లు, దైవధర్మం అనేది ఏ ఒక్కరి సొత్తో కాదు. ప్రకృతిలాగే ఇది అందరికీ చెందుతుంది. ఈ వాస్తవాన్ని ఆలస్యంగానైనా సరే చాలా మంది తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం ఇస్లాం (శాంతి) ధర్మం ప్రపంచంలో అత్యంత వేగంతో విస్తరిస్తుంది. ఈ ధర్మంపై బురద చల్లడానికి పాశ్చాత్యులు చేస్తున్న కృషి వలన, ఈ ధర్మవ్యాప్తి తగ్గడానికి బదులు దీని వేగం మరింత పెరుగుతూ వస్తుంది. ప్రస్తుతం అమెరికాలో ప్రతీ సంవత్సరం సగటున 20,000 మంది ఇస్లాం ధర్మంలో ప్రవేశిస్తున్నారు. మన దేశంలో, మన రాష్ట్రంలో కూడా ఈ దైవ ధర్మాన్ని చాలామంది తెలుసుకుని, ఈ ధర్మంలో ప్రవేశిస్తున్నారు. ఈ ధర్మాన్ని ఆచరించడం అనేది 'మత మార్పిడి' ఎంత మాత్రం కాదు. దారి తప్పిన సోదరి లేదా సోదరుడు తిరిగి తన పయనించవలసిన దారిని చేరుకోవడం లాంటిది. ఇలా తిరిగి గూటికి చేరుకున్న ఓ సోదరి గురించి గాని, ఓ సోదరుని గురించి గాని ఈ శీర్షికలో పరిచయం చేయబడుతుంది.

ఇస్లాం ధర్మంలో అడుగిడిన వీరిని కొత్త ముస్లింలు లేదా నవముస్లింలు లేదా నౌ ముస్లింలుగా అభిమానంతో తోటి ముస్లిం సోదరసమాజం పిలుస్తుంది. అయితే ఇస్లాం పట్ల అవగాహన లేని కొంతమంది 'ముస్లిం' సోదరులుగాని, విద్వాంసులుగాని ఈ నవముస్లింల పట్ల ప్రవర్తించే తీరు కొంతమేర అభ్యంతరకరంగానూ, ప్రియ ప్రవక్త ముహమ్మద్ (స) వారి సాంప్రదాయానికి వ్యతిరేకంగానూ ఉంటుంది. ఇస్లాం పట్ల అవగాహన ఉన్నవారు వీరిని ఆప్యాయంగా అక్కున చేర్చుకుంటున్నారు. దారి తప్పిన తమ సోదరుడు లేదా సోదరి తిరిగి తన గూటికి చేరుకున్నారన్న ఆనందోత్సాహం వారిలో స్పష్టంగా కనిపిస్తుంది.

ఇస్లాం ధర్మాన్ని అవగాహన చేసుకుంటే, ఏ ధర్మానికి చెందినవారైనా సరే, ఇది ఖచ్చితంగా దైవధర్మమనే విషయాన్ని అంగీకరిస్తారు. కాని ఈ ధర్మాన్ని ఆచరించడానికి మనో ధైర్యం కావాలి. దైవ భీతికలవారికి ఇది సునాయాసంగా లభిస్తుంది. కుటుంబానికో, సమాజానికో భయపడటం వల్లనో లేదా ఇతరత్రా కారణాల వల్లనో దైవధర్మానికి చాలామంది దూరంగా ఉన్నారు.

అలాగే కొత్తగా దైవధర్మంలోకి వచ్చిన వారికి చాలా సందేహాలుంటాయి. ఒక్కసారిగా అన్ని పుస్తకాలనూ వారు చదువలేరు. ధర్మావగాహనకు కూడా కొంత సమయం పడుతుంది. అనుభవజ్ఞుల వివరణలు వీరికి చాలా అవసరం. ఇంతకు ముందరి జీవితంలోని కొన్ని అభ్యంతరకరమైన అలవాట్లు నుండి దూరం కావడానికి మరికొందరికి సమయం పడుతుంది. వారు ప్రారంభంలో ఓ ప్రత్యేకావస్థకు గురై ఉంటారు. వారికి ప్రవక్తగారి సాంప్రదాయ ప్రకారం సౌమ్యంగా, సహనంతో అన్ని విషయాలను ఆకళింపు చేసుకొనేలా చేయడం, వారికి తోడుగా ఉండడం మనందరి బాధ్యత.

ఈ శీర్షిక ద్వారా వీలుని బట్టి నవ ముస్లిం సోదరులకు ఎదురయ్యే ఇబ్బందులు, వాటిని సునాయాసంగా అధిగమించడానికి ఖుర్ఆన్, హదీసుల వెలుగులో పరిష్కారాలను కూడా అందించే ప్రయత్నం జరుగుతుంది.

---

## రుబా డి. ఖేవర్

**హైస్కూలులో చదివేటప్పుడు నమాజ్ చేసుకునే ముస్లిం బాలికలను కాలితో తన్నే ఈ సోదరి జోర్డాన్‌లో పెరిగారు. ఈమె తండ్రి నాలుగు చర్చ్‌లకు పాస్టర్. ఈమె కూడా ముస్లిములని క్రైస్తవులుగా మార్చాలనే ధృడసంకల్పంతో ఉండేవారు. ఉన్నత విద్యకోసం అమెరికాలోని టెక్సాస్ వెళ్ళిన ఈమె, అక్కడ మొరాకోకు చెందిన ఓ ముస్లిం సోదరునితో జరిగిన వాదన, ఆమె జీవితాన్నే మార్చి వేసింది. ఈమె ఇస్లాంని స్వీకరించారు. ఇస్లాం ధర్మాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తూ, ఓ వెబ్‌సైట్‌ని కూడా ఏర్పాటు చేసుకున్నారు.**

**"24 సంవత్సరాలుగా అవాస్తవ దైవాన్ని (మనిషిని) పూజించానా?"**

ఈమె ఇస్లాం ధర్మాన్ని అనుసరించడం ప్రారంభించగానే, ఈ సోదరిని తిడుతూ ఎన్నో ఫోన్ కాల్స్ ...
అవమానిస్తూ ఎన్నో ఈ-మెయిల్స్ ... ఫోన్‌లో తన పూర్వ ధర్మపు విద్వాంసుల నుండి వాదనలు ...
ముహమ్మద్(స)వారికి జరిగిన అవమానాలు, ఆయనకు కలిగిన కష్టాలతో పోలిస్తే, తనకు జరిగేవి లెక్కలోకి రావని,
సహనంతో, చిరునవ్వుతో జీవించడం ఇస్లాం నుండి నేర్చుకున్నాను అంటున్నారు.

''నేను ముస్లిముని అయ్యేంత వరకూ శాంతికోసం వెతుకుతూనే ఉన్నాను. అప్పటి వరకూ (ముస్లిమునయ్యేంత వరకూ) నాకు శాంతి దొరకలేదు. ఇస్లాం ధర్మాన్ని నేను ఒప్పుకోవడానికి జరిగిన ఈ అన్వేషణ సుదీర్ఘంగా సాగింది.''

## చర్చ్‌ల నుండి మస్జిద్‌లకు

సోదరి, రుబా, డెన్మార్క్‌లో క్రిస్టియన్ కుటుంబంలో పుట్టారు. పెరిగింది మాత్రం జోర్డాన్‌లో. ఆమె తండ్రి జోర్డాన్‌లోని 4 చర్చ్‌లకు పాస్టర్. ఆమె తల్లిగారు జోర్డాన్ సమాజంలోని క్రైస్తవ మహిళా నాయకురాల్లో ఓ గట్టి నాయకురాలు. ఇక మన సోదరి 'రుబా' చర్చ్‌లో యువనాయకురాలు. క్రైస్తవ మతధర్మానికి సంబంధించి చర్చ్ కమ్యూనిటీని ఈమె సూపర్‌వైజ్ చేస్తూండేవారు.

"నేను ముస్లిమ్‌ని అయ్యేంత వరకూ శాంతికోసం వెతుకుతూనే ఉన్నాను. అప్పటి వరకూ (ముస్లిమునయ్యేంత వరకూ) నాకు శాంతి దొరకలేదు. ఇస్లాం ధర్మాన్ని నేను ఒప్పుకోవడానికి జరిగిన ఈ అన్వేషణ సుదీర్ఘంగా సాగింది."

చిన్నతనం నుండే ఇస్లాం ధర్మాన్ని ద్వేషించే ఈ సోదరి 10వ తరగతి చదువుతున్నప్పుడు, ఒక రోజు ఓ అమ్మాయి నమాజ్ చేస్తుండగా చూసి, ఆ అమ్మాయి సజ్దాలో ఉన్నప్పుడు తన్ని తోసేసింది. హైస్కూలులో తోటి అమ్మాయిలతో పోట్లాటకు దిగేది. తను ఎంత విద్యావంతురాలో అందరికీ చూపాలని తనతో పాటు ఎప్పుడూ బైబిల్‌నుంచుకునేది. బైబిల్‌ని గట్టిగా చదివేవారు. ఒకొక్కసారి బైబిల్ నుండి ఓ వాక్యాన్ని బోర్డు మీద వ్రాసేవారు (ఆ వాక్యం ఆమె దృష్టిలో ఆ రోజు టిప్).

"రమదాన్ సమయంలో, ఉపవాసంలో ఉండే బాలికల ముందు తినేదాన్ని" (అల్లాహ్‌ను క్షమించమని మరియు నాపై కరుణ చూపమని వేడుకుంటున్నాను). ఈ విధంగా సోదరి తీవ్రమైన సమస్యలు సృష్టించేవారట.

(10+1) తరగతిలో, జరఖ హైస్కూల్‌లో ఇస్లామిక్ క్లాస్ జరిగేది. అక్కడే ఉండి టీచర్ చెప్పింది వినాలనుకున్నారు ఆమె. బైబిల్‌ని ముహర్రఫ్ (అంటే ఇంటర్‌ప్రెటెడ్ మరియు మార్చివేయబడినది) అని చెప్పేసరికి, ఆమెకి పిచ్చెక్కినట్లయింది.

"ఆమె వారికి ఇలా వివరించారు: "బైబిల్ - 4 వేర్వేరు పుస్తకాలుగా ఒకే సమయంలో, వేర్వేరు ప్రాంతాలలో, 4 గురు వ్యక్తులచే వేర్వేరుగా వ్రాయబడిందని" రుబా వారికి చెప్పింది.

అది వినగానే, ఓ అమ్మాయి ఇలా అంది :
"అంటే ఈవిల్ స్పిరిట్ ఆ పుస్తకాలు వ్రాయించిందని నీవు చెబుతున్నావా?" అంతే! అది వినగానే రుబాకు చాలా కోపం వచ్చింది. తరగతి గది వదిలేసి వచ్చేసి, ఆ అమ్మాయిలలోని ఏ అమ్మాయితోనూ మాట్లాడకూడదనుకుంది.

క్లాస్‌లోని అమ్మాయిలు ఆమె గురించి విస్తుబోతూ, అసలు ఆమె ఆధిక్యత ఏంటో తెలుసుకోవాలనుకున్నారు. అందుకని వారు రుబా ఖేవర్ దగ్గరికి వచ్చి ఆమె మతధర్మం గురించి ప్రశ్నించడం ప్రారంభించారు.

వారికి బైబిల్‌ని చూపుతూ, సమాధానాలిస్తూ, క్రైస్తవత్వం గురించి వారిని ఒప్పించడానికి సోదరి రుబా ఖేవర్ ఆధారాలను చూపుతుండేవారు.

ఈ కార్యక్రమం టీచర్ పిలిచేవరకూ జరుగుతూనే ఉంది. టీచర్ 'రుబా'ని పిలిచి, తన మతధర్మం గురించి స్కూలులో మాట్లాడటం ఆపమని, అది చట్ట వ్యతిరేకమని చెప్పారు. తను ఏమీ చేయలేదని టీచర్‌కి బదులిచ్చింది.

"నీవు అమ్మాయిలతో మాట్లాడిన మాటలు రికార్డ్ అయిన టేపు నా దగ్గరుంది" అని టీచర్ అనేసరికి, తనకు నిజంగా పిచ్చెక్కినట్లయిందని రుబా చెప్పారు.

ఇంతవరకూ ఆమెకి ముస్లిములంటే ద్వేషం మాత్రమే ఉండేది. ఇక ద్వేషించడమే కాకుండా, ఆమెలో కోపం కూడా మొదలైంది. ముస్లిముల నందరినీ, క్రైస్తవత్వంలోకి తీసుకురావాలనే సంకల్పంతో, తన ముస్లిం స్నేహితులను సయితం చర్చ్‌కి చాలాసార్లు ఆహ్వానించింది, వారందరిని క్రైస్తవులుగా మార్చడానికి.

జోర్డాన్ హైస్కూల్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి అయ్యాక, 1999లో ముతా యూనివర్శిటీలో చదవడానికి వెళ్ళారు. కాని సంవత్సరం పూర్తి కాకుండానే అక్కడి నుండి వచ్చేయడం జరిగింది. (ఇలా జరగడం అల్లాహ్ సమ్మతం అయివుంటుందని 'రుబా' చెబుతున్నారు). త్వరలో అమెరికా వలస వెళ్ళడానికి అనుమతి లభించబోతుందని ఆమెకి తెలిసింది.

ఆమె 2002 సం॥లో అమెరికాలోని టెక్సాస్‌కు వలస వెళ్ళారు. అక్కడ అరబిక్ దల్లాస్ బాప్టిస్ట్ చర్చ్‌కి వెలుతుండేవారు. ఆమె అంకులే అక్కడి పాస్టర్.

అక్కడుండడం సోదరికి ఇష్టం కాలేదు. అందుకని ఆమె కుటుంబం, అరిజోనాలోని ఓ క్రైస్తవ కుటుంబాన్ని సంప్రదించారు. కాని అరిజోనాలో ఆర్థికంగా ఏ విధమైన ఆసరా లభించకపోయేసరికి, వారు ఆమెను తిరిగి వెనక్కి, టెక్సాస్ వెళ్ళిపోయి, తన కుటుంబంతో ఉండమని సలహా ఇచ్చారు.

ఆ విధంగా రుబా వెనక్కి వచ్చేసారు. జోర్డాన్ చర్చ్‌లోని మినిస్ట్రీని ఆమె నాన్నగారు కంటిన్యూ చేయవలసి ఉండటం వలన, ఆమె తల్లిదండ్రులు రుబా యొక్క చిన్న తమ్ముళ్లని తీసుకుని జోర్డాన్ వెళ్లిపోయారు. కాని రుబా ఖేవర్ తన మరో తమ్ముడు, చెల్లెలుతో అక్కడే ఉండిపోయారు.

అక్కడ ఆమెకు ఓ ఉద్యోగం దొరికింది. కాలేజీలో చదవడం కూడా ప్రారంభించారు. చర్చ్‌కు వెళుతూ కొన్ని కార్యక్రమాలు సోదరి నిర్వహిస్తూ ఉండేది. అంతేకాకుండా జోర్డాన్‌లోని చర్చ్‌కు కొన్ని ప్రోగ్రామ్స్‌ని సయితం పంపేవారు. ఆదివారం బడులలో (సండే స్కూల్స్) బైబిల్ స్టడీస్‌లో సోదరి సహకరించేవారు.

'రుబా' నాన్నగారు 2003 సం॥లో కాన్సర్ వలన మరణించారు. కాని ఆ మరణ సంఘటన ఆమె జీవన వ్యవహారాలని ఏ విధంగానూ ఆపలేదు.

ఆమె కొన్ని క్రైస్తవ మినిస్ట్రీస్‌ని ఏర్పాటు చేయడానికే అమెరికా వచ్చారు. ఆమె ఆశయం : **అరబ్ ముస్లిములని చేరుకుని, వారిని క్రైస్తవం వైపుకు తీసుకురావాలి.** ఎందుకంటే అమెరికా స్వేచ్ఛాయుతమైన దేశమని ఆమె నమ్మకం. ఆలోచనలకి, మాట్లాడటానికి అక్కడ హక్కు వుంటుందని మనలాగే ఆమెకు కూడా అపోహ ఉండేది. (కాని నిజానికి అమెరికాలోని స్వేచ్ఛ మరియు మానవహక్కులు మేడిపండులాంటివి).

**"అందుకోసం, .... నేను కాలేజీలోని కొందరు స్నేహితుల్ని కలిసి, వారితో ఇస్లాం గురించి మాట్లాడటం ప్రారంభించాను. నాకు బైబిల్ ప్రారంభం నుండి చివరి వరకూ తెలుసు. వారిని క్రైస్తవం గురించి ఒప్పించడానికి నేను గట్టిగా వాదించేదాన్ని."**

ఈ వాదనలు ఎంతవరకూ కొనసాగాయంటే, వారు ''ముస్తఫా బెల్‌హేర్'' అనే యువకుణ్ణి ఆమెతో వాదించడానికి తీసుకువచ్చే వరకూ. ఇప్పుడు ఆ యువకుడే ఆమె భర్త. వారిద్దరి మధ్య జరిగిన చర్చ ఓ పరుగుపందెంలా సాగింది. ''అతనికి ఖుర్‌ఆన్ గ్రంథంపైనా మరియు సున్నత్‌పైనా గొప్ప జ్ఞానముంది. అతనిని నేనెంతమాత్రం ఇష్టపడలేదు. ఎక్కువ సమయం మేము అగ్నికి గ్యాస్‌ని కలిపినట్లు, కొన్నిసార్లు డెడ్‌ఎండ్స్‌కి చేరుకునేవాళ్ళం. ఆయన నిజంగా మంచి వక్త. మరి నేనేమో మొండిదాన్ని. నేను చివరికి విసిగిపోయాను .....అలసిపోయాను.

రుబా వాళ్ళమ్మగారు 2005 సెప్టెంబర్‌లో వస్తున్నారు. కాబట్టి, ఆ అవకాశాన్ని అడ్డం పెట్టుకుని, ఇక ఈ వాదననుండి దూరం అవచ్చు అని ఆలోచించారు మన సోదరి రుబా. ఎందుకంటే ఈ వాదన ప్రారంభం అయిన దగ్గరనుండి ఆమెలో ఆందోళన, అలజడి ప్రారంభమైంది.

ఈ చర్చలో గనక ఓడిపోతే నిజంగా అది తనకి చాలా అవమానంగా భావించారు. ఆమె తన స్నేహితులతో **"నేను వెళ్లాల్సి ఉంది!"** అని చెప్పారు. కాని ఆ యువకుడు ఆమెను పేరుతో పిలిచి **"నాకు ఆధారం కావాలి"** అని అడిగాడు.

**"నీవు ఏ విషయం గురించి మాట్లాడుతున్నావు?"** అర్థంగాక అడిగిందామె.

''బైబిల్‌ని పూర్తిగా వెతుకు ... జీసెస్ తనంతట తాను స్వయంగా దేవుడను అని చెప్పే ఒక్క వాక్యాన్ని కూడా నీవు ఎప్పటికీ కనుగొన లేవు ... ఆయన ఎప్పుడూ చెప్పలేదు (నేను దేవుడనని)'' అని అన్నాడు.

అతనికి క్రైస్తవత్వం గురించి చెప్పడానికి ఆమె కిప్పుడు మంచి అవకాశం దొరికిందని భావించింది. అంతేకాకుండా అతనిని జీసెస్ వైపుకు తీసుకురావడానికి కూడా ఆమెకిది మంచి అవకాశమే! (అప్పటికి ఆమె జీసెస్‌ని దేవుని కుమారునిగా, రక్షకునిగా విశ్వసిస్తుండేది).

ఆమె వ్యంగ్యంగా ఎత్తిపొడిచేలా అతనిని అడిగింది : **"నీవు దేని గురించి మాట్లాడుతున్నావు ... జీసెస్ దేవుడని చెప్పే వాక్యాలు పదుల సంఖ్యాలో ఉండవచ్చు".**

**"నాకు ఆధారం చూపు"** అని అతనన్నారు.

ఆమె ఇంటికెళ్లిందిగాని, ఆ ప్రశ్న ఆమె మనస్సులో గుచ్చుకుంది.

ఆమె బైబిల్‌ని తెరచి వెతకడం ప్రారంభించారు. ఇంకా ఇంటర్‌నెట్ రిసోర్సెస్‌ని, అలాగే కొన్ని పుస్తకాలను కూడా వెతికారు.

ఆ తర్వాత వాళ్ళమ్మగారిని ఈ విషయం గురించి అడిగారు. ఆమెతో చర్చించారు. అప్పుడామె చెప్పింది ''జీసెస్ తనను స్వయంగా దేవుడనని భాషాపరంగా చెప్పిన నిర్దిష్టమైన వాక్యం ఏమీ లేదనుకో! కాని ఆయనే చెప్పాడు ''నన్నెవరైతే చూశాడో అతను తండ్రిని చూశాడు'' అని.

**"కాని తండ్రి మరియు కుమారుడు ఒకటేకాదు కదా!"** రుబా, తన తల్లినడిగారు.

''కాని నీకు తెలుసుకదా! శక్తిలో వారిద్దరిది ఒకే స్థాయి అని మరియు వారు త్రిత్వంలో ఓ భాగమని'' సమాధానపర్చడానికి తల్లి ప్రయత్నించారు.

**అంటే మొదటి విషయానికి ఆధారం లేదు.**

ఇప్పుడు మనం రెండవ విషయాన్ని చూద్దాం. ''జీసెస్ - **దేవుని కుమారుడు?**''

మరింత ఎక్కువగా వెతకడం ప్రారంభించారు. యోహానుగా బైబిల్‌లో పిలువబడే ఓ సువార్తలో ఆమె ఓ సమీకరణాన్ని (ఈక్వేషన్‌ని) కనుగొన్నారు.

ఇక్కడ ఆమె బైబిల్‌నుండి ఓ వాక్యాన్ని ఉదహరించారు. కాని మా శాంతిబాట నియమాల దృష్ట్యా మేము ఇతర గ్రంథాలలోని వాక్యాలను పత్రికలో ఇవ్వడం లేదు. అవి తెలుసుకోగోరేవారు www.rubaqewar.com లో చూడండి.

ఆ వాక్యాన్ని బట్టి ఆమెకు అర్థమైనదేమిటంటే,

(1) దైవం = జీసెస్, మరియు (2) జీసెస్ దేవునితో ఉన్నాడు.

''ఓహ్ ... తప్పుడు మేథమెటికల్ స్టేట్‌మెంట్''. ఆమెకంతా గందరగోళంగా ఉంది.

''జీసెస్ దేవుడే అయి ఉన్నప్పుడు మరియు అదే సమయంలో ఆయన దేవునితో ఎలా ఉంటాడు? ఈ వాక్యం ఎటువంటి సెన్స్ నివ్వడం లేదే!'' అని రుబా ఆలోచించసాగారు.

ఆ తరువాత మరో వాక్యాన్ని చూశారు. (ఇక్కడ కూడా మేము ఆ వాక్యాన్నివ్వడం లేదు) దాని ప్రకారం :

తండ్రి = కుమారుడు = పరిశుద్ధాత్మ

'' 3=1 ఎలా అవుతుంది?'' తీవ్రంగా ఆలోచించారు.

తన ఆలోచన ఈ విధంగా ఉంది : ''3 = 1 అంటే అర్థం వారిది ఒకే స్థాయి, అదే శక్తి మరియు అదే తత్వం (నీటికి మూడు వేర్వేరు స్థితులున్నాయి (1) ద్రవం, (2) ఘనం మరియు (3) వాయు స్థితులు మరియు 1 లో 3 అంటే, ఒకే కుటుంబంలోని ముగ్గురికి ఇంటిపేరు ఒకటే ఉంటుంది. కాని వారు పూర్తిగా వేర్వేరుగా, వేర్వేరు మనస్తత్వాలను, వేర్వేరు వ్యక్తిత్వాలను కలిగి ఉంటారు''.

ఆమెలో ఆలోచన తీవ్రమైంది. **"దేవున్ని ముగ్గురుగా విశ్వసిస్తే నేను ఒక సృష్టినే ఎందుకు కలిగి యున్నాను?** ఉదాహరణకు నేను ముగ్గురు ఆర్టిస్ట్‌లతో చెట్టు బొమ్మని గీయమని చెబితే, ఒక్కొక్కరు వారి స్టైల్ (శైలి) ప్రకారం మరియు వారి ఆలోచన ప్రకారం (ఒకొక్కరు ఒకోరకంగా) చెట్టుబొమ్మను వేస్తారు. ఒకే దైవంలో ఉన్న 3గురు, ఓ ప్రాణిని సృష్టిస్తే, ఒక్కొక్కటి వేర్వేరుగా సృష్టించబడుతుంది. వారిది ఒకే ఉద్దేశ్యమైనప్పటికిని, వారు వారి స్వంత పద్ధతిలో వాటిని సృష్టిస్తారు''. 'రుబా ఖేవర్'కి అర్థమౌతూ ఉంది.

ఏదైతేనేం, 'బైబిల్‌లో కొన్ని పరస్పర విరుద్ధ విషయాలు ఉన్నాయనే' భావన ఆమెలో కలిగింది.

''ఈ పుస్తకం నాకు ఎక్కడి నుండి వచ్చింది? జీసెస్ తనకు తానే స్వయంగా దేవుని కుమారుడుగా చెప్పుకున్నారని నాకు తెలుసు. ఎందుకంటే ఆయన యూదజాతి వారే. **యూదులు తమను తాము 'దేవుని బిడ్డలు'గా చెప్పుకోవడం అనేది కొత్త విషయమేమీ కాదు. వారంతా మానవులే కదా!**''

ఆమెలో ఆలోచన తీవ్రరూపం దాల్చి, కొనసాగుతూనే ఉంది.

**"జీసెస్ స్వయంగా ప్రార్థించారు?**

**ఎవరిని ఆయన ప్రార్థించారు? తనకు తానే ప్రార్థించుకున్నారా?**

గ్రంథంలో చాలా చోట్ల ఆయన ప్రార్థించినట్లు ఉంది".

ఈ సందర్భంగా ఆమె బైబిల్ నుండి చాలా వాక్యాలను ఉదహరించారు. ఆ వాక్యాలను కూడా ఇక్కడ మేము అందించడం లేదు.

వీటికి తోడు, ఆమెకు ఓ విషయం మెరుపులా జ్ఞాపకం వచ్చింది. క్రైస్తవ ధర్మశాస్త్రం గురించి ఆమె అధ్యయనం చేస్తున్నప్పుడు, ఒక బ్రిటిష్ ప్రొఫెసర్ ఆమె చదివే కాలేజీకి వచ్చారు. బైబిల్ వ్రాతప్రతుల యొక్క చరిత్రను గురించి ఆయన వారికి బోధించేవారు. ఆమెకి జ్ఞాపకం వచ్చింది .. ఆయన ఖచ్చితంగా ఏమన్నాడంటే "మంచిది .... బైబిల్ వ్రాతప్రతులను చూడటానికి నేను ఇంగ్లాండ్‌లోని మ్యూజియంకి వెళ్ళాను. నేను అక్కడ చూసినవి అన్నీ కూడా చిరిగిపోయి, కొంత భాగం కాలి మిగిలిన కాగితాలు ఆ ప్రదేశమంతా పరచబడి ఉన్నాయి".

"మరి నా చేతిలో ఉన్నదేమిటి?"

"మరి ఇందులోని పదాలన్నీ ఎక్కడి నుండి వచ్చాయి?"

"నేను ఒక లోపరహితమైన దైవాన్ని ప్రార్థించాలనుకుంటే హూ ఈజ్ ద కంప్లీట్ ఆఫ్ ఎవిరీథింగ్, నేను లోపంతో కూడిన దైవాన్ని ఎలా విశ్వసించాలి?"

ఇది సరియైనది కాదు!

ఆమె ఆలోచించడం మొదలుపెట్టారు.

"ప్రపంచంలోని పవిత్ర గ్రంథాలన్నీ ఓ రోజు నాశనమైపోతే ... ప్రజలను మనం అడుగుతాం - అటువంటిదే కొత్త పుస్తకాన్ని తీసుకురమ్మని. కాని ఎవరూ కూడా బైబిల్ యొక్క ఖచ్చితమైన పుస్తకాన్ని తీసుకురాలేరు. ఎందుకంటే, మనకు బైబిల్‌లో చాలా రకాల వెర్షన్‌లున్నాయి. ఇప్పటికీ కొత్తవి వేర్వేరు వ్రాతప్రతులు లభ్యమౌతూనే ఉన్నాయి ... కాని ఓ మిలియన్ ముస్లిములు ఒకేలాంటి ఖుర్‌ఆన్‌ను, ప్రారంభంనుండి ఏ ఖుర్‌ఆన్ అయితే (వారికి) ఉందో అటువంటి ఖుర్‌ఆన్‌నే తీసుకురమ్మంటే (వారు) తీసుకురాగలరు. ఇది ఆశ్చర్యం కాదా?"

ఆ తరువాత శిలువపై జీసెస్‌ని చంపడం గురించి చెప్పే 'థీరీ'ని మరలా చదివారు.

"మన చేతులలో ఉన్న బైబిల్‌లోని సువార్తలు నిజమైనవా? 'బైబిల్'లను వ్రాసినవారు జీసెస్ క్రైస్ట్‌ను అనుసరించిన యూదులు. జీసెస్ యొక్క జీవిత చరిత్రనే వారు వ్రాసారు.... శిలువపై ఆయన చనిపోవడం చూసారు.... శిలువపై అదే వ్యక్తి ఉండాల్సిన అవసరముందా?"

ఖుర్‌ఆన్‌లోని 4వ అధ్యాయంలోని 157-158 వాక్యాలను సోదరి ఉదహరించారు:

"మరియు వారు (యూదులు): "నిశ్చయంగా, మేము అల్లాహ్ యొక్క సందేశహరుడు, మర్యమ్ కుమారుడైన, 'ఈసా' మసీహ్ (ఏసుక్రీస్తు)ను చంపాము" అని అన్నందుకు మరియు వారు అతనిని చంపనూ లేదు మరియు శిలువపై ఎక్కించనూ లేదు. కాని, వారు భ్రమకు గురిచేయబడ్డారు (అతనివలె కనిపించిన మరొక వ్యక్తిని సిలువపై ఎక్కించారు). నిశ్చయంగా, ఈ విషయాన్ని గురించి అభిప్రాయం భేదం ఉన్నవారు దీనిని గురించి సంశయగ్రస్తులై ఉన్నారు. ఈ విషయం గురించి వారికి నిశ్చితజ్ఞానం లేదు. వారు కేవలం ఊహనే అనుసరిస్తున్నారు. నిశ్చయంగా, వారు అతనిని చంపలేదు.

వాస్తవానికి, అల్లాహ్ అతనిని (ఈసాను) తన వైపునకు ఎత్తుకున్నాడు మరియు అల్లాహ్ సర్వశక్తి సంపన్నుడు, మహా వివేకవంతుడు."

**(దివ్య ఖుర్‌ఆన్ 4:157-158)**

"అంటే జీసెస్‌ను చూసినవారు, నిజానికి జీసెస్‌లా ఉండే మరొకరిని చూశారు" అనే నిర్ణయానికొచ్చారామె.

అంటే మన చేతులలో ఉన్నది వ్యక్తిగత విషయాలు మాత్రమే. అందులోని 75 శాతం లేదా అంతకంటే ఎక్కువ మార్చబడినదేనని తెలుసుకున్నారు.

"ఇప్పుడు ఫలితం నా చేతులలో ఉంది."

"జీసెస్ దేవుడు కాదు, కనీసం దేవుని కుమారుడు కూడా కాదు. నేను భయపడ్డాను. నాలో దిగులు మొదలైంది.

ఇన్ని సంవత్సరాలు ... నా జీవితంలోని 24 సంవత్సరాలలో నేను అధ్యయనం చేసింది ఓ థీరీనా!

**24 సంవత్సరాలపాటు అవాస్తవ దైవాన్ని ఆరాధించానా?**

**24 సంవత్సరాలు ఓ అబద్ధంగా గడిచాయా?"**

"నన్ను నేనే చంపుకోవాలనుకున్నాను. నేను నిలుచున్న నా క్రిందనున్న భూమి కంపిస్తున్నట్లు అనిపించింది. నేను చాలా భయపడ్డాను". నాకు వచ్చిన ఫలితాన్ని పూర్తి తప్పు అని నిరూపించడానికి, నేను మరలా వెనక్కి, అంటే ప్రారంభంనుండి నా అన్వేషణను మరలా ప్రారంభించాలనుకున్నాను. ... నేను చాలా మౌనంగా గడిపాను ... తర్వాత ఏమిటో తెలియదు! నేను నా జీవితాన్ని నాశనం చేసుకుంటున్నాను." ఇలా తన మనస్సులో జరిగిన అలజడిని తెలియజేశారు.

ఇంకా ఇలా చెబుతున్నారు :

"నేను ఆలోచించడం ప్రారంభించాను. జీసెస్‌పై నాకు విశ్వాసం ఉంది. అతను ఓ మనిషి మాత్రమే. అతను దైవం యొక్క ప్రవక్త. నేను ప్రవక్తలందరినీ విశ్వసిస్తున్నాను ... **ముహమ్మద్(స)** వారి విషయంలో నాకొక సమస్య ఉంది. నేను ఎప్పుడూ ఆయన జీవిత చరిత్ర గురించి తెలుసుకోలేదు. కాని నాకు తెలిసిందేమిటంటే, నా మనస్సులో క్రైస్తవులు ఏదైతే నాటారో అది మాత్రమే ... **కాని ఆయనని ప్రజలందరూ గొప్ప ప్రవక్తగా ఎలా పొగడ గలుగుతున్నారు?"**

నేను చెప్పాను ... "ఇది సమస్య ఎలా అవుతుంది. దివ్య గ్రంథమైన ఖుర్‌ఆన్ ఆకాశం నుండి ఆయన(స) ద్వారా అవతరించింది. ఆయన నిజంగా ప్రత్యేకమే అయిఉండాలి ... అంటే ఉన్న ప్రవక్తలతో పాటు మరొక ప్రవక్తను కూడా విశ్వసించడం పెద్ద సమస్యేమీ కాదు...."

"దీనికి తోడు, **'బర్నాబీ'** అనే పేరుతో పిలువబడే మరో సువార్త ఉందని, దానిని చట్టవిరుద్ధమని, చర్చ్‌లు ఆ **'సువార్త'**ను విశ్వసించరని నాకు తెలుసు. ఎందుకంటే అందులో జీసెస్, తన తరువాత **అహమద్** అని పిలువబడే ప్రవక్త రానున్నారని చెప్పారు".

"నేను బాగా ధ్యానం చేసుకున్నాక నా రూమ్ నుండి బయటికి వచ్చాను. దాని గురించే ఆలోచించడం .... అన్వేషించడం ..."

రెండు నెలల నుండి రుబా తన స్నేహితులను కలవలేదు. వారికి ఫోన్ చేశారు. వారిని వారింటి దగ్గర ఆమె చూడాలనుకున్నారు. 'రుబా' అల్లాహ్‌ను ప్రార్థిస్తూ రోదించారు : **"నేను అనుకున్నది సన్మార్గమయితే, నీవు నా జీవితాన్ని మార్చు ... ఒకవేళ అది కాకపోతే ఇప్పుడే నన్ను ఏదైనా యాక్సిడెంట్‌లో నా స్నేహితుల్ని చేరేలోపు చనిపోనివ్వు. నన్ను స్వర్గానికి తీసుకుపో. నేను సత్యం కోసమే చూస్తున్నాను. ఏం జరిగినా నన్ను స్వర్గానికి తీసుకుపొమ్మని అర్థిస్తున్నాను"**

ఆ విధంగా నీళ్లు నిండిన కళ్ళతో తన స్నేహితుల్ని చేరుకున్నారామె.

ఆమె కళ్ళల్లో నీరు చూసి, ఏదో జరిగి ఉంటుందని వారనుకున్నారు. "అక్కడే నా భర్త ఉన్నాడు" (వాదించడానికి) ...(అప్పటికింకా వీరిద్దరికీ పెళ్ళి కాలేదు).

"ఏం జరిగిందో నేను చెబుతానని వారు ఎదురుచూస్తున్నారు. నేను చెప్పాను **'అషహదు అల్ లా ఇలాహ ఇల్లల్లాహు వ అషహదు అన్న ముహమ్మదుర్ రసూలుల్లాహ్'"** (నేను సాక్ష్యమిస్తున్నాను "ఆరాధ్యుడు లేడు అల్లాహ్ తప్ప" మరియు నేను సాక్ష్యమిస్తున్నాను "ముహమ్మద్(స)వారు అల్లాహ్ యొక్క సందేశహరులని".)

సోదరి పలికిన మాటలు విని, రెండు నిమిషాల పాటు వారంతా ఏ మాటా లేకుండా నిశ్శబ్దంగా ఉండిపోయారు.

వారు ఆమె వంక చూశారు. ఆ యువకుడు (ఆమె భర్త) విచిత్రంగా నవ్వడం ప్రారంభించాడు.

అతనే అన్నాడు : **"షట్ అప్ ... అబద్ధం చెప్పకు"**

"ఆ రోజు అక్టోబర్ 3 అనుకుంటాను" రుబా గుర్తు చేసుకున్నారు.

**"నేను అబద్ధం చెప్పడం లేదు"** అంటూ ఏడ్వడం మొదలెట్టాను.

"విశ్వాసం లేకుండా షహదా చెబితే, అది (ఆ షహదా) ముస్లిమ్ కానివ్వదు అంటూ ఆ రోజు నువ్వే కదా చెప్పావు" అని అతను గుర్తుచేస్తూ, అబద్ధం చెప్పవద్దన్నాడు.

**"నేను అబద్ధం చెప్పడం లేదు ... రేపు రమదాన్ మొదటి రోజు ... నీవు నాకు నమాజ్ ఎలా చేయాలో, వజూ ఎలా చేయాలో నేర్పబోతున్నావు, అలాగే ఇంకా ప్రతీ విషయమూనూ"** అని రుబా అన్నారు.

"నేను అలా చెప్పడం వినగానే ... బేబీలాగ అతనికి కూడా ఏడుపు వచ్చింది."

"నిజంగా అవన్నీ ఒక్క రాత్రిలోనే నేను నేర్చుకున్నాను... హిజాబ్ నొకటి కొన్నాను ... నా స్నేహితురాలు దానిని ఎలా ధరించాలో మొ॥న అన్ని విషయాలను వివరంగా తెలిపింది."

"నా ఇస్లాం గురించి (ఇంటిలో) రెండు వారాల పాటు దాచాను"

"ఆ సమయంలోనే, నేను ఇమామ్ దగ్గరికెళ్ళి షహదా పలికాను. ఖుర్‌ఆన్ నుండి నేర్చుకోవడం మొదలు పెట్టాను. మరియు రెండు పుస్తకాలను పోల్చి చూసేదాన్ని. ప్రారంభంలో బైబిల్‌ని వదలడానికి చాలా కష్టంగా అనిపించింది. అల్‌హమ్‌దులిల్లాహ్ (కృతజ్ఞతలన్నీ అల్లాహ్‌కే). ఇప్పుడటువంటిదేమీ లేదు."

ఆమె ఇస్లాం స్వీకరించిన విషయాన్ని ఆమె కుటుంబానికి తెలియకుండా దాచారు. రాత్రి 2 గంటల నుండి 3 గంటల మధ్య నమాజ్ చేసుకునేవారు. ఆ సమయంలో అనుమానంతో తను చేసేది ఎవరు చూడలేరని అలా చేసేవారు.

ఆమె ఖుర్‌ఆన్ మరియు హిజాబ్‌ను స్కూలుకి తీసుకెళ్ళే సంచి(bag)లో ఉంచుకొనేవారు. ఓ రోజు స్కూల్‌కి వెళుతున్నప్పుడు, ఆమె వీపుకి తగిలించుకున్న సంచిలో నుండి అనుకోకుండా ఆమె హిజాబ్ ఇంటిలోని మెట్లపై పడిపోయింది. ఆమె వెనక చెల్లెలుంది. ఆమె చెల్లెలు చూసింది కాని ఆమెకి ఏమీ తెలియలేదు. రాత్రి లేచి రుబా నమాజ్ చేయడం చూసేవరకు ఆమెకి అసలు విషయం అర్థం కాలేదు. రుబా చెల్లెలు కుటుంబ సభ్యులందరికీ ఈ విషయాన్ని చెప్పేసింది. అప్పుడొచ్చింది సమస్య.

వారు తనపై అరిచారు, అవమానించారు, ఘోరమైన భాషలో ఆమెనెన్నో మాటలన్నారు. చచ్చేలా కొట్టారామెను. భయపెంచారు కూడా. అంత జరిగినా ఆమె మౌనంగానే ఉన్నారు.

కాని వారినందరినీ ఇస్లామ్ వైపు తీసుకురమ్మని అల్లాహ్‌కు ప్రార్థన చేసుకుంటూ రుబా ఇల్లు వదిలి వచ్చేసింది.

ఆమె ముస్తఫాను వివాహం చేసుకునేవరకూ ... రెండు నెలలపాటు తన స్నేహితురాలి దగ్గరే ఉన్నారు ... అల్‌హమ్‌దులిల్లాహ్!

"నేను నా కుటుంబాన్ని పోగొట్టుకున్నాను. కాని మస్జిద్ దగ్గర్లోని మరో కొత్త ముస్లిం కుటుంబం నా గురించి శ్రద్ధ తీసుకుంది. అంతేకాదు నిజంగా నాకు ఎంతో సాయం చేసారు." కృతజ్ఞతా భావంతో గతాన్ని గుర్తు చేసుకున్నారు. ఆ తరువాత ఎదురైన పరిస్థితుల గురించి ఇలా చెప్పారు :

"నన్ను కొట్టిన దెబ్బల వలన... ఆ తరువాత నేను చాలా మానసిక ఒత్తిడికి గురయ్యాను. ఇప్పటికీ కూడా ప్రపంచం నలుమూలల నుండి కూడా కనీసం 25 ఫోన్ కాల్స్ మరియు ఈ-మెయిల్స్ రోజు వస్తూ ఉంటాయి అవమానిస్తూ, బెదిరిస్తూ.

నాకు వచ్చే ఫోన్ కాల్స్ మాత్రమే కాకుండా, జోర్డాన్ మరియు అమెరికాలోని పెద్ద పెద్ద క్రైస్తవ ప్రొఫెసర్స్‌తో ఫోన్‌లో వాదనలు కూడా జరిగేవి... మతాల గురించి వాదిస్తూ, నన్ను తిరిగి వెనక్కి క్రైస్తవంలోకి తీసుకు రావడానికి ప్రయత్నిస్తూ ..." "సుబహానల్లాహ్ (అల్లాహ్ పవిత్రుడు) నేను నా చేతుల్లో బైబిల్‌ని పట్టుకుని ఉండేదాన్ని. కాని వారి చేతిలో ఖుర్‌ఆన్. కథ అడ్డం తిరిగింది!

ఏదేమైనా, చాలా తక్కువ సమయంలోనే నేను చాలా నేర్చుకున్నాను... **సహనంతోనూ, వినయంగానూ ఉండటం నేర్చుకున్నాను.** నేను ఇప్పుడు ధ్యానం చేస్తూ, **దైవప్రవక్త ముహమ్మద్(స) వారికి సంబంధించిన విషయాల గురించి ఆలోచిస్తుంటే ఆయన(స)కు ఎన్ని అవమానాలు! ఆయన(స) వాటన్నింటిని ఎలా భరించారో!** .... ఆయనతో పోలిస్తే నా కథ అసలు ఏమీ కాదనిపించింది. వావ్.. నేను చాలా నేర్చుకున్నాను."

"నా కుటుంబం యొక్క ఉన్నత గౌరవాన్ని నేను పోగొట్టుకుని ఉండవచ్చు. అలాగే కొంతమంది ముందున్న నా గౌరవాన్ని కూడా. కాని అల్లాహ్ నుండి వస్తున్న గౌరవానికి నేను గర్వపడుతున్నాను మరియు ఆశ్చర్యపోతున్నాను. మీరసలు ఊహించలేరు.. **అలాంటి అవమానాలలో సయితం నేను ఎటువంటి సంతోషం, శాంతితో బ్రతుకుతున్నానో!"**

"నిజంగా నేను పూర్వం కంటే చాలా మారిపోయాను. నేను పూర్తిగా భిన్న వ్యక్తిని .. నా భర్త సయితం అది గుర్తించారు."

నన్ను ఎల్లవేళలా అవమానించే వారితో సయితం నేను ఎలా మౌనంగా మరియు సహనంతో ఉండాలో నేర్చుకున్నాను.

అలాంటి దైన్య మరియు కష్టకాలాలలో (నా ఉద్యోగాలు పోగొట్టు కున్నప్పుడు సయితం) ఎలా చిరునవ్వుతో ఉండవచ్చో నేర్చుకున్నాను. కాని అల్లాహ్ ఆ నష్టాన్ని మరోదానితో పూరిస్తున్నారు.

"ఇదంతా నీ లోపల నిర్బంధ శాంతి కలగాలని .... నీవు నిజంగా నీ చుట్టూ ఉండేవారి నుండి శాంతిని కనుగొన లేవు ... నీ చుట్టూ ఉండే వాతావరణం వలన గాని .... నీ అంగీకారం వలననే, నీ మనస్సు వలననే... (శాంతిని కనుగొనగలవు). **నీ మనస్సును అల్లాహ్‌కు అంకితం చేసి ఆయనను ప్రేమించడం వలననే ... నీవు అల్లాహ్‌ను ఆరాధించినట్లయితే, ఆయన ఆదేశాలను అనుసరించి నట్లయితే నీవు ఖచ్చితంగా సంతోషంగా ఉంటావు.**

**ఎందుకంటే, చేసే పాపాలు నిన్ను దోషివనే భావనను కలిగించి, నీ నుండి శాంతిని దూరం చేస్తాయి."**

"నేను కొందరి ముఖాలను, వారి కళ్ళల్లో నీటిని, విచారాన్ని చూశాను. వారంతా సృష్టికర్తకు దూరంగా ఉన్నారు. కొన్నిసార్లు నేను వారి హృదయంలోని చీకటిని చూశాను. వారు అందులోని జ్యోతిని వెలగనివ్వరు. ఎందుకంటే వారు జీవితంలో తలమునకలై ఎన్నో సమస్యలలో చిక్కుకున్నారు."

"ఇప్పుడు నేను తెలుసుకున్నదంతా - ఈ జీవితంలో నా లక్ష్యం - **ఆరాధించడం, అల్లాహ్‌ను ప్రార్థిస్తూ ఆయన ఆదేశాలను, నియమాలనూ అనుసరిస్తూ ఆయన కొరకు మంచి పనులు చేయడం.**"

చివరిగా మన ప్రియతమ సోదరి ఇలా అంటున్నారు :

"మీ ఆత్మకు బలంగా నా ఈ కథ మీరు ఎంజాయ్ చేసి ఉంటారని నేననుకుంటున్నాను."

అసలైన సత్యాన్ని కనుగొన్న ఓ మతబోధకుని కుమార్తె అయిన సోదరి 'రుబా డి. ఖేవర్' గురించి మీ కందించే అవకాశాన్ని కల్పించిన అల్లాహ్‌కు కృతజ్ఞతలు.

సేకరణ మరియు తెలుగు అనువాదం :

**డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు (అబ్దుల్ కరీమ్)**

**P.S.**: ఈ వ్యాసంలో అందించిన వివరాలు, సోదరి 2007లో తన వెబ్‌సైట్ (www.rubaqewar.com) లో వ్రాసుకున్న వ్యాసం లోనివి.

క్రిందటి సంచికలో సోదరి ఆమినా అస్సిల్మి గారి గురించి తెలియజేయడం జరిగింది. ఆమె దగ్గరనుండి అనుమతి, మొదటి సంచిక ప్రింట్ కావడానికి ఒక నెల ముందు మాత్రమే అందింది. అలాగే ఈ సోదరి నుండి కూడా జవాబు, ఈ సంచికను ప్రెస్‌కివ్వడానికి 20 రోజుల ముందే అందింది. తన జీవితకథను ప్రచురించుకోవడానికి తనకు ఎటువంటి అభ్యంతరం లేదని సోదరి తెలిపారు. ఆమె అల్లాహ్ కరుణతో సంతోషంగా జీవించాలని 'శాంతిబాట టీమ్' తరపున హృదయపూర్వకంగా కోరుకుంటున్నాను.

ముస్లిములనందరినీ క్రైస్తవులుగా మార్చాలనుకున్న ఆమె ఇప్పుడు 'ఇస్లాం' గురించి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

మచ్చుకు కొన్ని ఉదాహరణలు :

www.youtube.com/rubaqewar వెబ్‌సైట్‌ను ఓపెన్ చేయండి. అందులో దాదాపు 30 వీడియోలున్నాయి.

ఇంటర్‌నెట్ సౌకర్యం కలవారు పై వీడియోలను చూడండి.

ఈ సోదరి ఎంత డైనమిక్‌గా, యాక్టివ్‌గా పనిచేస్తున్నారో తెలుస్తుంది. ఈమె మల్టీమీడియా రంగంలో ఎక్స్‌పర్ట్. తన ఉపాధి చూసుకుంటూనే 'ఇస్లాం' ధర్మ సందేశాన్ని ప్రజలకు అందిస్తున్నారు.

ఈమె ఇస్లాం స్వీకరించిన 2005 రమదాన్ నుండి ఈ 2009 రమదాన్‌కి 4 సం॥లు పూర్తయ్యాయి. ఈ నాలుగు సంవత్సరాలలో ఈ సోదరి ఎవరిపై ఆధారపడకుండా చేస్తున్న కార్యక్రమాలను చూశారు కదా!

మరి ముస్లిమ్ కుటుంబంలో పుట్టి, పుట్టుకతోనే ముస్లిమైన మీరు ఈ 4 సంవత్సరాలలో ఇస్లాం ధర్మం గురించి ఏమి చేశారో గుర్తు చేసుకోండి.

ఆలోచించండి! సమయం మించిపోలేదు. ఇలాంటి నవముస్లిమ్ సిస్టర్స్‌ను స్ఫూర్తిగా తీసుకోండి.

చీకట్లో బ్రతికేవానికి వెలుగులోకి వస్తే ఆ వెలుగు యొక్క విలువ తెలుస్తుంది. ఎప్పుడూ వెలుగులో ఉన్నవానికి, ఆ వెలుగు విలువ ఎప్పుడో గాని తెలియదు.

ఈ వ్యాసానికి కొనసాగింపుగా 38వ పేజీలో మేము ఒక మనవి చేయడం జరిగింది.

**ఈ శీర్షికపై పాఠకుల అభిప్రాయాలు :**

అస్సలాము అలైకుమ్!

మన ప్రియతమ సోదరి 'ఆమినా అస్సిల్మి' వారి గురించి చదివి తమ అభిప్రాయాలను తెలియజేసిన ప్రియమైన పాఠకులందరికీ కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. ఈమె పడిన కష్టాలను తెలిసికొని, తమ కష్టాలను, బాధలను మర్చిపోయామని చెబుతున్న మాటలు వింటూ ఉంటే, సోదరి జీవిత కథ ముస్లిముల హృదయాలపై ఎంతటి ప్రభావాన్ని కలుగజేసిందో తెలుస్తుంది.

ఈ సోదరి గురించి ఇంగ్లీషులో వ్రాసిన వ్యాసాన్ని చదవుతుంటే, కన్నీరు ఆపుకోలేకపోయాను. నాలాగే ఈమె కూడా ఇస్లాం గూటికి చేరుకున్నారు. నాకంటే 9 సంవత్సరాలు ముందుగా ఇస్లాం స్వీకరించారు.

కాని సోదరి ఆమినాకు అల్లాహ్ పెట్టిన కఠిన పరీక్షల లాంటివి నేను ఎదుర్కోలేదు. ఆమె యొక్క విశ్వాస బలం ఎంత ఉంటుందో అల్లాహ్‌కే తెలుసు. అందుకేనేమో అలాంటి పరీక్షలు.

సహనానికి ఆమె ఓ ఉదాహరణే అయ్యారు. కష్టాలను అల్లాహ్ యొక్క ఆశీర్వాదంగానే భావిస్తూ నిజమైన విశ్వాసంతో కష్టాలను సునాయాసంగా ఎలా ఎదుర్కోవచ్చో ఆచరించి చూపి మన ముందు సజీవ సాక్ష్యంగా, మన ప్రేమకు పాత్రులయ్యారు. మొదటి సంచికలో, మొదటి వ్యాసం ఈ సోదరి గురించి ఇవ్వాలనే మా ధృడ సంకల్పాన్ని అల్లాహ్ కూడా సమ్మతించి నట్లున్నారు.

సంతోషమయ జీవన మార్గంలో మనకు పరిచయమైన తొలి సోదరి - ఆమినా అస్సిల్మి.

# 2. ఇస్లాంలో విద్య - మస్జిద్ (Mosque) యొక్క పాత్ర

జామి جامِعٌ అనే అరబీ పదానికి అర్ధం మస్జిద్ مَسجِدُ . ఈ 'జామి' అనే పదం నుండే ఉత్పన్నమైన పదం - 'జామిఆ' جامِعَةٌ అంటే యూనివర్శిటీ (విశ్వవిద్యాలయం).

ఇస్లామీయ ప్రపంచంలోని చాలా చోట్ల ఇప్పటికీ 'జామిఆ' అంటే మస్జిద్ మరియు స్కూల్ (బడి). వాటి బిల్డింగ్‌లు వేరుగా ఉన్నప్పటికీ, తరచుగా ఆ రెండూ దూరంగా ఉన్నప్పటికీ కూడా రెండింటిని కలిపి 'జామిఆ' అని పిలుస్తారు.


'మస్జిద్' అర్థాన్నిచ్చే పదం నుండే 'యూనివర్శిటీ' అనే పదం ఉత్పన్నమవడం అనేది మరే ఇతర భాషలోగాని, సంస్కృతిలో గాని లేదు. కాని నేటి ముస్లిమ్‌లకు మస్జిద్ అంటే 5 పూటలా కాస్సేపు ప్రార్థన చేసుకునే ప్రదేశమని మాత్రమే అనుకుంటారు.

ఇస్లామ్‌కి మరియు ఉన్నత విద్యా సముపార్జనకి ఉన్నటువంటి ఉత్తమ బంధం లాంటి బంధం కూడా మరో చోట మీకు కనిపించదు.


మస్జిద్‌కు, మరియు విద్యను సముపార్జించే స్కూలుకు విడదీయరాని బంధం ఉండబట్టే, ఇస్లామీయ జ్ఞానాన్ని సముపార్జించిన ముస్లిమ్ శాస్త్రవేత్తలు ఆధునిక సైన్స్‌కి పునాదులు వేశారు. ఈ విషయం క్రిందటి సంచికలో చర్చించాము.



స్పెయిన్‌లోని కార్డోబా మస్జిద్ మరియు యూనివర్శిటీ లోపలిభాగం, ఇది 785 సం॥లో స్థాపించబడింది. స్థాపించబడి ఇప్పటికి 1224 సం॥లు కావస్తున్న అతి పురాతన విశ్వ విద్యాలయం.



Qarawiyyin Mosque and University. ఖరవియ్యీన్ మస్జిద్ మరియు యూనివర్శిటీ, ఫెజ్, మొరాకో. 859 సం॥లో స్థాపించబడింది. (అంటే ఇప్పటికి ఇది స్థాపించబడి 1141 సం॥లు కావస్తుంది).



Al-Azhar University, Cairo. అల్-అజ్‌హర్ యూనివర్శిటీ, కైరోలో 22 జూన్, 972లో స్థాపించబడింది. ఈ యూనివర్శిటీ స్థాపించబడి, ఇప్పటికి 1037 సం॥లు కావస్తుంది.

ఖుర్'ఆన్ గ్రంథం మానవాళిని ఆలోచించమని, వివేచన చేయమని, పునరాలోచించమని మరియు జ్ఞానాన్ని ఆర్జించమని, వారి మనస్సులలో నాటుకునేటట్లు చెబుతుంది. తద్వారానే దైవానికి మరియు ఆయన సృష్టికి దగ్గరవడం సాధ్యమౌతుంది.

ఖుర్'ఆన్ గ్రంథం ఒకే విషయాన్ని పదే, పదే చెబుతుంది. ఒకే విషయాన్ని వివిధ సందర్భాలలో వేర్వేరు శైలిలలో చెప్పబడినట్లు ఖుర్'ఆన్ గ్రంథాన్ని చదివేవారికి బాగా తెలిసిన విషయమే!

ఇలా పదే పదే చెప్పడం వలన, వినేవారి ఎరుకలో కొన్ని కీలకమైన భావనలు నిక్షిప్తం చేయబడతాయి. అల్లాహ్ అనే పదం 2000 కంటే ఎక్కువ సార్లు మరియు రబ్ అనే పదం దాదాపు 900 కంటే ఎక్కువసార్లు ఖుర్'ఆన్ గ్రంథంలో గమనించవచ్చు. ఇల్మ్ (జ్ఞానం) అనే పదం దాదాపు 750 సార్లు వచ్చి, **'అల్లాహ్'** మరియు **'రబ్'** తరువాత స్థానం అయిన 3వ స్థానాన్ని ఆక్రమించింది.

జ్ఞానాన్ని సంపాదించమని ముస్లిములందరినీ దైవప్రవక్త ముహమ్మద్(స) వారు ఆదేశించారు. జ్ఞానాన్ని తాము చేరుకోగలిగినంత మేర వెతకమన్నారు. అంతేకాకుండా, జ్ఞానాన్ని ఎల్లప్పుడూ వెతకమన్నారు. **అంటే విద్యకు అత్యధిక ప్రాముఖ్యత నివ్వడం జరిగింది.**

ఈ ఆదేశాలను, సాంప్రదాయాలను అనుసరిస్తూ, ముస్లిమ్ పాలకులు ప్రతీ ముస్లిమ్ పిల్లవాడు చదువుకోవాలని నొక్కిచెబుతూ, సాధారణంగా చదువుకోవడానికే కాకుండా, విద్యా సంస్థలకు కూడా ఈ పాలకులు మద్దతు

నిచ్చేవారు. ఇస్లామీయ ఆదేశాలతో పాలకుల యొక్క ఈ తోడ్పాటే, ముస్లిములలో 'ప్రాథమిక విద్య'ను దాదాపు సర్వ సాధారణం (universal) అయ్యేలా చేసింది.

Wilds ఇలా చెబుతున్నారు: ''తమ వారికి పాఠశాలలో విద్య నేర్పించడంలో వారు (పాలకులు) ఈ గొప్ప ఔదార్యాన్నే చూపించారు. వారి నాగరికత ప్రకాశవంతంగా మరియు శీఘ్రపురోగతికి బలమైన కారణాలలో ఇది ఒకటి. విద్య ఎంత సర్వసాధారణంగా విస్తృతం అయిందంటే, చదవడం మరియు వ్రాయడం తెలియని ఒక్క ముస్లిమ్‌ని కూడా కనుగొనలేనంతగా.''

Scott ప్రకారం, ముస్లిమ్ స్పెయిన్‌లో నిరుపేద రైతు యొక్క పిల్లలు కూడా 'చదువు యొక్క శుభాలను' అనుభవించని గ్రామం అంటూ ఏదీ లేదు. కార్డోబాలో 800 పబ్లిక్ స్కూళ్ళు ఉండేవి. అధిక సంఖ్యలో ముస్లిములు, క్రైస్తవులు మరియు యూదులు ఒకే రీతిన అక్కడ ఉపాన్యాసాల (లెక్చర్ల) ద్వారా బోధించేవారు.

ఆశియా మైనర్ మరియు ఈజిప్ట్, జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్ నుండి సాహిత్య యాత్రికులు వస్తూన్నప్పటికీ, ఆ సమయంలోనూ అవే పరిస్థితులలో స్పానిష్ ముస్లిమ్ జ్ఞానాన్ని పొందేవాడు. క్రైస్తవులు, యూదులు కూడా కార్డోబాలోని ఉన్నతమైన ముస్లిమ్ యూనివర్శిటీలో ఆచార్యులుగా (ప్రొఫెసర్లుగా) అక్కడ గౌరవాంగీకారాన్ని పొందేవారు. (అక్కడివారికి) చదువును నేర్పే ప్రదేశం ఎంత ఉన్నతమైనదంటే, టీచర్లు మరియు విద్యార్థులను ప్రజలు గౌరవించేవారు. పెద్ద పెద్ద లైబ్రరీలను ఐశ్వర్యవంతులు మరియు వ్యాపారవేత్తలు సేకరించడాన్ని బట్టి, జ్ఞానాన్ని పొందడమనేది ఉన్నత వ్యక్తి యొక్క గుర్తులలో ఒకటిగా తెలుస్తుంది.

Pederson ఇలా చెబుతున్నారు : ఇస్లామ్‌లో 'సాహిత్య జీవితం' పోషించిన పాత్రలాంటిది, మరో సంస్కృతిలో కలిగియుండటం చాలా అరుదు. జ్ఞానాన్ని (ఇల్మ్) ఆర్జించడం అంటే అర్థం : ఇల్మ్ (పూర్తి మేధో ప్రపంచం) అనేది ముస్లిమ్‌లకు మరే విషయం కంటే కూడా ఎక్కువ ఆసక్తి కలిగేలా వారితో కలిసిపోయింది. మస్‌జిద్‌లలో వికసించిన జీవితం బయటికి వ్యాపించింది. ప్రభావాన్ని చూపగలిగే ప్రతీవర్గంలోనూ తనదైన ముద్ర వేసింది.

మశీదునుండి హాస్పిటల్ వరకూ, అబ్జర్వేటరీ నుండి మదరసా (స్కూలు) వరకూ ప్రతీ ప్రదేశమూ నేర్చుకునే ప్రదేశమే! విద్వాంసులు (scholars) తమ స్వంత ఇళ్ళల్లో సమావేశమైన (ప్రైవేట్)వారికి వివరించేవారు. అలాంటి చాలామంది విద్వాంసులలో అల్-ఘజాలీ, అల్-ఫరాబీ మరియు ఇబ్నె సిన్న ఉన్నారు. పబ్లిక్ స్కూళ్లలో బోధన తరువాత (అంటే రిటైర్ అయ్యాక) వారి యొక్క ప్రైవేట్ లైబ్రరీలలో మరియు అధ్యయనాల్లో ఏకాంతంగా గడిపేవారు. వారిని ఆహ్వానించే అదృష్టవంతులకు బోధించడాన్ని కొనసాగించేవారు.

ఇస్లాం జెండా ఉన్నప్పుడు (అంటే ఇస్లామీయ పరిపాలనలో), చేసే ఎన్నో ఘనకార్యాలే ఆ రోజుల్లో ఎంతో సరియైనవిగా భావించే కాలంలోనే, విద్య కొరకు ఈ సర్వసాధారణ పిపాస మరియు ప్రోత్సాహం అన్నిటి కంటే సరియైనదిగా, ఉన్నతమైనదిగా ఉండేది. ఈ universality (సర్వ సాధారణం) ఈ రోజుకి సయితం సమానం కాలేదని చెప్పవచ్చు. ఆ యుగంలో జ్ఞానం యొక్క స్థానం మరియు పాత్ర గురించి, ఇన్షా అల్లాహ్, రాబోయే సంచికలలో వీలును బట్టి చర్చిస్తాము.

ప్రస్తుత వ్యాసంలో, విద్యను ఏ విధంగా ఆర్గనైజ్ చేశారు. దాని ఆశయాలు మరియు పద్ధతులు, వీటన్నింటిపై మస్‌జిద్ యొక్క పాత్ర గురించి తెలియజేయబడింది. ఈ రోజుల్లో మదరసా అంటే చాలా చెడు అభిప్రాయాన్ని కలిగేలా మీడియా ప్రచారం చేస్తుంది. ఆ ప్రచారం ఎంత అబద్ధమో ఈ శీర్షికలో వ్యాసాలను ప్రతినెలా చదివేవారికి అర్థమౌతుంది. ఇది చాలా సుదీర్ఘమైన విషయం. దీనిగురించి కూడా ఇన్షాఅల్లాహ్ రాబోయే వ్యాసాలలో చెప్పుకుందాం.

తబవి ప్రకారం ఇస్లామ్‌లో విద్యను వికసించేలా చేయడంలో మస్‌జిద్ చాలా గొప్ప పాత్ర పోషించింది. విద్యతో మస్‌జిద్‌కు గల బంధం, ముఖ్య లక్షణాలలో ఒకటిగా చరిత్ర అంతటా (కన్పిస్తుంది). Scott ప్రకారం పాఠశాలకు మస్‌జిద్‌తో విడదీయలేని అనుబంధమేర్పడింది. Wardenburg వివరిస్తున్నట్లు ప్రారంభంనుండి మస్‌జిద్ ఇస్లామీయ సమాజానికి కేంద్ర బిందువు - ప్రార్థన మరియు ధ్యానం చేసుకునే స్థలం, మత ధర్మ ఆదేశాలకు, రాజకీయ చర్చలకు మరియు పాఠశాలకు కూడా కేంద్రం - మస్‌జిదే.

మరియు ఏ ప్రాంతమైతే ఇస్లామ్ స్వాధీనంలోకి వచ్చిందో, అక్కడ మస్‌జిద్‌లు స్థాపించబడేవి. ప్రాథమిక బోధన ప్రారంభమయ్యేది. స్థాపించాక, అలాంటి మస్‌జిద్‌లు, తరచుగా వందల సంఖ్యలో, కొన్ని సార్లు వేల సంఖ్యలో విద్యార్థులకు బోధించే ప్రదేశాలుగా మరియు ఎక్కువ సంఖ్యలో ముఖ్యమైన లైబ్రరీలను కలిగి ఉండి, అందరికీ తెలిసిన ప్రదేశాలుగా అభివృద్ధి చెందేవి.

మస్‌జిద్‌తో కలిసి ఉండే మొట్టమొదటి స్కూలు మదీనాలో 653 సం॥లో ఏర్పాటు చేయబడింది. 744 సం॥లో డమాస్కస్‌లో మొదటి స్కూలు ప్రారంభమయింది. 900 సం॥ వచ్చేసరికి దాదాపు ప్రతీ మస్‌జిద్‌లోను బాలికలకు మరియు బాలురకు విద్య నేర్పడానికి ఒక ప్రాథమిక పాఠశాల ఉండేది.

సాధారణంగా 5 సం॥ల వయస్సున్న పిల్లలు స్కూలులో విద్య నభ్యసించడం ప్రారంభించేవారు. మొదటి పాఠాలలో ముఖ్యమైనది ఏమిటంటే, అల్లాహుతాలా యొక్క అతి సుందరమైన 99 పేర్లను వ్రాయడాన్ని మరియు చదవడాన్ని నేర్చుకోవడం.

చదవడం మరియు వ్రాయడానికి సంబంధించిన ముఖ్య ప్రాథమిక విషయాలు బాగా నేర్చుకున్న తరువాత, ఖుర్ఆన్ గ్రంథాన్ని బాగా అధ్యయనం చేయడం మరియు గణితశాస్త్రాన్ని కూడా బోధించేవారు. ఇంకా ఎక్కువగా చదువుకోవాలనే ఆసక్తిగలవారు, ఉన్నత విద్యను అందించే పెద్ద మస్‌జిద్‌లకు వెళ్లేవారు. అక్కడ వారికి అరబిక్ గ్రామర్ మరియు పద్యభాగం, లాజిక్, ఆల్‌జీబ్రా, బయోలజీ, చరిత్ర, న్యాయ శాస్త్రం (లా) మరియు మతధర్మ శాస్త్రాన్ని బోధించేవారు.

స్పెయిన్‌లో ఉన్నత విద్య తరచుగా మదరసాలలోనూ, హాస్పిటల్స్‌లోను, అబ్జర్వేటరీలోనూ మరియు విద్వాంసుల ఇళ్ళల్లోనూ బోధించబడినప్పటికిని, చాలా వరకూ టీచింగ్ మస్‌జిద్‌లలోనే జరిగేది, 8వ శతాబ్దంలోని కార్డోబా మస్‌జిద్ నుండి ఇది ప్రారంభమైంది.

## స్టడీ సర్కిల్స్ :

మస్‌జిద్ విద్య యొక్క ప్రాథమిక రూపమే - స్టడీ సర్కిల్. ఇస్లామ్‌లో 'హల్‌ఖతుల్-ఇల్మ్'గా ఇది బాగా సుపరిచితం. ఇంకా క్లుప్తంగా చెప్పాలంటే 'హలఖహ్'. 'హల్ఖా' అంటే ఎన్‌సైక్లోపీడియా ఇస్లామ్ యొక్క న్యూ ఎడిషన్

ప్రకారం, 'వృత్తాకారం(circle) లో అంటే గుండ్రంగా ప్రజలు కూర్చుని సమావేశమవడం'. లేదా టీచర్ చుట్టూ విద్యార్థులు సమావేశమవడం.

వేరే ప్రాంతాల నుండి సందర్శించడానికి వచ్చే విద్వాంసులను (scholars) గౌరవ సూచకంగా టీచర్ ప్రక్కన కూర్చోవడానికి అనుమతించేవారు. చాలా హలఖాత్ (స్టడీ సర్కిల్స్)లో సందర్శకుల కోసం ప్రత్యేకంగా ఓ సెక్షన్ (విభాగం) ఉండేది.

ఇరాఖ్‌లోని 930 సం॥లో ఓ పట్టణంలోని అల్-బహ్‌లూలి అనే న్యాయాధికారి తన సోదరునితో సహా ఇటువంటి స్టడీ సర్కిల్స్‌ని చూడటానికి వచ్చారు. అలా వారు ఓ స్టడీ సర్కిల్ కొచ్చారు. అక్కడ జ్ఞానవెలుగుతో ఓ స్కాలర్ జ్ఞానానికి సంబంధించిన వివిధ సబ్జక్టుల యొక్క అన్ని మూలల గురించి మాట్లాడుతున్నాడు.

ఇబ్నె బత్తూత గ్రంథస్థం చేసిన దాని ప్రకారం ఉమ్మయద్ మస్‌జిద్‌లోని హలఖాత్‌కి 500 కంటే ఎక్కువమంది విద్యార్థులు వచ్చేవారు.

కైరో సమీపంలోని అమ్ర్ మశీదులో ఒకానొక సమయంలో 40 హలఖాత్ లుండేవి. కైరోలోని ముఖ్య మస్‌జిద్‌లో 120 హలఖాత్ లుండేవి.

దేశాటన చేసే భౌగోళికుడు అల్-ముఖద్దసి ఇలా చెప్పారు: సాయంకాల సమయాన చేసే రెండు ప్రార్థనల మధ్యకాలంలో, ఈయన తన స్నేహితులతో కూర్చుని మాట్లాడుతుండగా, అతనికి ఓ అరుపు వినిపించింది **'మీ ముఖాలను తరగతి వైపుకు త్రిప్పండి'** అని. అప్పుడతనికి అర్థమయింది - తాము రెండు తరగతులకు మధ్య కూర్చున్నామని. అటువంటివి 110 వరకూ ఉన్నాయి.

నిజానికి హలఖాత్‌లలో టీచర్స్‌కే అధికారం ఉన్నప్పటికీ, స్టూడెంట్స్‌కి టీచర్లతో చర్చించడానికి మరియు సవాల్ చేయడానికి సయితం, టీచర్ చెప్పింది సరిలేకపోతే సరిచేయడానికి, తరచుగా తీవ్రమైన వాదనలకి కూడా అనుమతి నిచ్చేవారు. చూశారా! 1000 సం॥ల క్రితమే ఎంత చక్కటి ఎడ్యుకేషన్ సిస్టమ్‌ని 'ఇస్లాం' ధర్మం ఏర్పరచిందో!

మస్‌జిద్ చుట్టూ శుక్రవారం నాడు సమావేశమైన స్టడీసర్కిల్స్‌లో అన్ని సబ్జక్టులపై జరిగే చర్చలలో వాదనలకు చేసే హద్దే ఉండేది కాదు. 'No holds were barred'.

**- ముస్లిమ్ హెరిటేజ్ వారికి కృతజ్ఞతలతో**

(మిగతా భాగం వచ్చే సంచికలో)

**ఇంతవరకూ వివరించిన విషయాలను బట్టి తెలిసేదేమిటంటే,** 'ఇస్లాం'లో ప్రార్థనను విద్యను విడదీయలేమని. ముస్లిమ్‌లు ప్రాథమిక విద్యను తప్పనిసరిగా నేర్చుకోవాలి. ముస్లిమ్ పాలకులు ఉచిత విద్యను అందించడానికి తోడ్పడేవారు.

మస్‌జిద్‌లు విజ్ఞాన కేంద్రాలుగా, స్టడీ సర్కిల్స్‌గా కూడా ఉండేవి. నేటి ఆధునిక కాలంలో ఉన్న విజిటింగ్ ప్రొఫెసర్స్, విజిటింగ్ స్టూడెంట్‌షిప్ మొ॥వి ఆనాడే ముస్లిమ్ సమాజం అమలులో పెట్టింది.

నిరుపేద రైతు పిల్లలు కూడా చదువుకునేవారని, చదువుకోని పిల్లలున్న గ్రామమే లేదని తెలుస్తుంది. చదవడం, వ్రాయడం తెలియని ముస్లిమ్‌ని కనుగొనడం కష్టమని తెలుస్తుంది.

ముస్లిమ్ పాలనలో జ్ఞానాన్ని పొందడానికి ప్రజలు ఇచ్చిన ప్రాముఖ్యత మరి ఏ ఘనకార్యానికి కూడా ఇవ్వలేదంటే, ఇస్లాం ధర్మం విద్యకు ఎంత ప్రాముఖ్యత నిచ్చిందో అర్థం చేసుకోండి.

5సం॥లు నిండిన పిల్లలు చదువు నేర్చుకోవడానికి వెళ్ళడం, వెయ్యి సంవత్సరాల క్రితమే వేల సంఖ్యలో విద్యార్థులుండే వారంటే, ఆ రోజుల్లో ముస్లిమ్ సమాజం ఎంత ఉన్నతంగా నాగరికంగా జీవించిందో అర్థం చేసుకోవచ్చు.

ఈ రోజున ఇంజినీర్లు, డాక్టర్లు, లాయర్లు, ఐ.ఏ.యస్. ఐ.పి.యస్., బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో నిపుణులు మనచుట్టూ కనిపిస్తూ ఉంటారు. వీరంతా ఈ స్థాయికి చేరడానికి చిన్నప్పటినుండి స్కూలు, కాలేజీలలో కష్టపడి చదివారు.

వీరి చదువు, వీరికి పూర్తి జ్ఞానాన్నిచ్చింది అని మీరు అనుకుంటున్నారా? ఈ చదువు వారు బ్రతకడానికి ఉపాధి కల్పించడానికి, సమాజానికి వారి చదువు ద్వారా సేవచేయడానికి మాత్రమే.

**అది చాలు కదా! ఇంకేం కావాలి?**

ముఖ్యమైనదే మిస్సయిపోయింది. అదే ధర్మం. ఓ ఇంజినీర్‌కి ఇంజినీరింగ్ చదువుతో పాటు, ధర్మజ్ఞానం ఉంటే, దైవభీతి ఉంటే, కల్తీతో నాణ్యత లోపించే పనులు చేయలేడు. ఓ డాక్టర్‌కి ధర్మం గురించి తెలిసి, దైవభీతి ఉంటే, 'రోగి'కి సంపాదన దృష్టితో కాకుండా, మానవతా దృక్పథంతో వైద్యం చేస్తాడు. ఇక నేటి న్యాయవ్యవస్థ ఎలా ఉందో, వ్యాపారాలు ఎలాంటి స్థాయిలో జరుగుతున్నాయో మీకందరికీ తెలుసు. లాయర్లు, బిజినెస్‌మెన్‌లు ధర్మజ్ఞానాన్ని పొంది, దైవభీతితో వారి విధులను సక్రమంగా నిర్వర్తిస్తే సుందర సమాజం ఏర్పడదా? ఇన్షాఅల్లాహ్ తప్పకుండా ఏర్పడుతుంది.

అమెరికాలో సైన్స్ బాగా అభివృద్ధి చెంది ఉండవచ్చు. కాని మానవత్వం మాత్రం అభివృద్ధి చెందలేదు. అందువలననే ప్రపంచంలో చాల ప్రదేశాలపై అన్యాయంగా దాడులు చేస్తున్నారు. వాటి కొరకు అబద్ధ సాక్ష్యాలను సృష్టించి చూపిస్తున్నారు.

కాబట్టి నేటి 'విద్య' వలన సగం లేదా కొంత జ్ఞానం మాత్రమే లభిస్తుంది. మిగిలిన భాగం 'ధర్మజ్ఞానం'. అది లేకుండా మనిషికి శాంతే లేదు.

ఈ భావనను ఇస్లాం ఆచరణాత్మకంగా మనకు చూపింది.

ఆ కాలం మదరసాలలో ఆల్‌జీబ్రా, బయాలజీ సబ్జక్టులను కూడా నేర్పేవారు. కాని అప్పటికి ప్రపంచంలోని మిగతా దేశాలలో ఎక్కడో అరుదుగా ఇటువంటివి బోధించి ఉంటారేమో! ఒకవేళ బోధించక పోయినా ఆశ్చర్య పోనవసరం లేదు. అంటే కొత్త సబ్జక్టులను, లేటెస్ట్ టెక్నాలజీని బోధించేవారని తెలుస్తుంది. మరి నేటి మదరసాలు(స్కూళ్లు) లేటెస్ట్ టెక్నాలజీని, సబ్జక్టులను బోధించకపోతే, తప్పు ఎవరిది?

'ఇస్లాం' ధర్మానిది మాత్రం కాదు. ఇస్లాం ధర్మాన్ని సరియైన విధంగా అర్థం చేసుకోకపోవడం వలనే ఇలా జరుగుతుంది. ఖుర్ఆన్ మరియు హదీస్ జ్ఞానంతోపాటు, మిగిలిన సబ్జక్టులను కూడా అధ్యయనం చేయమని ఇస్లాం ధర్మం ప్రోత్సహిస్తుంది. ఎవరైనా సరే తమ పూర్వీకుల యొక్క చరిత్రను తెలుసుకోవాలి.

ప్రపంచానికి నాగరికతను నేర్పి, ప్రపంచ ప్రజలందరూ ఒకే జంటనుండి వచ్చిన వారేనని చెప్పి, తోటివానితో మంచిగా మెలగమని బోధించిన ఇస్లాం ధర్మం గురించి తెలుసుకోవడం ఈనాటి ముస్లిముల యొక్క ప్రథమ కర్తవ్యం.

**ఇస్లాంలో ప్రార్థనను మరియు విద్యను విడదీయలేమని తెలుసుకోవాలి. ధర్మ జ్ఞానం, లోకజ్ఞానం రెండూ కావాలి. అప్పుడే జీవితం అర్థవంతమౌతుంది.**

### మనిషి కోతినుండి పరిణామం చెందాడనే

# డార్విన్ సిద్ధాంతం - శాస్త్రీయ వాస్తవం కాదు.

**పై సిద్ధాంతాన్ని తప్పు అని నిరూపించే వ్యాస క్రమంలో ఈ నెల అద్నాన్ అక్తర్ గారి (అందరికీ హారున్-యహ్యా గా ఈయన సుపరిచితమే) వీడియో MIRACLE IN THE EYE (Documentary Film) ను www.harunyahya.net నుండి డౌన్‌లోడ్ చేసి తెలుగులో మీకందిస్తున్నాం.**

## కంటిలో అద్భుతం

ఈ క్షణంలో భూమిమీద గొప్ప అద్భుతాలలోని ఓ అద్భుతం జరుగుతూ ఉంది. ఇప్పుడు మీరు ఈ వ్యాసం చదువుతున్నారు. తెల్లటి కాగితంపై నల్లటి అక్షరాలు, మీ చుట్టూ వస్తువులు, పరిసరాలు, మీరు గ్రహిస్తున్న వాటి రంగులు, జీవం, సామీప్యం, దూరం, అందం ఇవన్నీ ... మీకు తెలుస్తున్నాయి కదా! అవి మీకు ఎలా తెలుస్తున్నాయి?

మీ మెదడులో ఉండే కటిక చీకటిలో ఇవన్నీ రూపుదిద్దుకోవడం వలననే మీకు తెలుస్తున్నాయి.

ఎందుకంటే మీరు చూస్తూ ఉన్నారు కాబట్టి .....

మీ జీవితంలో ఏమైనా అర్ధవంతం అయ్యాయంటే, అవి మీ ఇంద్రియాల ద్వారానే - చూపు మరియు మీకు ఉన్న ఇతర ఇంద్రియ జ్ఞానాలు (సెన్సెస్).

మీ కుటుంబం, మీ ఇల్లు, మీ ఆఫీస్, మీ స్నేహితులు మరియు మీ పరిసరాలలోని ప్రతీదాన్ని మీరు వెంటనే గుర్తిస్తారు. మీ చూపుకు ధన్యవాదాలు.

కళ్ళు లేకుండా, మీ చుట్టూ ఉండే దేని గురించైనా వెంటనే, పరిపూర్ణంగా సెన్స్ చేయలేరు కదా!

అవిలేకుండా రంగులను, రూపాలను, దృశ్యాలను, మనుష్యుల ముఖాలను మీరు ఊహించుకోలేరు.

అవి ఉండబట్టే అన్నీ చూడగలుగుతున్నారు. ఈ పుస్తకాన్ని చదవగలుగు తున్నారు. థాంక్స్ టు యువర్ ఐస్. ఏదైనా వస్తువును మీరు చూడాలనుకుంటే, దాని కొరకు మీరు ప్రత్యేకంగా కృషి చేయవలసిన అవసరం లేదు, ఆ వస్తువున్న వైపు మీ తల త్రిప్పితే సరిపోతుంది.

ఆ వస్తువును చూడగానే మీకు తెలుస్తుంది. దాని కొరకు మీరు మీ కళ్ళకు ప్రత్యేకమైన ఆదేశాలేమైనా ఇచ్చారా?

లేదే!

"ఆ వస్తువును చూడు, ఫోకస్ చేసుకో, విశ్లేషించు" మొ॥న ఆదేశాలను మీ కళ్ళకు గాని, మీ కళ్ళను మెదడుతో కలిపే ఆప్టిక్ నరాలకి (ఆప్టిక్ నెర్వ్స్)గాని లేదా మెదడుకే డైరక్ట్‌గా గాని ఆదేశాలు ఇవ్వవలసిన అవసరం ఎంతమాత్రం లేదు.

మనం ఏదైనా వస్తువుకు ఫొటో తీయాలంటే, ఆ వస్తువు దూరంగా ఉంటే ఫోకస్ ఎడ్జస్ట్ (సరి) చేసుకోవాలి. అది దగ్గరిగా ఉంటే క్లోజ్అప్ సెలక్ట్ చేసుకోవాలి. కాని మీ కళ్ళలో ఉండే లెన్స్‌లు అటువంటి ఆప్టికల్ కొలతలను తీసుకోకుండానే వెంటనే ఫోకస్ చేసుకుంటాయి.

అంటే మనం చూడాలని అనుకుంటే చాలు, క్షణం కంటే అతి తక్కువ సమయంలోనే, మన కళ్ళు ఫోకస్ చేసుకోవడం, మెదడుకు అందించడం, మనకి ఆ వస్తువు గురించి తెలియడం అన్నీ వెంటవెంటనే జరిగిపోతాయి.

కాని నిజానికి ఆ గొప్ప అద్భుత చూపు ఏమిటో మీకు తెలుసా?

మర్చిపోవద్దు! ప్రతీ క్షణం మనం కళ్ళను తెరచి మూస్తూ ఉంటాం. మనం చూసే ప్రతీ దృశ్యం, మనకు మనస్సులో తలపోస్తుంది సకల లోకాల సృష్టికర్తకు కృతజ్ఞతలు తెలియజేయమని. ఆయనే ప్రతీదానిని శూన్యం నుండి సృష్టించాడు.

> "మరియు అల్లాహ్ మిమ్మల్ని మీ తల్లుల గర్భాల నుండి , బయటికి తీశాడు (పుట్టించాడు) అప్పుడు మీకేమీ తెలియదు. మరియు మీకు వినికిడినీ, దృష్టినీ మరియు హృదయాలను ప్రసాదించాడు. బహుశా మీరు కృతజ్ఞులై ఉంటారని" (**దివ్య ఖుర్'ఆన్** 16:78)

**కంటి యొక్క ఖచ్చితమైన నిర్మాణం :**

గడచిన కొన్ని సెకన్లలో, మీ కళ్ళల్లో సుమారుగా వంద బిలియన్ల చర్యలు పూర్తి అయివుంటాయి.

విశ్వం యొక్క టెక్నాలజీకి సంబంధించిన ఓ ఉదాహరణ కన్ను రూపంలో మీ దగ్గరుంది అంటే ఎంత విచిత్రంగా అనిపిస్తుంది?

ఈ టెక్నాలజీని గ్రహించడంలో పూర్తిగా దీని దరిదాపులకు కూడా ఏ సైంటిస్టూ చేరుకోలేదు. దీనికి కాస్త పోలినదేదో కనిపెడుతూ ఉండవచ్చు.

కంటి యొక్క సంక్లిష్ట నిర్మాణం మరియు దాని యొక్క ప్రత్యేకమైన పనిని బట్టి, ఈ కళ్ళు మన శరీరంలో చిన్న ప్రదేశాన్ని మాత్రమే ఆక్రమించాయి.

కళ్లు ఉండే ప్రదేశం - మన శరీరభాగాలని, మొత్తం శరీరాన్ని సరియైన విధంగా నియంత్రించడానికై సూచనలనిచ్చేలా వీలు కల్పిస్తుంది.

ఒక్క క్షణం ఊహించండి. ఒకవేళ మన కళ్ళు మన మోకాళ్ళ దగ్గరో లేక కాలి చీలమండల (ankle) దగ్గరో ఉన్నాయనుకోండి.

అప్పుడు మనకు మనం నడుస్తున్న క్రింది దారి కనిపిస్తుందేగాని, అలా

నడిచి వెళితే, కనిపించకుండా అడ్డుగానున్న వేటికో మన తల ఢీకొడుతుంది.

అటువంటి సరికాని శరీర నిర్మాణమే గనుక మనం కలిగి ఉంటే, మామూలుగా చేసే చాలా పనులైన తినడం, త్రాగడం పరికరాలు ఉపయోగించడం మొదలైనవి చేయడం మనకు చాలా కష్టమయ్యేది.

మన శరీరంలో కళ్ళు సరియైన చోట ఉండటమే కాకుండా, మన ముఖంలో అవి చాలా ఖచ్చితమైన స్థానంలో అమర్చబడ్డాయి.

ఉదాహరణకు మన కళ్ళు ఒకవేళ ముఖంలో ముక్కు క్రింద ఉంటే, చూడటానికి వికారంగా ఉండటమే కాదు, నిరపాయకరమైన కోణంలో (safe angle) చూడటం మనకు సాధ్యం కాదు. చూపుకి ఎక్కువ సౌకర్యంగా ఉండే స్థానంలోనే మన కళ్ళు ఉన్నాయి.

ఇక కళ్ళ యొక్క వింత భాగాల గురించి చెప్పుకుందాం. అవి వీటి కంటే గొప్పగా ఉంటాయి.

కనుబొమల నుండి కార్నియా వరకు, కన్నీళ్ళు ఏర్పడటం నుండి కనురెప్పల వరకూ, ప్రతీదానిలోనూ ప్రతీ చిన్న విషయంలోనూ ఓ ప్రత్యేకమైన అద్భుతమే!

**కనురెప్పలు:**

తెలియకుండానే రోజుకు వేలసార్లు మనం మన కళ్ళను బ్లింక్ చేస్తుంటాము. ఇలా మన ప్రమేయం లేకుండా అనుకోకుండా జరిగే కదలికలు చాలా వరకూ తీవ్రమైన వెలుగు నుండి, బాహ్య ధూళి కణాల నుండి, కళ్ళు తమను తాము భద్రంగా ఉంచుకోవడానికి దోహద పడుతున్నాయి.

ఇలా తెరుస్తూ, మూస్తూ ఉన్నప్పుడు, కనురెప్పలు కన్ను యొక్క ఉబ్బెత్తుగా ఉండే ఆకారానికి ఖచ్చితంగా సరిపోతాయి. అందువలన కంటి యొక్క ఉపరితలాన్ని పూర్తిగా కనురెప్ప కప్పగలుగుతుంది.

కనుగ్రుడ్డు వంపుకు అంత ఖచ్చితంగా కనురెప్ప ఫిట్ కాకపోతే, చేరుకోలేని కంటి మూలల నుండి ధూళికణాలను తొలగించడం అసాధ్యమయ్యేది. మనకు తెలియకుండా జరుగుతున్న ఇటువంటి చర్య నిజానికి మనకు ఓ వరమే!

ఇలా ఆటోమెటిక్‌గా బ్లింకింగ్ జరగకపోతే ఏమవుతుంది?

ఏమవుతుందంటే కళ్ళల్లో దుమ్ము బాగా ఎక్కువగా చేరినప్పుడు మాత్రమే కనురెప్పలు ఆడించాలని మనకు జ్ఞాపకమొస్తుంది. ఫలితంగా, అతి చిన్న ధూళికణం కూడా చివరికి పెద్ద సమస్యలనే సృష్టిస్తుంది. అది ఇన్‌ఫెక్షన్‌కి దారి తీయవచ్చు.

ఇలా సగం సగం మాత్రమే కళ్ళు శుభ్రమయితే, చూపు కూడా మందగిస్తుంది. ఇందులో మరొక ముఖ్యమైన పాయింట్ ఏమిటంటే, బ్లింకింగ్ (కను రెప్పలాడించడం) మధ్యనున్న కాల వ్యవధి.

ఎటువంటి అవరోధాలు లేకుండా, మనిషికి తన చుట్టూ మారుతున్న పరిసరాలు తెలియజేయబడుతూ ఉండాలి. ఉదాహరణకు మనం కారులో వెళుతుంటే మన చుట్టూ ఉండే ప్రదేశాలు మారిపోతూ ఉంటాయి కదా!

అందుకని, మనం చూస్తున్న వస్తువు నిరంతరంగా కన్పించడానికి ఈ బ్లింకింగ్ చాలా తక్కువ సమయంలోనే జరగాలి.

ఒకవేళ ఈ బ్లింకింగ్ వెంటవెంటనే జరగకుండా ఎక్కువ సమయాన్ని తీసుకుంటే తీవ్రప్రమాదాలకి కారణమౌతుంది. హైవే మీద కారులో ప్రయాణం చేస్తున్నామనుకోండి. రెప్పలు మూసుకుని, వెంటనే తెరుచుకోకుండా కాస్సేపు అయిన తరువాత తెరుచుకుంటే ఏమవుతుంది? ఈ లోపునే ఏదైనా అడ్డు వస్తే, దానిని మన కారు గుద్దుకుంటుంది.

మన కనురెప్పల బ్లింకింగ్ కూడా మనకు తెలియకుండానే జరుగుతూ ఉంటుంది. బ్లింకింగ్ కావడంలోని ఈ సున్నితమైన బ్యాలన్స్ మనం పుట్టినప్పటినుండి జరుగుతూనే ఉంది.

ఇది దైవం యొక్క పోల్చ సాధ్యం కాని సృష్టికి ప్రత్యక్ష సాక్ష్యం :

"ఓ మానవుడా! పరమదాత అయిన నీ ప్రభువును గురించి, ఏ విషయం నిన్ను ఏమరుపాటుకు గురిచేసింది? ఆయనే నిన్ను సృష్టించాడు, తరువాత ఎలాంటి లోపం లేకుండా నిన్ను తీర్చిదిద్దాడు మరియు నిన్ను తగిన ప్రమాణంలో రూపొందించాడు. తాను తలచిన ఆకారంలో నిన్ను మలిచాడు" (**దివ్య ఖుర్'ఆన్ 82:6-8**)

**కన్నీరు : ఖచ్చితమైన కన్నీటి బొట్టు**

కన్నీటి బొట్టు చాలా అసాధారణమైన ద్రవం. ఇది విభిన్న అంశాలను కలిగి, వివిధ ప్రత్యేకమైన పనులకు ఉపయోగపడుతుంది.

ప్రాథమికంగా, కన్నీటిబొట్టు కంటిని క్రిముల నుండి కాపాడుతుంది.

కన్నీటిలో లైసోజైమ్(lysozyme) అను జెర్మిసైడల్ ఎంజైమ్ ఉంటుంది. ఇది కళ్ళలో క్రిములు లేకుండా చేస్తుంది. మైక్రోబ్‌లను చంపే సామర్థ్యం ఈ ఎంజైమ్‌కి ఉంది. చాలా రకాల బాక్టీరియాను చిదిమేస్తుంది. శక్తివంతమైన లైసోజైమ్ వాస్తవానికి, మన ఇళ్ళలోని క్రిములను చంపడానికి వాడే కొన్ని రసాయనాల (కెమికల్స్) కంటే కూడా బలమైనది.

ఇటువంటి ప్రభావాలను కలిగియుండి, మన కళ్ళకు పూయగలిగే కృత్రిమమైన క్రిమి సంహారి లేనే లేదు.

అంతేకాకుండా మరో అద్భుతం ఏమిటంటే, అలాంటి బలమైన పదార్థం అయివుండి కూడా మన కళ్ళకు స్వల్పమైన ప్రమాదాన్ని కూడా కలుగజేయదు.

ఇంత సున్నితంగా లెక్కప్రకారంగా ఏర్పాటుచేసిన వ్యవస్థను మన కంటిలో సృష్టించింది మరెవరో కాదు - సర్వశక్తుడైన 'అల్లాహ్'.

ఖుర్'ఆన్‌లో ఒక వాక్యంలో ఇలా చెప్పబడింది:

"వాస్తవంగా మేము మానవుడిని సర్వశ్రేష్ఠమైన ఆకారంలో సృష్టించాము" (**దివ్య ఖుర్'ఆన్ 95:4**)

చాలా దగ్గరగా పరీక్షిస్తే, ఈ కన్నీటి బొట్టు తయారీలో ఎలాంటి అద్భుతం దాగి ఉందో బాగా అర్థం చేసుకోగలుగుతాము.

కార్నియా తడిగా ఉండేలా, దానిని పొడికాకుండా రక్షించడానికి మరియు కనుగ్రుడ్డు యొక్క జారే గుణాన్ని కొనసాగించడానికి కావలిసినంత కన్నీరు మాత్రమే ఖచ్చితమైన పరిమాణంలోనే విడుదలౌతుంది.

ఈ విధంగా కంటిలో నీరు విడుదల అవడం వలన కనుగ్రుడ్డు తిరుగుతున్నప్పుడు, దీని పై భాగానికి మరియు కనురెప్ప లోపలి భాగానికి మధ్య అసౌకర్యమైన ఘర్షణ (friction) లేకుండా ఉంటుంది.

ఒకవేళ కన్నీరు గనుక కావల్సిన మోతాదులో తయారవకపోతే, కనురెప్ప మరియు కనుగ్రుడ్డు మధ్య ఘర్షణ ఏర్పడి ఆపలేని నొప్పి కలుగుతుంది. ఈ విధంగా జరిగినప్పుడు మన కళ్ళల్లో ఇసుక ఉన్నట్లుగా నిరంతరం మండుతున్న అనుభూతి కలుగుతుంది.

కళ్లు ఎర్రగా ఉబ్బుతాయి. మరీ ఎక్కువైతే గ్రుడ్డితనానికి దారితీస్తుంది. ఎప్పుడైనా ఒకవేళ ఏదైనా ధూళికణంగాని మనకళ్ళల్లో పడి చికాకు పెడితే, వెంటనే ఆటోమెటిక్‌గా కళ్ళల్లో నీరు ఎక్కువగా తయారవుతుంది.

మరోలా చెప్పాలంటే, ఖచ్చితమైన మరియు సరియైన అవయవ నిర్మాణాన్ని కలిగి ఉండే కన్నీటి గ్రంథులు ఖచ్చితంగా కావలిసిన పరిమాణంలోనే కంటిలో నీటిని విడుదల చేసేలా కంట్రోల్ చేస్తూ ఉంటాయి.

పూర్వకాలంలో మనిషికి కన్నీళ్లు వచ్చాయి. ఇప్పుడూ మనిషికి కన్నీరు వస్తుంది. అవి మనిషినుండి మనిషికి మారవు.

క్రింది ఖుర్ఆన్ వాక్యాన్ని గమనించండి :

"ఆయన (అల్లాహ్) తన ఇష్టానుసారంగా మిమ్మల్ని (మాతృ) గర్భాలలో తీర్చిదిద్దుతారు. ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. ఆయన సర్వశక్తిమంతుడు, మహా వివేకవంతుడు"

**(దివ్య ఖుర్'ఆన్ 3:6)**

**చూపు ఎలా కూర్చబడుతుంది?**

పుట్టినప్పటినుండి మనిషి చూసే ప్రతీ దృశ్యం కూడా మెదడులో కొన్ని ఘనపు సెంటీమీటర్ల పరిమాణంలో ఉండి, కటిక చీకటి మరియు తేమగా ఉండే వాతావరణంలో ఉండే 'దృశ్య కేంద్రం' (visual centre) గా పిలువబడే ప్రదేశంలో కూర్చబడుతుంది.

చిన్న గదియొక్క దృశ్యాలే కాకుండా సువిశాలమైన ప్రకృతి దృశ్యాలు కూడా ఏర్పడేవి మెదడులోని ఈ చిన్ని ప్రదేశంలోనే.

మన స్వంతమైనవి, మన బాల్యం, మనం వెళ్లిన స్కూళ్ళు, మన ఇండ్లు, పని, కుటుంబం, దేశం, క్లుప్తంగా మనం చూసిన ప్రతీ చిన్న వివరం, అన్నీ కూడా మెదడులోని చిన్ని భాగంలో ఉంటాయి.

మన చూపులో మొదటి దశ : కాంతి కిరణాలు మన కళ్లల్లోకి ప్రవేశించి కార్నియా, కనుపాప, మరియు లెన్స్(కటకాల) ద్వారా కంటి లోపలికి ప్రయాణిస్తాయి. రెటీనాలోని కాంతికి ప్రభావితమయ్యే కణాలు, ఆ కాంతిని ఎలక్ట్రికల్ సంకేతాలుగా మార్చి మెదడుకు పంపుతాయి.

రెటీనా నుండి వచ్చే దృశ్యం తలక్రిందులుగా ఉంటుంది.

కాని మెదడు ఈ దృశ్యాన్ని సరియైన విధంగా తిరగవేస్తుంది.


ప్రతీ కన్ను నుండి వచ్చే సంకేతాలలో వస్తువుకు సంబంధించి గ్రహించిన దృశ్య వివరాలు ఉంటాయి.

రెండు కళ్ళనుండి వచ్చిన దృశ్యాలను 'మెదడు' (brain) కలిపి, ఒకే త్రీ డైమన్షనల్ దృశ్యాన్ని తయారు చేస్తుంది. టూ డైమన్షనల్ దృశ్యానికి ఉదాహరణ ఫొటో అయితే, త్రీ డైమన్షనల్ దృశ్యానికి ఉదాహరణ వీడియో.

అంతేకాకుండా ఆ దృశ్యానికి సంబంధించిన రంగులను మరియు అది మనకు ఎంత దూరంలో ఉందో మొ॥న విషయాలను మెదడు నిర్ధారిస్తుంది. ఈ మొత్తం పని అంతా మెదడులో ఒక సెకనులో పదవవంతు కంటే తక్కువ సమయంలోనే జరుగుతుంది.

మన కన్ను లెక్కలేనన్ని రకరకాల భాగాలతో మరియు పొరలతో తయారైంది. వీటిలో కొన్ని : **కార్నియా** (కంటి గుడ్డు మీద ముందు ఉండే పారదర్శకమైన గట్టి భాగం), **ఐరిస్** (కంటిపాపకు చుట్టూ ఉండే నల్లని పొర), **పుపిల్** (కనుపాప), **లెన్స్** (కటకాలు), **ఐలిడ్** (కనురెప్ప), **రెటీనా**ను మెదడుకు కలిపే నరాలు మరియు లెక్కలేనన్ని ఇతర నిర్మాణాలు.

ఇవన్నీ కలిసి ఒకేసారి మొత్తంగా మాత్రమే పనిచేస్తాయి.




కళ్లు వేటినైనా చూడాలంటే, పై నిర్మాణాలను మరియు అదే సమయంలో టిష్యూలను కూడా కలిగి ఉండాలి. అవి ఖచ్చితంగా మరియు సంపూర్ణంగా ఏకకాలంలో ఒకేసారి పనిచేయాలి.

**మనిషి అనుకోకుండా కాకతాళీయంగా తయారుచేయబడి, ఎన్నో పరిణామ క్రమాల అనంతరం ప్రస్తుతం ఈ స్థితికి వచ్చాడని చెప్పే డార్విన్ సిద్ధాంతం సరికాదు అని పై విషయాలు తెలియజేస్తున్నాయి.**

**కన్నులాంటి ఖచ్చితమైన అవయవం అల్లాహ్ చేసిన సృష్టినుండి కాకుండా, మరే విధంగానూ తయారుకాలేదు. దానిలో గొప్ప టెక్నాలజీ ఉంది. ఎంతో వివేకమైన డిజైనూ ఉంది.**

ఈ వ్యవస్థలన్నింటిని సృష్టించి, వాటిమధ్య గొప్ప సామరస్యాన్ని ఏర్పాటు చేసిన అల్లాహ్ సర్వశక్తిమంతుడు. క్రింది ఖుర్ఆన్ వాక్యాన్ని గమనించండి:

"ఆయనే ఆకాశాలనూ మరియు భూమినీ ఏమీలేని శూన్యం నుండి సృష్టించిన వాడు మరియు ఆయన ఏదైనా చేయాలని నిర్ణయించుకున్నప్పుడు దానికి కేవలం : "అయిపో! అని ఆజ్ఞాపిస్తాడు. అంతే అది అయిపోతుంది." **(దివ్య ఖుర్'ఆన్ 2:117)**

( ఇంకావుంది )

ఒక విషయంలో జ్ఞాని అయినవాడు, అన్ని విషయాలలోనూ జ్ఞాని కాకపోవచ్చని ఉదాహరణ పూర్వకంగా క్రిందటి సంచికలో వివరించాము. లెక్కలు చేయడంలో జ్ఞానమున్న ఓ ఉపాధ్యాయుడు, లెక్క సరిగ్గానే చేసినప్పటికిని, తన పిల్లలను నదిలో కోల్పోయి, చిన్న విషయంలో ఎలా అజ్ఞాని అనిపించుకున్నాడో చెప్పడం జరిగింది.

"ఖుర్'ఆన్ నన్ను హేతువాదిని చేసింది" అని చెబుతూ 'జ్ఞానిగా' ఫీలయ్యే ఇ.ఏ.జబ్బార్ అనే అజ్ఞాని వ్రాసిన వ్యాసాన్ని తప్పుపడుతూ, ఆ వ్యాసంలోని అజ్ఞాన విషయాలను, జ్ఞానానికి సంబంధించిన ప్రామాణిక గ్రంథ విషయాలతో వివరించడంతో ఈ శీర్షికను ప్రారంభించాము.

(ఖుర్'ఆన్ నన్ను హేతువాదిని చేసింది, పత్రిక పేరు: **నాస్తిక యుగం**, సంపుటి 4, సంచిక 1-2, ఎడిటర్: గొ॥ జయగోపాల్, పత్రిక చిరునామా: 10-15-3, పిఠాని వీధి, విశాఖపట్నం - 530 002)

నాస్తికులు స్వయంగా తమను తాము జ్ఞానులుగా భావిస్తూ, తమ అజ్ఞానాన్ని వారి స్వీయ పత్రికల ద్వారా ఎలా పంచిపెడుతున్నారో వివరించి, వారి వలన సమాజానికి ఎంత నష్టం జరుగుతుందో జరిగిన వాస్తవ సంఘటనల ద్వారా మీముందుంచాము.

ఇ.ఏ. జబ్బార్ చెప్పినవన్నీ అసత్యాలని ఋజువుచేయడం పూర్తి అయినప్పటికిని, బానిసత్వానికి సంబంధించిన ఓ అంశం మిగిలిపోయింది. ఆ అంశాన్ని ఈ సంచికలో అందిస్తామని తెలియజేశాము.

ఇ.ఏ.జబ్బార్ వేసిన అపనింద :

**"ముహమ్మద్ కాలం నాటి సాంఘిక వ్యవస్థ బానిసత్వంతో వుంది. ఖుర్'ఆన్ వెల్లడించిన నైతిక సూత్రాలు కూడా బానిసత్వంలోంచే వచ్చాయి. బానిసలైన ఆడపిల్లలతో సెక్స్ సంబంధాలుంచు కోవచ్చని ఖుర్'ఆన్ అనుమతిస్తోంది. కాని నా నీతి, నా మనస్సాక్షి మాత్రం 'అది దేవుని మాట' అని అంగీకరించలేదు."**

ముహమ్మద్(స)వారి కాలంనాటి సాంఘిక వ్యవస్థలోనే బానిసత్వం ఉందా? అసలు సాంఘిక వ్యవస్థలో బానిసత్వం ఎప్పటి నుండి ఉందో ఈ అజ్ఞానికి అవగాహన లేదు.

ఇతనికి నీతి, మనస్సాక్షి ఉన్నాయని అతనే స్వయంగా చెప్పుకుంటున్నాడు గాని, నీతి కలవాడైతే ఓ విషయాన్ని పూర్తిగా అర్థం చేసుకోకుండానే ఓ నిర్ణయానికి వస్తాడా?

'నీతి' అంటే ఏమిటో నాస్తికులకు తెలుసా? నాస్తికులు కూడా మనస్సాక్షి, మనస్సు అని చెప్పడం చాలా హాస్యాస్పదంగా ఉంది.

సరే విషయానికొద్దాం. ఇతను అజ్ఞానే! ఆ విషయం క్రిందటి సంచికలోనే ఋజువైంది. ఇలాంటి అజ్ఞానులను మనం ఈ శీర్షిక ద్వారా, ఇన్షా అల్లాహ్, సంస్కరించే ప్రయత్నం చేద్దాం.

ఇంటర్‌నెట్‌లో పేరుగాంచిన వికిపీడియా 'బానిసత్వం' గురించి అందిస్తున్న వివరాలలో కొన్నింటిని పాఠకుల ప్రయోజనార్థం క్రింద అందిస్తున్నాము.

http://en.wikipedia.org/wiki/History_of_slavery

## ***Slavery in American colonial law***

**1642:** Massachusetts becomes the first colony to **legalize slavery.**

**1650:** Connecticut **legalizes slavery.**

**1661:** Virginia **officially recognizes slavery** by statute.

**1662:** A Virginia statute declares that children born would have the same status as their mother.

వర్జీనియా రాష్ట్రంలో బానిస స్త్రీకి బిడ్డ పుడితే, ఆ బిడ్డ కూడా బానిసే అవుతాడని అక్కడి చట్ట శాసనం ప్రకటించింది.

కాని ఇస్లాంలో బానిస స్త్రీ, తన యజమాని ద్వారా బిడ్డకి జన్మనిస్తే, ఆ బిడ్డ బానిస కాదు. యజమానికి స్వంత బిడ్డ అవుతుంది. ఇది ఇస్లాం చట్ట శాసనం. రెండింటి బేధం అర్థమైంది కదా! 17వ శతాబ్దంలో తెల్లజాతి వారు బానిసత్వాన్ని చట్టబద్ధం చేస్తే, అప్పటికి 1000 సం॥లకు పూర్వమే ఇస్లాం ధర్మం ద్వారా బానిసత్వ నిర్మూలనను ప్రారంభించారు మహనీయ '**ముహమ్మద్(స)**'.

**1663:** Maryland **legalizes slavery**.

**1664:** Slavery is legalized in New York and New Jersey.

చూశారా! పైన అందించిన వివరాల ద్వారా అమెరికాలోని న్యూయార్క్, న్యూజెర్సీ, వర్జీనియా, మేరీలాండ్, కనెక్టికట్, మాసాచూసెట్స్ రాష్ట్రాలలో బానిసత్వాన్ని చట్టబద్ధం చేయడం 1642-1664 మధ్యకాలంలో మొదలైంది.

కాని వీరి కంటే 1000 సం॥ల ముందే, ఇస్లామీయ సామ్రాజ్యంలో బానిసత్వ నిర్మూలన మొదలైంది.

ఇప్పుడు చెప్పండి! **ఎవరు నాగరికులు? ఎవరిది ఆటవిక న్యాయం?**

బానిసత్వాన్ని నిర్మూలించే ముస్లిములా? లేక బానిసత్వాన్ని చట్టబద్ధం చేసిన తెల్లజాతి వారా?

**ఇలా చరిత్రను గురించి తెలుసుకుంటే, ప్రపంచానికి నాగరికత నేర్పినది 'ఇస్లాం' ధర్మాన్ని అనుసరించే వారేనని తెలుస్తుంది.**

బానిసత్వం గురించి ఓ నాస్తికుడు అసత్యాలతో ముహమ్మద్(స)వారిని చెడుగా వర్ణిస్తే, వికిపీడియాలో క్లుప్తంగా ఎలా వివరించారో చూడండి:

http://en.wikipedia.org/wiki/Islam_and_slavery

## Muhammad's traditions

The Islamic prophet Muhammad encouraged manumission

of slaves, even if one had to purchase them first. On many occasions, Muhammad's companions, at his direction, freed slaves in abundance. Muhammad personally freed 63 slaves, and his wife Aisha freed 67. In total his household and friends freed 39,237 slaves. The most notable of Muhammad's slaves were: Safiyya bint Huyayy, whom he freed and married; Maria al-Qibtiyya, given to Muhammad by a Byzantine official, whom he freed and who may have become his wife; Sirin, Maria's sister, whom he freed and married to the poet Hassan ibn Thabit and Zayd ibn Harithah, whom Muhammad freed and adopted as a son. (గమనిక: పై వికిపిడీయా చెప్పిన మారియా అల్-ఖిబ్తియ్యాను ముహమ్మద్(స) వారు వివాహం చేసుకున్నారు).

ఇస్లాం ధర్మం 7వ శతాబ్దంలోనే బానిసత్వాన్ని ఆచరణ యోగ్యమైన మార్గం ద్వారా నిర్మూలించి, బానిసలకు మరియు యజమానులకు మధ్య సోదర భావాన్ని మరియు బంధుత్వాన్ని ఏర్పరచింది.

ఇక సవివరంగా అసలు నిజాలను చర్చిద్దాం!

- **అసలు బానిసత్వం అంటే ఏమిటి?**
- **ఇది ఎప్పటి నుండి సమాజంలో ఉంది?**
- **ముహమ్మద్(స)వారు జీవించిన సమాజానికే అది పరిమితమా?**

ఒక యంత్రాన్ని (మెషీన్‌ని) లేదా ఓ జంతువుని యజమాని తనకిష్టమైన విధంగా స్వార్థంతో ఎలా వాడుకుంటాడో, అలాగే ఓ మనిషిని, వాని ఇష్టానితో సంబంధం లేకుండా, తన కోసం ఉపయోగించుకోవడమే బానిసత్వం. సులభంగా చెప్పాలంటే మనిషి రూపంలో ఓ జంతువులా వెట్టిచాకిరీ చేసేవాడే - 'బానిస'. స్వేచ్ఛ ఉండదు. యజమాని కొడితే పడి ఉండాలి. ఎదిరించకూడదు. తిండిపెడితే తినాలి. లేకపోతే లేదు. విశ్రాంతి (రెస్ట్) తీసుకోవడం కూడా యజమాని ఇష్టపడితేనే, లేకపోతే లేదు.

పేదరికాన్ని, ఆకలిని, దాహాన్ని మనిషి భరించగలడుగాని, స్వేచ్ఛను కోల్పోయి జీవచ్ఛవంలా బ్రతకడాన్ని భరించలేడు. భయపడతాడు.

బ్రిటిష్‌వారు వర్తకం పేరుతో మన భారతీయుల్ని మోసం చేసి, మన దేశాన్ని ఆక్రమించి, మనవాళ్ళని బానిసలుగా చేసుకున్నారు. 200 సం॥లకు పైగానే వారు మనవాళ్ళని పాలించారు. మన తాతలు, వారి తాతల కాలంలో ప్రజలు ఈ బానిసత్వానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం పోరాడారు. వారి పోరాట ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛగా బ్రతకగలుగుతున్నాం.

బానిసత్వానికి బ్రిటిష్‌వారే కారకులా? కాదు. అంతకు పూర్వం నుండీ ఉంది. భారతదేశంలో పూర్వం కొన్ని కులాల వారికి, అగ్రకులాల వారిముందు చెప్పులతో నడిచి వెళ్ళే హక్కు కూడా ఉండేది కాదు. మన దేశంలో ఓ ధర్మం వారికి పుట్టుకతోనే ఎక్కువ జాతి లేదా తక్కువ జాతి అనే బేధభావం ఉంది. బానిసత్వం దాదాపు ప్రపంచమంతా ఉండేది. బ్రిటిష్‌వారిని తరమడానికి, మనకి స్వేచ్ఛ రావడానికి 200 సంవత్సరాలకి పైగా పట్టింది. ఆ స్వేచ్ఛ కూడా పోరాటంతోనే సాధ్యమైంది.

**కాని కేవలం 23 సంవత్సరాల లోపునే ఏ పోరాటం చేయకుండా బానిసత్వాన్ని కడతేర్చడానికి ఓ మహనీయుడు పూనుకున్నాడు. ఎన్నో వేల సంవత్సరాల నుండి బలమైన పునాదులతో నున్న 'బానిసత్వ సౌధం', ఈ మహనీయుని కృషి వలన కూలిపోవడం మొదలైంది. పునాదులు కదిలాయి. మానవత్వం వెల్లివిరిసింది.**

అతి తక్కువ సమయంలో **ఈ అద్భుతం జరిగింది**. ఆ అద్భుతం ఎవరు చేశారు? ఎవరు చేయించారు? ఎలా చేశారు?

ఈ విషయాలన్నీ సవివరంగా అందించే ముందు బానిసత్వాన్ని గురించి క్లుప్తంగా పరిచయం చేస్తున్నాం.

ముందుగా చెప్పుకున్నట్లు 'బానిసత్వం' వేల సంవత్సరాలనుండి ఉంది. ఒకొక్క చోట ఒకో విధంగా ఉండవచ్చు. ఫిరౌన్ రాజు కాలంలో యూదులు బానిసలుగా, ఆ రాజు చెప్పినట్లు చేసేవారు. వారిని బానిసత్వం నుండి, అల్లాహ్ కరుణచే, మూసా(అ)వారు విడిపించారు.

వీరందరినీ నాశనం చేయాలని వెంబడించిన ఫిరౌన్ రాజుని, వాడి సైన్యాన్ని 'అల్లాహ్' సముద్రంలో ముంచివేశారు. ఇది అల్లాహ్ యొక్క మహిమ.

అక్కడితో బానిసత్వం పోయిందా? లేదు. ఆఫ్రికా లాంటి పేద దేశాల నుండి మనుషుల్ని బానిసలుగా కొనుక్కోవడం, అమ్మడం, వారిచేత వెట్టి చాకిరీ చేయించడం చేసేవారు. అంటే బానిసత్వం సమసిపోలేదు.

ఈసా(అ) ప్రవక్తగారి కాలంలో కూడా బానిసత్వం ఉంది. ఈయన తరువాత సుమారు 500 సం॥ల తరువాత ముహమ్మద్(స)వారు అరేబియాలో జన్మించారు.

అరబ్బులకు బానిసలుండేవారు. వారసత్వ ఆస్తిగా కూడా కొంతమందికి బానిసలు ఉండేవారు.

బానిసలను అమ్మేవిధానాన్ని చదివేటప్పుడుగాని, ఆ విషయాలు జ్ఞాపకం వచ్చేటప్పుడుగాని, స్వేచ్ఛగా బ్రతికే మనలాంటి వారికి బాధ కలుగుతుంది. ఒక యజమాని తన బానిస ఎంత సమర్థుడో చూపడానికి, ఆ బానిసను కొనేవారి ముందు హింసించి, ఆ హింసకు ఆ బానిస ఎలా తట్టుకోగలిగాడో వారి ముందే చూపించి 'ధర'ను నిర్ణయించేవాడు. పిల్లలను కిడ్నాప్ చేసి వేరే దేశాలలో బానిసలుగా అమ్మేయడం కూడా అప్పట్లో జరుగుతుండేది.

**ఇక ముహమ్మద్(స)వారి కాలం నాటి పరిస్థితులను తెలుసుకుందాం!**

ముహమ్మద్(స)వారు ఎల్లప్పుడూ అనాథలకు, పేదవారికి సాయం చేస్తుండేవారు. బానిసల పరిస్థితి చూసి ఆయన హృదయం ద్రవించేది.

ముహమ్మద్(స)వారికి 40 సంవత్సరాల వయసున్నప్పుడు, ఆ మహనీయునికి అల్లాహ్ తన అంతిమ దైవ సందేశహరులుగా బాధ్యతను అప్పగించారు. మొత్తం అరేబియాలోనే అత్యంత నిజాయితీపరుడు, సహనశీలుడు, అనాథలకు, పేదలకు ఆశ్రయమైన ముహమ్మద్(స)వారి మాటలను విశ్వసించి, అల్లాహ్ యొక్క ధర్మాన్ని కొంతమంది బానిసలు కూడా స్వీకరించారు.

'ఇస్లాం' ధర్మాన్ని ఆ బానిసలు స్వీకరించినందువలన, విగ్రహాలను పూజించే వారి యజమానులు, ఆ బానిసలను ఎలా హింసించేవారో తెలియడానికి కొన్ని ఉదాహరణలు:

హజ్రత్ బిలాల్(రజి) అనే బానిస ఉండేవారు. అతని యజమాని బిలాల్ మెడలో త్రాడు వేసి అల్లరి పిల్లలకు అందించేవాడు. ఆ ఆకతాయి పిల్లలు మక్కా కొండల్లో త్రిప్పేవారు. యజమాని బిలాల్(రజి)ని కట్టేసి

చితకబాదేవాడు. మధ్యాహ్నం మండుటెండల్లో కూర్చోబెట్టడం, ఆహారం, నీరు ఇవ్వకుండా పస్తులుంచడం, మధ్యాహ్నం ఎండ బాగా ఎక్కువగా వున్న సమయంలో, మక్కాలోని రాతిప్రదేశంలో పడుకోబెట్టి ఆయన ఛాతీపై బరువైన బండరాయి ఉంచి, ముహమ్మద్(స)వారిని తిరస్కరించమని లేకపోతే ఇలాగే పడివుండి, ప్రాణం పోగొట్టుకుంటావని చెప్పినా, బిలాల్(రజి) మాత్రం అహద్, అహద్ (ఒక్కడే, ఒక్కడే) అంటూ ఏకైక ఆరాధ్యుడైన 'అల్లాహ్'నే స్మరించేవారు.

ముహమ్మద్(స)వారి ఆదేశం మేరకు, బిలాల్(రజి)ను ఆతని యజమాని నుండి అబూబకర్(రజి)వారు విడిపించి స్వేచ్ఛ నొసంగారు.

కొందరు యజమానులైతే తమ బానిసల్ని తీవ్రంగా కొట్టేవారు. యజమాని అలసిపోతేనే కొట్టడం ఆపేవాడు.

ఎండల్లో పడుకోబెట్టి ఎదపై బరువైన బండరాయి నుంచడం ఎక్కువగా జరుగుతుండేది.

ఒక బానిసను అయితే కణకణలాడే నిప్పురవ్వలపై పడుకోబెట్టి పైకి లేవకుండా బండరాళ్ళను ఉంచేవారు. ఈ చిత్రహింసల వలన ఇస్లాం కోసం మరణించిన తొలి మహిళ సుమయ్యా(రజి). ఈ మహిళామణిని మర్మాంగంలో బరిశతో పొడిచి ఆమె యజమాని అబూజహల్ అనే దుర్మార్గుడు ఆమె మరణానికి కారణమయ్యాడు.

ఈ సంఘటనలకు పూర్వం జరిగిన విషయం. అంటే అప్పటికింకా ఆయనకు దైవప్రవక్త పదవి రాలేదు. ముహమ్మద్(స)వారి దగ్గరికి, ఆయన(స)యొక్క సతీమణి ఖదీజా(రజి)వారు ఒకరోజు ఓ కుర్రవాడిని తీసుకువచ్చారు. ఆమెకు కానుకగా వచ్చిన ఆ కుర్రవానిని, ముహమ్మద్(స) వారి కోరిక మేరకు, బానిసత్వం నుండి స్వేచ్ఛనిచ్చారు. ఆ అబ్బాయి తల్లిదండ్రులకు ముహమ్మద్(స)వారు కబురుపెట్టారు.

కాని ఆ కుర్రవాడు మాత్రం ముహమ్మద్(స)వారిని వదిలివెళ్ళడానికి ఇష్ట పడలేదు. అందరి ముందూ ఆ కుర్రవానిని తన పుత్రునిగా దత్తత చేసుకుంటున్నట్లు ముహమ్మద్(స)వారు ప్రకటించారు. ఆ అబ్బాయి తండ్రి కూడా సంతోషంతో వెనుదిరిగాడు. ఆ విధంగా ఆ అబ్బాయికి బానిసత్వం నుండి స్వేచ్ఛనిప్పించి, తన కుమారుని స్థాయికి ఆ అబ్బాయి స్థాయిని పెంచిన మహోన్నతుడు ముహమ్మద్(స).

"ఖుర్'ఆన్ వెల్లడించిన నైతిక సూత్రాలు బానిసత్వంలోంచే వచ్చాయి" అని జబ్బార్‌గారు అన్నారు.

ఏదైనా ఒక అంశాన్ని మాత్రమే తీసుకొని, దాని ఆధారంగానే నైతిక సూత్రాలను తయారుచేస్తే అవి అన్నీ కూడా ఆ అంశం చుట్టూనే తిరుగుతుంటాయి. మిగతా అంశాలపై చర్చించినా కూడా, వాటి శాతం చాలా తక్కువగా ఉంటుంది.

మరి 6,236 వాక్యాలున్న ఖుర్'ఆన్ గ్రంథంలో ఎన్ని వాక్యాలు బానిసత్వం గురించి చెబుతున్నాయి? బానిసత్వం లోంచే ఈ నైతిక సూత్రాలు వచ్చి ఉంటే, వీటిలో కనీసం 4000 వాక్యాలకు పైగా, బానిసత్వం గురించే చర్చించి ఉండాలి కదా!

**ఖుర్'ఆన్ గ్రంథంలో మానవజీవితానికి సంబంధించిన అన్ని అంశాలూ ఉన్నాయి. 'భార్యభర్తలిరువురూ ఒకరి కొకరు దుస్తులులాంటివారని' దివ్య ఖుర్'ఆన్ చెబుతుంది. వడ్డీ మహాపాపమని చెబుతుంది. అది వ్యాపారం కాదని స్పష్టం చేసింది. ప్రతీకారం తీర్చుకునే హక్కు ఉన్నా సరే, సహనం వహించి క్షమిస్తే అది ఎంతో మేలు అని చెబుతుంది. అనాథల సొమ్ము తినవద్దని, అక్రమ సంపాదన పాపమని చెబుతుంది. ఏవి తినవచ్చో, ఏమి తినకూడదో చెబుతుంది. నిషేధంకాని ఏ పనినైనా, అల్లాహ్ పేరుతో చేస్తే, అది ప్రార్థనగానే పరిగణింపబడుతుందని ఆత్మీయంగా చెబుతుంది.**

**నిత్య జీవితంలోని ప్రతీ సమస్యకూ ఖుర్'ఆన్ పరిష్కారాన్ని చూపెడుతుంది.** ఇంకా ఎన్నో అంశాలున్నాయి. కాని ఆ అంశాలన్నింటిని ఈ వ్యాసంలో చర్చించడానికి  వీలుపడదు.

**ఇవన్నీ బానిసత్వంలోంచే పుట్టుకొచ్చినవేనా?**

దీనినిబట్టి స్పష్టంగా తెలిసిందేమిటంటే, ఇ.ఏ. జబ్బార్ ఖుర్'ఆన్‌ను చదవలేదు. 5వ తరగతి ఇంగ్లీష్ మీడియంలో చదివిన కుర్రాడు, ఇంగ్లీష్‌లో వ్రాసివున్న ఎం.బి.బి.యస్. పుస్తకాలను చదవగలడు. కాని ఆ అబ్బాయికి అవి అర్థం కావు. ఆ అబ్బాయి జ్ఞానం కూడా అందుకు సరిపోదు. కాని ఆ అబ్బాయి ఆ విషయాన్ని ఒప్పుకోకుండా, "మెడిసిన్ పుస్తకాలు నన్ను వైద్యానికి వ్యతిరేకున్ని" చేశాయి, అవి శుద్ధ వేస్ట్ అని అన్నాడనుకోండి. అప్పుడు మనకు ఇ.ఏ. జబ్బార్ గుర్తుకొస్తాడు. ఆ కుర్రాడికి, ఈ జబ్బార్‌కి పెద్దగా తేడా ఏమీ లేదు.

**కాబట్టి ఇస్లాం నైతిక సూత్రాలు బానిసత్వం లోనుండి రాలేదుగాని నాస్తికులు మాత్రం అజ్ఞానంలో నుండే వచ్చారు.**

**దివ్య ఖుర్'ఆన్‌లో బానిసత్వానికి సంబంధించిన పదాలున్న వాక్యాలు:**

1. వినయ విధేయత (ధర్మనిష్ఠాపరత్వం) అంటే మీరు మీ ముఖాలను తూర్పు దిక్కునకో, లేక పడమర దిక్కునకో చేయడం కాదు, కాని వినయ విధేయత అంటే, అల్లాహ్‌ను, అంతిమదినాన్ని, దైవదూతలను, ప్రతి దివ్య గ్రంథాన్ని మరియు ప్రవక్తలను హృదయపూర్వకంగా విశ్వసించడం మరియు ధనంపై ప్రేమ కలిగివుండి కూడా, దానిని బంధువుల కొరకు, అనాథల కొరకు, యాచించని పేదల కొరకు, బాటసారుల కొరకు, యాచకుల కొరకు మరియు **బానిసలను విడిపించడానికి వ్యయపరచడం** మరియు నమాజ్‌ను స్థాపించడం, జకాత్ ఇవ్వడం మరియు వాగ్దానం చేసినప్పుడు తమ వాగ్దానాన్ని పూర్తిచేయడం. మరియు దురవస్థలో మరియు ఆపత్కాలాలలో మరియు యుద్ధ సమయాలలో స్థైర్యం కలిగి ఉండటం, ఇలాంటి వారే సత్యవంతులు మరియు ఇలాంటివారే దైవభీతి గలవారు

**(దివ్య ఖుర్'ఆన్ 2:177)**

2. మరియు మీలో ఎవరికైనా స్వతంత్రులైన ముస్లిం స్త్రీలను, వివాహం చేసుకునే స్థోమత లేకుంటే, అప్పుడు మీ స్వాధీనంలో ఉన్న ముస్లిములైనటు వంటి **బానిస స్త్రీలను వివాహమాడవచ్చు**. మరియు అల్లాహ్‌కు మీ విశ్వాసం గురించి తెలుసు. మీరంతా ఒకే ఒక వర్గానికి చెందిన వారు (ఒకరికొకరు సంబంధించినవారు), అందువల్ల వారి

సంరక్షకుల అనుమతితో వారితో వివాహం చేసుకుని, ధర్మ ప్రకారంగా వారి స్త్రీశుల్కం (మహ్ర్) ఇవ్వండి. ఇది వారిని వివాహబంధంలో సురక్షితంగా ఉంచడానికి, స్వేచ్ఛా కామక్రీడలకు దిగకుండా ఉంచటానికి మరియు దొంగచాటు సంబంధాలు ఏర్పరచుకోకుండా ఉంచడానికి (ఆదేశించబడింది). వారు (ఆ బానిస స్త్రీలు) వివాహబంధంలో రక్షణ పొందిన తరువాత కూడా వ్యభిచారానికి పాల్పడితే, స్వతంత్రులైన స్త్రీలకు విధించే శిక్షలోని సగం శిక్ష వారికి విధించండి. ఇది మీలో పాపభీతి గలవారికి వర్తిస్తుంది. ఒకవేళ మీరు నిగ్రహం పాటిస్తే అది మీకే మంచిది. మరియు అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణా ప్రదాత.

**(దివ్య ఖుర్'ఆన్ 4:25)**

3. మరియు మీరు అల్లాహ్‌నే ఆరాధించండి మరియు ఎవ్వరినీ ఆయనకు భాగస్వాములుగా సాటి కల్పించకండి. మరియు **తల్లిదండ్రులతో, దగ్గరి బంధువులతో, అనాథలతో, నిరుపేదలతో, బంధువులైన పొరుగువారితో, అపరిచితులైన పొరుగువారితో,** ప్రక్కనున్న **మిత్రులతో, బాటసారులతో మరియు మీ ఆధీనంలో ఉన్న బానిసలతో అందరితోనూ ఉదార స్వభావంతో వ్యవహరించండి.** నిశ్చయంగా, అల్లాహ్ గర్వం కలవాడిని, బడాయిలు చెప్పుకునే వాణ్ణి ప్రేమించడు. **(దివ్య ఖుర్'ఆన్ 4:36)**

4. ..... పొరపాటుగా తప్ప - ఒక విశ్వాసి - మరొక విశ్వాసిని చంపడం తగనిపని. మరియు ఒక విశ్వాసిని పొరపాటుగా చంపినవాడు (దానికి పరిహారంగా) అతడు ఒక ముస్లిం **బానిసకు విముక్తి కలిగించాలి** మరియు హతుని వారసులకు రక్త పరిహారం కూడా చెల్లించాలి. వారు క్షమిస్తే అది వారికి దానం అవుతుంది.
   కాని ఒకవేళ వధింపబడినవాడు విశ్వాసి అయి, మీ శతృవులలో చేరిన వారై ఉంటే, ఒక ముస్లిం బానిసకు విముక్తి కలిగించాలి. ఒకవేళ (వధింపబడినవాడు) - మీరు ఒడంబడిక చేసుకొనివున్న జనులకు చెందిన వారైతే - రక్త పరిహారం అతని వారసులకు ఇవ్వాలి. మరియు ఒక ముస్లిం బానిసకు విముక్తి కలిగించాలి.
   **(బానిసకు విముక్తి కలిగించే) శక్తి లేనివాడు**, వరుసగా రెండు నెలలు ఉపవాసాలుండాలి. అల్లాహ్ ముందు పశ్చాత్తాపబడటానికి (ఇదే సరైన పద్ధతి). అల్లాహ్ సర్వజ్ఞుడు, మహా వివేచనాపరుడు.

**(దివ్య ఖుర్'ఆన్ 4:92)**

5. మీరు చేసే అర్థంలేని ప్రమాణాలను గురించి అల్లాహ్ మిమ్మల్ని పట్టుకోడు. కాని మీరు బుద్ధిపూర్వకంగా చేసే ప్రమాణాలను గురించి ఆయన మిమ్మల్ని పట్టుకుంటాడు. కావున దానికి పరిహారంగా మీరు ఇంటివారికి పెట్టే, మామూలు ఆహారం పదిమంది పేదలకు పెట్టాలి. లేదా వారికి వస్త్రాలు ఇవ్వాలి. లేదా **ఒక బానిసకు స్వాతంత్ర్యం ఇప్పించాలి.** ఎవరికి ఈ శక్తి లేదో అతడు మూడు దినాలు ఉపవాసం ఉండాలి.
   మీరు ప్రమాణం చేసి భంగపరిస్తే, ఇది దానికి పరిహారం. మీ ప్రమాణాలను కాపాడుకోండి. మీరు కృతజ్ఞులై ఉండటానికి అల్లాహ్ తన ఆజ్ఞలను ఈ విధంగా మీకు విశదపరుస్తున్నాడు.

**(దివ్య ఖుర్'ఆన్ 5:89)**

6. ఎవరికైతే, పెండ్లి చేసుకొనే శక్తిలేదో వారు, అల్లాహ్ తన అనుగ్రహంతో వారిని ధనవంతులుగా చేసేవరకు శీలశుద్ధతను పాటించాలి. మరియు **మీ బానిసలలో ఎవరైనా స్వేచ్ఛాపత్రం వ్రాయించుకో గోరితే, వారి యందు మీకు మంచితనం కనబడితే, వారికి స్వేచ్ఛాపత్రం వ్రాసి ఇవ్వండి.** అల్లాహ్ మీకు ఇచ్చిన ధనం నుండి వారికి కూడా కొంత ఇవ్వండి.
   మీరు ఇహలోక ప్రయోజనాల నిమిత్తం, మీ బానిస స్త్రీలు శీలవతులుగా ఉండగోరితే, వారిని వ్యభిచారానికి బలవంతపెట్టకండి.
   ఎవరైనా వారిని బలవంతపెడితే, నిశ్చయంగా అల్లాహ్ వారిని (ఆ బానిస స్త్రీలను) బలాత్కారం తరువాత క్షమించేవాడు, అపార కరుణా ప్రదాత.

**(దివ్య ఖుర్'ఆన్ 24:33)**

ఇస్లాంకు పూర్వం, ప్రజలు తమ బానిస స్త్రీలతో వ్యభిచారం చేయించి ఆ సొమ్ము తినేవారు. ఇది ఇస్లాంలో నిషేధించబడింది.

7. నిశ్చయంగా, (జకాత్) దానాలు కేవలం యాచించు నిరుపేదలకు మరియు యాచించని పేదవారికి, (జకాత్) వ్యవహారాలపై నియుక్తులైన వారికి మరియు ఎవరి హృదయాలైతే (ఇస్లాం వైపుకు) ఆకర్షించవలసి ఉందో వారికి, **బానిసల విముక్తి కొరకు**, ఋణగ్రస్తులైన వారి కొరకు, అల్లాహ్ మార్గంలో (పనిచేసే వారి)కొరకు మరియు బాటసారుల కొరకు. ఇది అల్లాహ్ నిర్ణయించిన ఒక విధి. మరియు అల్లాహ్ సర్వజ్ఞుడు, మహా వివేకవంతుడు. **(దివ్య ఖుర్'ఆన్ 9:60)**

8. మరియు ఎవరైతే తమ భార్యలను జిహార్ ద్వారా దూరంచేసి తరువాత తమ మాటను వారు ఉపసంహరించుకోదలిస్తే! వారిద్దరూ ఒకరినొకరు తాకకుముందు, **ఒక బానిసను విడుదల చేయించాలి**. ఈ విధంగా మీకు ఉపదేశ మివ్వబడుతోంది మరియు మీరు చేస్తున్నదంతా అల్లాహ్ ఎరుగును. **(దివ్య ఖుర్'ఆన్ 58:3)**

9. అది ఒక మెడను **(బానిసత్వం నుండి) విడిపించడం**
   **(దివ్య ఖుర్'ఆన్ 90:13)**

పైన ఉదాహరణగా ఇచ్చిన 9 వాక్యాలను చదివాక, మీకు ఇవన్నీ బానిసత్వం నుండే పుట్టుకొచ్చినట్లు అనిపిస్తున్నాయా?

సమాజంలో ఉన్న బానిసత్వాన్ని తనకు అనుకూలంగా మలచుకుని, వారిని తన స్వార్థంకోసం ఉపయోగించుకోవాలని, ముహమ్మద్(స)వారు భావించారని జబ్బార్ వంటి నాస్తికుడు నిరాధారమైన అపనిందలను వేశారు.

పై వాక్యాలలో స్పష్టంగా తెలిసిందేమిటంటే, ఏదైన ప్రమాణ భంగం చేస్తే, ఒక బానిసను విడిపించడాన్ని ఒక పరిష్కారంగా చెప్పారు. ఒకవేళ తెలియక పొరపాటు చేస్తే, దానికి పరిష్కారం కూడా ఒక బానిసను విడిపించడం. దానంతో చేయవలసిన ఎన్నో గొప్ప విషయాలతో బాటు, బానిసను విముక్తిని చేయడాన్ని కూడా ఓ విషయంగా చెప్పారంటే, బానిస నిర్మూలనకు ఇస్లాం ధర్మం ఎంత ప్రాముఖ్యత నిచ్చిందో అర్థమవుతుంది.

ముందరి పేజిలలో ఇంటర్‌నెట్ వివరాలను అందించాము. అందులో ముహమ్మద్(స)వారు, వారి సతీమణులు, అనుచరులు మొ॥న వారు వేల సంఖ్యలో బానిసలకు స్వేచ్ఛ నిచ్చారని చదివారు కదా!

అంతేకాకుండా వారితో ఉదారంగా వ్యవహరించమన్నారు. యజమానులను వారు ఏమి తింటారో, అటువంటిదే వారి బానిసలకు కూడా పెట్టమని చెప్పారు. బానిస స్త్రీలను వారి శీలాన్ని రక్షించుకోవడానికి, స్వేచ్ఛా సెక్స్ కార్యకలాపాలకు దూరంగా ఉంచడానికి, వారిని వివాహబంధంలోకి తీసుకోమని ప్రోత్సహించారు.

**ఒక అగ్రకులానికి చెందిన వాడు, తక్కువ కులానికి చెందిన స్త్రీని వివాహం చేసుకోవడానికి ఈ రోజుల్లో సాధారణ పరిస్థితులలో ససేమిరా ఒప్పుకోడు. ఒకవేళ ఒకే కులానికి చెందిన వారైనా సరే, డబ్బు, అందం ఉంటేనే వివాహానికి ఇష్టపడుతున్నారు.**

అలాంటిది డబ్బు లేకుండా, కనీసం స్వేచ్ఛకూడా లేని బానిస స్త్రీని, వివాహమాడటానికి ఎవరైనా ముందుకొస్తారా?

ముందుకొచ్చారు. ఇస్లాం ధర్మాన్ని పాటించేవారు మనస్ఫూర్తిగా ముందుకొచ్చారు. బైజాన్‌టియన్ రాజు కానుకగా ఇచ్చిన 'మారియా' అనే బానిస స్త్రీకి, ముహమ్మద్(స)వారు స్వేచ్ఛనిచ్చి, ఆమెను వివాహం చేసుకుని, మారియా(రజి) వారిని విశ్వాసుల మాతృమూర్తిగా, అంటే యావత్తు ముస్లిములందరికీ తల్లి సమానురాలుగా చేశారంటే, ముహమ్మద్(స)వారు బానిసత్వ నిర్మూలనకై ఏం కృషి చేశారో అర్థమవుతుంది. ఆయన(స) యొక్క అనుచరులు కూడా అదే బాటన నడిచారు.

క్రింది ఖుర్ఆన్ వాక్యాన్ని చూడండి :

**"మరియు ముష్రిక్ స్త్రీలు, విశ్వసించనంత వరకు, మీరు వారిని వివాహమాడకండి. ముష్రిక్ స్త్రీ మీకు ఎంత నచ్చినా, ఆమె కంటే విశ్వాసురాలైన ఒక బానిస స్త్రీ ఎంతో మేలైనది"**

(దివ్య ఖుర్ఆన్ 2:221)

పై వాక్యంలో ముష్రిక్ (బహుదైవారాధన చేసే, విగ్రహాలను పూజించే) స్త్రీ మీకు ఎంత నచ్చినా అంటే, దాని అర్థం - ఆమె అందంగా ఐశ్వర్యవంతురాలు అయిఉండాలి లేదా కనీసం అందంగానైనా ఉండి ఉండాలి. అలాంటి స్త్రీ కంటే, అల్లాహ్‌ని విశ్వసించిన బానిస స్త్రీయే ఎంతో మేలైనది అంటే, ఇక్కడ ధర్మపరాయణత యొక్క గొప్పతనాన్ని తెలియజేస్తూనే, ఒక ఉన్నత స్థాయి స్త్రీతో, బానిస స్త్రీని పోల్చడం, బేధబావాలకు దూరంగా, మానవత్వాన్ని పెంపొందిస్తుంది.

ఏ మనిషికైనా బానిసత్వాన్ని మించిన ఘోరమైన దుస్థితి మరొకటి ఉండదు. అనాదిగా సమాజంలో అల్లుకు పోయిన వేల సంవత్సరాల 'బానిసత్వాన్ని' కూకటి వ్రేళ్ళతో పెకిలించాలంటే, ఆ పరిష్కార మార్గం ఎంత గొప్పగా ఉండాలి!

మనుషుల మనస్సులలో పరివర్తన తీసుకురావాలి. ఆ పరివర్తనను అతి తక్కువకాలంలో తీసుకురావడానికి మహనీయ ముహమ్మద్(స) వారు ఏమి చేశారు? అంతేకాకుండా, విముక్తులైన బానిసల స్థాయిని పెంచి, ఒకొక్కసారి మిగిలినవారికంటే వారికే కొన్ని విషయాలలో ఆధిక్యత నిచ్చారంటే, **అంతవరకూ ఎవరూ చేయలేని పనిని, ఆయన(స) మాత్రమే సాధించగలిగారంటే, ముహమ్మద్(స) వారు ఏదో అద్భుతాన్ని చేసివుండాలి కదా!**

ఆ అద్భుతమేమిటో తెలుసుకోవాలంటే, ఆయన బోధనలగురించి, ఆచరణల గురించి కొంచెమైనా ఇక్కడ వివరించవలసి ఉంది.

"ఎవరైనా ఓ ముస్లిమ్ బానిసకు స్వేచ్ఛను కలిగిస్తే, ఎలా అతడు (స్వేచ్ఛను కలిగించినవాడు) బానిసయొక్క శరీర భాగాలకు విముక్తి కలిగించాడో, అల్లాహ్ అతని శరీర అవయవాలన్నింటిని (నరక)అగ్ని నుండి కాపాడుతారు" అని ముహమ్మద్(స) వారు బోధించారు.1

మరో ఉల్లేఖనంలో ఇలా ఉంది: "ముస్లిం పురుషుడు ఇద్దరు బానిస స్త్రీలకు విముక్తి కలిగిస్తే, వారిద్దరూ ఆ పురుషుడు నరకం నుంచి విముక్తి పొందడానికి కారకులవుతారు"2

"ఒక ముస్లిమ్ స్త్రీ, ఒక ముస్లిం బానిస స్త్రీకి స్వేచ్ఛను కలిగించినట్లయితే ఆ బానిస స్త్రీ ఆమెకు నరకం నుంచి విముక్తి పొందటంలో దోహదపడుతుంది."2

పై బోధనల గొప్పతనాన్ని పూర్తి స్థాయిలో అర్థం చేసుకోవాలంటే ఇస్లాం యొక్క మౌలిక విషయాలను ఒకసారి జ్ఞాపకం చేసుకోవాలి.

భూమి మీద ఈ జీవితం ఒక పరీక్ష. ఈ పరీక్షను మంచి పనుల ద్వారా ఎదుర్కొని, విజయం సాధిస్తే శాశ్వత నివాసస్థానమైన స్వర్గం లభిస్తుంది.

ఈ స్వర్గాన్ని తమ శాశ్వత నివాసంగా చేసుకోవడానికి, నరకాగ్ని నుండి తప్పించుకోవడానికి, దానాలు చేస్తారు, భార్యతో, పిల్లలతో, తోటివారితో సౌమ్యంగా బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తారు, సహనంతో నిజాయితీగా బ్రతుకుతారు, కష్టాలను లెక్కచేయరు, మానవత్వంతో ప్రతీ హృదయాన్ని జయించడానికి ధర్మంగా బ్రతుకుతారు. వడ్డీ తినరు, మద్యం త్రాగరు, వ్యభిచరించరు, అబద్ధాలు ఆడరు, అహంకారానికి అందనంత దూరంగా, పేదవారితో ప్రేమగా ఉంటారు.

ఈ విధంగా ఈ స్వర్గం కోసం మరియు నరకాగ్ని నుండి తప్పించుకోవడానికి, ఎలాంటి త్యాగాన్నయినా చేయడానికి సిద్ధపడేవారికి, ఒక బానిసకు స్వేచ్ఛ కలిగేలా చేస్తే నరకాగ్ని నుండి దూరం కావచ్చు అని చెబితే, వారు ఆ అవకాశాన్ని వదులుకుంటారా?

అంటే ఇక్కడ బానిసని విముక్తికై చేసేపని, ఎన్నో గొప్పకార్యాలకు సమానమైంది. ముహమ్మద్(స)వారి యొక్క ఒక అనుచరుడు (సహాబీ)కు ఈ బోధన గురించి తెలియగానే, తన బానిసకు వెంటనే స్వేచ్ఛను ప్రకటించారు. అదే బానిసను ఎక్కువ మొత్తంలో కొనడానికి మరొకతను అప్పటికే సిద్ధంగా ఉన్నాడు. కాని ఆ సహాబా తన బానిసకు స్వేచ్ఛనిచ్చేసారు.3

**ఇప్పుడు చెప్పండి! ఈ బానిసత్వ విముక్తి కొరకు కృషి చేయడంలో, ఏదైనా ఇహలోక స్వార్థం దాగిఉందా? ఈ విషయంలో ముహమ్మద్(స) వారిని ఎవరైనా తప్పుపట్టగలరా?**

అజ్ఞానులు అర్థం చేసుకోకుండా వారికి ఎలా తోస్తే అలా వ్రాస్తారు. ముహమ్మద్(స) గురించి దుర్మార్గులు నీచంగా చిత్రీకరిస్తారు.

బానిసలకు స్వేచ్ఛ లభించేలా చేయడమే కాదు, వారికి మరెన్నో ఉపకారాలు చేశారు. **(ఇన్షా అల్లాహ్! వాటిని వివరంగా వచ్చే సంచికలో అందిస్తాము)**

1. సహీహ్ బుఖారీ, నెం. 3795, 5వ అధ్యాయం, సంపుటి 3, 49వ పుస్తకం, ఉల్లేఖకుడు : అబూహురైరా(రజి)
2. హదీస్ మకరందం, 2వ భాగం, నెం. 1220, పేజీ 429, అల్-హాఫ్ పబ్లికేషన్స్
3. సహీహ్ ముస్లిమ్, నెం. 3798, 5వ అధ్యాయం, 20వ పుస్తకం

# నాస్తికుని ? ప్రశ్న

కొంత మందికి కొన్ని సమస్యలు ఎదురౌతాయి. వాటి పరిష్కారం తెలియదు. కొందరికి కొన్ని ప్రశ్నలుదయిస్తాయి. కాని వాటికి జవాబు స్ఫురించదు. అన్వేషించ గలిగే ఓపిక వారి కుండదు. వారి సందేహాలను ఎవరి ముందో ఉంచుతారు. వారు సరియైన విధంగా జవాబు చెప్పలేక పోవచ్చు. అలాంటి సందర్భాలే కొంతమందిని నాస్తికులుగా మారుస్తాయి. వీరు కాకుండా మరో వర్గముంది. వారికి ఇష్టానుసారంగా బ్రతకాలని ఉంటుంది. ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర రెడ్ లైట్ వెలిగినా, దూసుకు పోవాలని, పరీక్షలకు ప్రిపేరవకుండా, ఏమీ వ్రాయకపోయినా మంచి మార్కులు పొందాలని, వారికి నచ్చిందే చేయాలని, కావాలన్నది దొరకాలని, ధర్మమైనా, అధర్మమైనా, నీతి అయినా అవినీతి అయినా వారి కనవసరం. వారిని వారించి ఎవరైనా కంట్రోల్ చేయబోతే, వారు సహించలేరు. అలాంటి వారు కూడా ఈ నాస్తికత్వం వైపు మొగ్గు చూపుతారు. చేతులు కాలాక, ఆకులు పట్టుకున్నట్లు, ఎప్పుడో వీరికి జ్ఞానోదయం అవుతుంది, కాని అప్పటికే వారి జీవితానికి అస్తమయం దగ్గరవుతుంది. ఓ నాస్తిక సోదరుడు వేసిన ఒక ప్రశ్నకు జవాబు చెప్పడంతో ఈ శీర్షికను క్రిందటి సంచికలో ప్రారంభించాము. ఆ నాస్తిక సోదరుని మరో ప్రశ్నను ఈ సంచికలో అందిస్తున్నాము.

మీకు నాస్తిక సోదరులు ఎదురైతే, వారి చేత తప్పనిసరిగా ఈ వ్యాసం చదివించండి. వారిని సంస్కరించడానికి ప్రయత్నిద్దాం. ప్రపంచ మానవులందరూ ఒకే జంట నుండి ఉద్భవించారు కాబట్టి, వారు కూడా మన బంధువులే!

**ప్రశ్న** **పూర్వపు రోజులలో ఎక్కువ యుద్ధాలు 'ఆహారం' కోసమే జరిగాయి. భూమి మీద కొన్ని చోట్ల ఎందుకు ఆహారం దొరకదు. ఇస్లాం ధర్మాన్ని అనుసరించే వారిలో పేదరికం ఎందుకుంది?**

**జవాబు** క్రిందటి సంచికలో, ప్రపంచంలో అవసరానికి మించి ఆహారం ఉత్పత్తి అవుతుందని, కాని స్వార్ధపరులు మరియు దయాగుణంలేని కొందరి వలననే ఈ ఆహారం అందరికీ అందకుండా పోతుందని, గణాంకాలతో సహా వివరించడం జరిగింది. ఆ ఆహారాన్ని సద్వినియోగం ఎలా చేయాలో చెప్పడానికి సకలలోకాలను సృష్టించిన అల్లాహ్, తన ప్రవక్తలను భూమి మీదకు పంపిన విషయాన్ని స్పష్టంగా ఉదాహరణా పూర్వకంగా వివరించాము.

ఈ రెండవ సంచికలో పై ప్రశ్నను ఎన్నుకోవడానికి గల కారణమేమిటంటే, ఈ ప్రశ్న, గత ప్రశ్నకు భావంలో చాలా దగ్గరగా ఉంది కాబట్టి.

భూమి మీద అన్ని చోట్ల అన్నీ దొరకవు. పెట్రోలియం కొన్ని ప్రదేశాలలోనే దొరుకుతుంది. బంగారు గనులు ప్రతీ చోటా ఉండవు. అలాగే వజ్రపు గనులు ప్రతీచోటా ఉండవు. ఒకచోట ఉన్నది మరోచోట లేనప్పుడే, ఆ రెండు ప్రాంతాల మధ్య వ్యాపార సంబంధాలు ఏర్పడతాయి.

కాని అన్ని చోట్లా ఉండవలసింది ముఖ్యంగా గాలి మరియు నీరు. వాటి తరువాత ఆహారం. ఆహారం గురించి పైన చెప్పుకున్నాం.

**పై ప్రశ్నలోని ముఖ్యమైన భాగం మరియు ఈ సంచికలో చర్చించబోయే ముఖ్యమైన అంశం 'పేదరికం'.**

ప్రపంచంలోని అన్ని చోట్లా పేదవాళ్ళున్నారు, ధనవంతులూ ఉన్నారు. పేదవాడికి 'పేదరికం' ఒక శాపమని, ధనవంతునికి అతని 'కలిమి' ఒక వరమని అనుకోవడం సర్వసాధారణం.

అందరూ అలా అనుకోరు. పేదరికాన్ని వరంగా భావించిన వారు కూడా ఉన్నారు. అదే సమయంలో భాగ్యవంతులు కూడా తమ 'ఐశ్వర్యాన్ని' శాపంగా భావించిన సందర్భాలూ ఉన్నాయి. డబ్బున్న వానికి ఎన్నో టెన్షన్‌లు. డబ్బును ఎవరైనా దొంగిలిస్తారేమోనని, లేదా డబ్బు కోసం తమ బంధువులేమైనా చేస్తారేమోనని, నిజంగా తనను ప్రేమించే బంధువులను సయితం నమ్మక పోవచ్చు. తన డబ్బును చూసే వారు ప్రేమిస్తున్నారనుకోవచ్చు.

ఇంట్లో ఏ.సి. ఉంటుంది. కారులో ఏ.సి. ఉంటుంది. ఆఫీసులో కూడా ఏ.సి. ఉంటుంది. కాని టెన్షన్‌తో చెమటలు పట్టే రోజులే ఎక్కువగా ఉండవచ్చు.

ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, ఓ డాక్టర్, ఓ బిసినెస్ మేన్ జీవితాలను తీసుకుంటే, వీరి జీవితాలలో సంతోషంగా, సరదాగా కుటుంబంతో ఫ్రీగా గడపగలిగే రోజులెన్ని? గడపాలని ఉన్నా సమయం కేటాయించలేని దుర్భర పరిస్థితి.

పేదవానికి ఓ రోజు సంపాదన బావుంటే, సుష్టుగా భోంచేస్తాడు. హాయిగా విశ్రాంతి తీసుకుంటాడు. లేనప్పుడు పస్తులుంటాడు.

ప్రతీదాంట్లోనూ బొమ్మా బొరుసూ రెండూ ఉంటాయని చెప్పడమే మా ఉద్దేశ్యం. ఒక నాణానికి ఒకవైపు చూసి, మరో నాణానికి మాత్రం రెండవవైపు చూసినంత సేపూ మన ఆలోచన ఆ ప్రకారంగానే ఉంటుంది.

ఒకచోట **'పేదరికం'**, మరోచోట **'ఐశ్వర్యం'** ఎందుకున్నాయి?

దైవం అన్నిచోట్లా ఒకేలా ఏర్పాటు చేయవచ్చు కదా! అని సందేహం వెలిబుచ్చుతున్నారు. పైన చెప్పిన విషయాలు చదివారు కదా!

సరే, మరో కోణంలో ఆలోచిద్దాం! సమాజంలో కొంతమంది త్రాగుబోతు లున్నారు. సమాజంలో అందరూ త్రాగేలా చేయవచ్చు కదా! అని ఓ త్రాగుబోతు అనుకోవచ్చు. కాని త్రాగిన వాడి ఆరోగ్యం చెడిపోతుంది. త్రాగని వాని ఆరోగ్యం ఆ విషయంలో బాగానే ఉంటుంది.

ఇది చాలా అన్యాయం! దైవం ఇద్దరిని ఆరోగ్యంగా ఉండేలా సృష్టించాలి గాని ఒకరిని ఆరోగ్యంగానూ, మరొకరిని అనారోగ్యంగానా?

'మద్యం' విషయంలో ఖుర్'ఆన్ ఎటువంటి అనుమానాలకు తావు లేకుండా త్రాగుడిని నిషేధించింది. 'ఇస్లాం' ధర్మాన్ని పాటించే ఏ ముస్లిమ్ కూడా త్రాగలేడు. త్రాగుడు ముస్లిమ్‌కి నిషేధం. 'అల్లాహ్' నిషేధించాడు. అంతే!

మరి అల్లాహ్ చెప్పినట్లు త్రాగుడు అనేది మానుకుంటే, త్రాగుడు ద్వారా కలిగే అనారోగ్యం లేనట్లే కదా! వ్యభిచారాన్ని పాపంగా చెబుతూ ఖుర్'ఆన్ నిషేధించింది. మరి ఈ విషయంలో కూడా అల్లాహ్ చెప్పినట్లు పాటించి ఈ వ్యభిచారానికి పాల్పడకపోతే ఎయిడ్స్ వంటి రోగాలు రావు కదా!

### రాత్రి-పగలు సమస్య:

రాత్రి అయితే సమస్య. ఏమీ కనిపించదు. పగలు పనిచేసుకున్నట్లు రాత్రుళ్ళు చేయలేం. ఇది తొలి మానవునికి ప్రారంభంలోని సమస్య అయివుంటుంది.

చిన్న దీపమో, మంటనో రాజేస్తే, పగలు ఉన్నంత కాకపోయినా కొంత వరకూ ఫర్వాలేదు. ట్యూబ్‌లైట్ వెలిగితే చాలా బావుంటుంది. మరి ఫ్లడ్ లైట్లయితే, ఇంకా వెలుగు. రాత్రి సమస్య చాలా వరకూ తగ్గించుకుని బ్రతక గలుగుతున్నాం.

ఇలాంటి సాధనాలను తయారుచేసుకునే జ్ఞానాన్ని 'అల్లాహ్'యే ఇచ్చాడు. మరి సృష్టి ప్రారంభంలోనే ట్యూబ్‌లైట్లను, ఫ్లడ్‌లైట్లను ఆయన ఎందుకు ఏర్పాటు చేయలేదు? సమస్య తీవ్రతను బట్టే, పరిష్కారం కూడా!

వెలుగు కోసం పగలు ఎలా అవసరమో, అలాగే రాత్రికూడా ఎన్నో జీవరాశు లకి అవసరం. ఒకరికి ఒక విషయం సమస్య కావచ్చు. కాని ఇంకొకరికి అదే ఆధారం కావచ్చు.

### పేదరికం ఓ సమస్య ?

పై విధంగానే ఈ సమస్యను కూడా దూరం చేయడానికి **'అల్లాహ్' ఖుర్'ఆన్ గ్రంథం ద్వారా సర్వమానవాళికి** ఇలా తెలియజేశారు.

1. యాచకులకు దానం చేయండి 2. పేదలకు దానం చేయండి.
3. (స్వాభిమానంతో) అడగని పేదలకు దానం చేయండి.
4. అనాధలకు దానం చేయండి మొ॥వి.

కుడిచేత్తో చేసే దానం, ఎడమచేతికి తెలియనంత రహస్యంగా చేసేవారున్నారు. అంటే వారు లోకం మెప్పు కోసం కాకుండా అల్లాహ్ యొక్క మెప్పుకోసం చేస్తారు. మంచి సంకల్పంతో బహిరంగంగానూ చేయవచ్చు.

అయితే ఈ దానాలను ఖచ్చితంగా చేయాలి అని తాకీదు చేయలేదు. అలా చేస్తే వచ్చే ఎన్నో లాభాలను తెలియజేశారు.

మరి మన సృష్టికర్త చెప్పినట్లు చేస్తే **'పేదరికం' ఉంటుందా?**

**ఆలోచించండి!**

### మరో ముఖ్య విషయం :

సాధారణంగా ప్రతీ సంవత్సరం **'జకాత్'** అనే దానాన్ని ధనవంతులు ఇవ్వాలి. ఇది మాత్రం తప్పనిసరి దానం. ఈ దానమిస్తే ఇచ్చేవాని సంపాదనలో వృద్ధి కూడా కలుగుతుంది అని అల్లాహ్ సెలవిచ్చారు. తన నికర ఆస్తిలోని 40వ వంతు భాగాన్ని జకాత్‌గా చెల్లించాలి.

అంటే 40 లక్షల నికర ఆస్తి వున్నవాడు, ఒక లక్ష దానం చేయాలి. ఈ విధంగా దానం చేయడం డబ్బున్న ప్రతీ ముస్లిమ్ తప్పనిసరిగా చేయాలి.

### తెలుసుకోవలసిన నిజాలు :

**ప్రపంచంలో 225 మంది అత్యంత ధనవంతుల దగ్గర ఒక ట్రిలియన్ డాలర్ల డబ్బుంది. ఒక ట్రిలియన్ డాలర్లు అంటే, 1000,000,000,000 డాలర్లు.**

మన ఇండియా కరెన్సీ ప్రకారం అయితే సుమారు 50,000,000,000,000 రూపాయలు. అంటే సుమారు 50 లక్షల కోట్ల రూపాయలు.

ప్రపంచంలోని ఈ 225 అత్యంత ధనవంతులు **'జకాత్' అనే విధి దానాన్ని** చేస్తే, అంటే 50 లక్షల కోట్ల రూపాయలలో 40వ భాగం, అంటే **1.25 లక్షల కోట్ల రూపాయలు** అవుతుంది.

ఉదాహరణకు మన రాష్ట్రంలో ఓ చిన్ని కుటుంబం (అంటే భార్య, భర్త, ఇద్దరు పిల్లలు) పెద్దగా సౌకర్యాలు లేని చిన్న ఇంటిలో తిండికి లోటులేకుండా జీవించాలంటే, ఇటువంటి కుటుంబానికి నెలకి **రూ. 4,000/-** అవసరం అనుకుందాం. అంటే సంవత్సరానికి ఆ కుటుంబానికి 48 వేల రూపాయలు అవసరం. పోనీ 50 వేల రూపాయలు అవసరం అనుకుందాం.

పైన చెప్పిన ఆ 1.25 లక్షల కోట్ల రూపాయలను మన రాష్ట్రానికే దానంగా ఇస్తే, రెండున్నర కోట్ల కుటుంబాలు అంటే, పెద్దలు 5 కోట్లమందికి, పిల్లలు 5 కోట్లమందికి ఒక సంవత్సరం పాటు 50 వేల రూ॥ల చొప్పున అందుతుంది. తిండికి మరియు ఉండటానికి వారికి లోటు ఉండదు.

అంటే 'ఖుర్ఆన్' ఆదేశం ప్రకారంగా జీవిస్తే, 225 మంది అత్యంత ధనవంతులు చేసే దానం 10 కోట్లమందిని లోటు లేకుండా జీవించేలా చేస్తుంది. ఈ దానాన్ని అందుకోవడమే కాకుండా ప్రతీరోజూ అదనంగా కూలిపని కూడా వారు చేస్తే, ఈ రెండున్నర కోట్ల కుటుంబాల వారు, మరికొన్ని కుటుంబాలకు దానం చేసే పరిస్థితి వస్తుంది.

కేవలం 225 మంది అత్యంత ధనవంతులు దానం చేస్తేనే, ఆంధ్ర రాష్ట్రం లాంటి రాష్ట్రం పేదరికంలేని రాష్ట్రంగా మారిపోతే, ప్రపంచంలోని ధనవంతులందరూ ఈ తప్పనిసరి దానాన్ని (జకాత్) ఇస్తే, **ప్రపంచంలో పేదరికం ఉంటుందా? ఆలోచించండి!**

ఈ 225 మందిలో 10మంది మన భారతీయులే ఉన్నారు. వారు జకాత్ ఇస్తే 21 లక్షల కుటుంబాలు లోటులేకుండా జీవిస్తాయి.

ఈ దానం వారి ఆస్తిలో 40వ వంతు మాత్రమే కాబట్టి, ఈ దానం చేయడం వలన, దానం చేసిన వారు నష్టపోరు. అంతేకాకుండా అల్లాహ్ వారి సంపాదనని వృద్ధి చేస్తానంటున్నారు.

ప్రస్తుతం ప్రపంచంలోని పేదవారు ఒక సంవత్సరానికి సంపాదించే మొత్తాన్ని లెక్కగట్టారు. ఇలా చేస్తే, 225 మంది ప్రపంచ అత్యంత ధనికుల దగ్గర ఉన్న సొమ్ము - 250 కోట్ల మంది పేదవారి సంవత్సర సంపాదనకు సమానమని తెలిసింది. Isn't it mind boggling?

**'ఇస్లాంను అనుసరించే వారిలో పేదరికం'** అన్నారు. నెత్తిమీద టోపీని బట్టి, పేరును బట్టి ఓ వ్యక్తి ముస్లిం కాడు. ముస్లిమ్ కుటుంబంలో పుట్టినంత మాత్రాన ముస్లిమ్ కాడు. ఇస్లాం ధర్మాన్ని ఆచరించాలి. ఆచరిస్తేనే ముస్లిమ్. ఇలా ఆచరించే వారిలో ధనవంతులూ ఉన్నారు, పేదవారూ ఉన్నారు. కాని వారు ధనవంతులైనా, పేదవారైనా మనశ్శాంతితో సంతోషంగా ఉన్నారు. ఇస్లాంను అనుసరించే ముస్లిములు నిరాడంబరంగా, అల్లాహ్ మార్గంలో ఖర్చు చేస్తారు. కాబట్టి వారు మీకు పేదరికంలో ఉన్నట్లు కనిపించవచ్చు. పేదరికం శాపం కాదు.

కాయకష్టం చేయకుండా సోమరిపోతులా జీవించడమే శాపం. కష్టపడకుండా పెద్దలు సంపాదించినది కూర్చుని తినడమే శాపం!

**ముగింపు:**

పై విషయాలను బట్టి స్పష్టమయ్యేదేమిటంటే, మనిషి తన చుట్టూ సమస్యలను ఏర్పరచు కుంటున్నాడు. ఆ సమస్యల పరిష్కారానికి 'సృష్టికర్త అయిన అల్లాహ్' పరిష్కారాలను తెలియజేశాడు.

ప్రస్తుతం స్వైన్ ఫ్లూ వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి రాకపోతే చాలా మంచిది. వచ్చాక ఆ వ్యాధిని తిడుతూ కూర్చోలేం కదా!

పరిష్కారం ఆలోచించాలి. ముందస్తు జాగ్రత్తగా ఫలానా మందు ఉందని తెలిస్తే, నాస్తికులు ఏం చేస్తారు?

**ఆ మందును వాడమని అందరికీ చెబుతారా? లేదా?**

ఎటువంటి సందేహం లేదు, ఇన్షాఅల్లాహ్, తప్పకుండా చెబుతారు.

అలాగే పేదరిక సమస్యకి పరిష్కారం - ఖుర్ఆన్ గ్రంథ ఆదేశాలని పాటించడమేనని ఇప్పుడు తెలిసింది కదా!

**మరి నాస్తికులు ఈ పరిష్కారాన్ని కూడా అందరికీ చెబుతారా? లేదా?**

**నాస్తికులారా! లేవండి!**
**ఖుర్ఆన్ ప్రకారం జీవించమని అందరికీ చెప్పండి!**

---

**సమాజంలోని సకల రుగ్మతలకు కారణం -**
**మనిషి ధర్మాన్ని వదలడం మరియు నాస్తికత్వం.**
**ధర్మంగా బ్రతుకుతూ నాస్తికత్వానికి దూరంగా ఉంటే అంతా సుభిక్షమే!**

---

"The more I study nature, the more I stand amazed at the work of the Creator. I pray while I am engaged at my work in the laboratory".

***Louis Pasteur***
Father of Microbiology, developed "pasteurization"
*The Literary Digest* (18 October 1902)
http://en.wikiquote.org/wiki/Louis_Pasteur

**" నేను ఎంతగా ప్రకృతిని అధ్యయనం చేస్తే, సృష్టికర్త యొక్క నైపుణ్యాన్ని చూసి అంతగా ఆశ్చర్యపోయేవాడిని. నేను లేబరేటరీలో నా పనిలో నిమగ్నమై ఉన్నప్పుడూ నేను ప్రార్థన చేసేవాన్ని."**

**లూయిస్ పాశ్చర్**
మైక్రోబయాలజీ పితామహుడు, పాశ్చరైజేషన్ ప్రక్రియను అభివృద్ధి చేసిన శాస్త్రవేత్త

# పాఠకుల అభిప్రాయాలు

- **చెన్నయ్ నుండి ఓ సోదరుడు శుభాకాంక్షలను తెలియజేస్తూ velugubaata@gmail.com కు ఈ-మెయిల్ లెటర్ని పంపారు. పత్రికను, దాని కోసం జరిగిన కృషిని ప్రశంసిస్తూ, 'శాంతిబాట'ను ఇంగ్లీష్లో కూడా ప్రారంభించడమే కాకుండా, ధక్షిణ భారతదేశ భాషలలో కూడా ప్రచురిస్తే బావుంటుందని తన అభిప్రాయాన్ని తెలియజేశారు. అల్లాహ్ యొక్క ఆశీర్వాదం 'శాంతిబాట' టీమ్పై ఉండాలని కోరుతూ ఆయన పంపిన శుభాకాంక్షలకు, శాంతిబాట టీమ్ కృతజ్ఞతలు తెలియజేసుకుంటుంది.**
- **సరియైన సమయంలో నేటి సమకాలీన పరిస్థితులకు సరిపోయే వ్యాసాలతో పత్రికను విడుదల చేయడం జరిగిందని, తమ పూర్తి సహకారం పత్రికకు ఉంటుందని ఆత్మీయంగా స్పందించి, కర్నూలు జిల్లా నందికొట్కూర్, వైజాగ్ జిల్లా పాడేరు నుండి సోదరులు తెలియజేశారు.**
- **ముస్లిమ్ సోదరులే కాకుండా, ఇతర ధర్మాలకు చెందిన సోదరులు కూడా కామెంట్ చేయడానికి అవకాశం లేనివిధంగా శాంతిబాట పత్రిక తయారైందని విజయనగరం నుండి సోదరులు తెలియజేశారు.**
- **పత్రిక బాగుంది, ఇవే ప్రమాణాలతో రాబోయే సంచికలను అందించమని గుంటూరు నుండి, ఇలాంటి పుస్తకాలను ఎక్కువ సంఖ్యలో ముద్రించి రాష్ట్రమంతటా సర్క్యులేట్ చేయాలని విజయవాడనుండి సోదరులు తమ అభిప్రాయాలను తెలియజేశారు.**

**అల్లాహ్ పేరుతో మంచి సంకల్పం (నియ్యత్)తో శాంతిబాట టీమ్ ఈ పత్రికను ప్రారంభించింది. అందువలననే 'అల్లాహ్' కరుణతో, ఈ ప్రశంసలను అందుకునే భాగ్యం కలిగింది.**

**మాతో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సహకరిస్తున్న సోదరులందరికీ**
**అల్లాహ్ శ్రేయోశుభాలను కలుగజేయాలని**
**శాంతిబాట టీమ్ కోరుకుంటుంది.**

## ఈద్ ముబారక్

ఈద్ స్టాంప్ని ముద్రించేలా అమెరికా ప్రభుత్వాన్ని సోదరి ఆమినా ఒప్పించ గలిగారు అని గత సంచికలోని తిరిగి గూటికి వ్యాసంలో చెప్పడం జరిగింది. ప్రక్కనున్న ఫొటోగ్రాఫ్లో అమెరికన్ పోస్టల్ స్టాంప్ '**ఈద్ గ్రీటింగ్స్**'తో మన సోదరి ఆమినా. ఈ సోదరిని మీ దువా లలో గుర్తుంచుకోమని మరోసారి మనవి చేసుకుంటున్నాము.

ఏ ధర్మాన్ని కించపరిచే ఉద్దేశ్యం మాకు లేదు. అన్ని ధర్మాలను గౌరవిస్తున్నాం

# టెర్రరిజం

- క్రైస్తవ టెర్రరిజం ?
- సిక్కు టెర్రరిజం ?
- యూదు టెర్రరిజం ?
- కమ్యూనిస్ట్ టెర్రరిజం ?
- హిందూ టెర్రరిజం ?
- ఇస్లామిక్ టెర్రరిజం ?

తీవ్రవాదానికి, మత ధర్మానికి ఏ విధమైన సంబంధం లేదు. ✓

**టెర్రరిజం అనేది ముస్లిములకే స్వంతమన్నట్లు, మీడియా ఎందుకు ముస్లిములనే టార్గెట్‌గా పెట్టుకుంది?**

**తీవ్రవాదాన్ని 'ముస్లిము'లుగా మేము ఖండిస్తున్నాం. మానవులకు అపకారాన్ని తలపెట్టే ఏ పనినైనా మేం వ్యతిరేకిస్తాం. మానవులందరూ ఒకే జంట యొక్క వారసులని, ఖుర్'ఆన్ ద్వారా తెలుసుకుని ప్రపంచ ప్రజలందరినీ వారు హిందువులైనా, క్రైస్తవులైన లేక మరే ధర్మానికి చెందిన వారైనా సరే, వారిని మా సోదరులుగానే భావిస్తున్నాం. మా సోదరులపై జరిగే ఎటువంటి హింసనైనా నిర్ద్వందంగా ఖండిస్తున్నాం. కాని మీడియా వారి రెండు నాలుకల ధోరణిని వివరించాలనేది ఈ శీర్షిక యొక్క ప్రధానోద్దేశం కాబట్టి ఈ శీర్షికలో మీడియా భాషనే వాడుతున్నాం. మా భాష మాత్రం కాదు. వేరే ధర్మం వారి ఎవరికైనా బాధ కలిగితే, మీడియా వారి వలన ముస్లిములకు కూడా అంతే బాధ కలిగిందని అర్థం చేసుకుని, కొంత మంది ప్రోద్భలంతో మీ తోటి ముస్లిం సోదరులపై అనాగరికంగా వ్రాస్తున్న మీడియా వ్రాతలను ఖండించమని కోరుతున్నాం.**

2

## 19వ శతాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా జరిగిన తీవ్రవాద దాడులు

**1800 –** నెపోలియన్ బోనాపార్టెని హత్య చేయడానికి పారిస్‌లో డిశంబర్ 24, 1800లో **Rue Saint - Nicaise** కుట్ర పన్నాడు.

**1838** - 1838 సంIIలో జరిగిన Haun's Mill సామూహిక మారణకాండ: అక్టోబర్ 30, 1838 తేదీన 18 మంది స్త్రీలను, పురుషులను, పిల్లలను సామూహికంగా చంపారు.

**1857** - Mountain Meadows సామూహిక మారణకాండ : Fancher-Baker ఎమిగ్రెంట్ వేగన్ ట్రైన్‌లోని 120 మంది స్త్రీ, పురుషులను, పిల్లలను సామూహికంగా సెప్టెంబర్ 11, 1857లో Utah territory లోని Mountain Meadows వద్ద వధించారు. ఈ పనిచేసినవారు **<u>Mormons</u>** మరియు **Paiute Indians**.

(<u>Mormon</u> **అంటే 1830వ సంవత్సరంలో జోసెఫ్ అనే వ్యక్తి న్యూయార్క్ నగరంలో నెలకొల్పిన ఒక మతసంఘంలో సభ్యుడు**)

**1856, 1858, 1859** - బానిసత్వానికి వ్యతిరేక పోరాటంలో భాగంగా 'జాన్ బ్రౌన్' 1856, 1858, 1859 సంIIలలో దాడులు జరిపాడు.

**1858** - చక్రవర్తి లూయిస్ నెపోలియన్ బోనాపార్టెను చంపడానికి **Felice Orsini** 1858లో ప్రయత్నించాడు గాని, ఆ ప్రయత్నం ఫలించలేదు. అయితే ఈ ఘటనలో 8మంది చనిపోయారు, 142మంది గాయపడ్డారు.

1863 - జాన్ హంట్ మోర్గాన్ 1863లో జరిగిన దాడికి కారకుడు.

1867 - Clerkenwell జైలును పేల్చడానికి **ఫెనియన్ ఏజెంట్లు** మార్చి 5, 1867లో ప్రయత్నించారు. డైనమైట్ పేలడం వలన దగ్గర్లో నున్న ఇండ్లు నాశనమయ్యాయి. 6గురు చనిపోయారు. ఈ దుర్ఘటనలో 120 మంది గాయపడ్డారు. అందులో 15 మందికి కళ్ళు, కాళ్లు, చేతులకు శాశ్వత గాయాలయ్యాయి.

**1865 – 1877** ల మధ్య కాలంలో **3000** మందికి పైగా విముక్తి పొందిన బానిసలను మరియు వారి రిపబ్లికన్ పార్టీ సహచరులను, **Ku Klux Klan** అనే సంస్థ, స్థానికంగానున్న **తెల్లజాతివారితో** కలిసి హింసాయుత ప్రచారాలను నిర్వహిస్తూ చంపివేశారు. అమెరికా సౌత్‌లోని ప్రభుత్వాలను కూలద్రోశారు. వివక్ష చూపే ప్రభుత్వాలను అందలమెక్కించారు.

**1868** - ఆస్ట్రేలియాలోని సిడ్నీలో రాజకుమారుడు ఆల్‌ఫ్రెడ్‌పై హత్యా ప్రయత్నం జరిగింది. ఐర్లాండ్ నుండి బ్రిటన్‌ను వైదొలిగేలా చేయడానికి, బ్రిటన్‌పై ఒత్తిడి తీసుకురావడం కోసం, కెనడా దేశ లక్ష్యాలపై **"ద ఫెనియన్ బ్రదర్‌హుడ్"** దాడులు జరిపింది.

**(ఫెనియన్** అంటే ఆంగ్లేయుల ఆధిపత్యాన్ని తొలగించడానికి అమెరికాలోని ఐరిష్‌వారు 1858లో స్థాపించిన సంఘ సభ్యుడు)

**1870** - స్పెయిన్ పార్లమెంట్‌నుండి వెళుతుండగా కౌన్సిల్ ప్రెసిడెంట్ అయిన జనరల్ Juan Primను ఆయన రాజకీయ శత్రువులు ఆయనను షూట్ చేశారు. రెండు రోజుల తరువాత ఆ గాయం యొక్క కాంప్లికేషన్స్‌తో ఆయన చనిపోయారు.

**1881** - రష్యా యొక్క Tzar Alexander II పీపుల్స్ విల్ టెర్రరిస్ట్ (Narodnaya Volya)చే హత్యగావించబడ్డాడు.

**1881** - Salford పదాతిదళం యొక్క గృహాలను పేల్చడానికి **ఫెనియన్లు** జనవరి 14, 1881లో ప్రయత్నించారు. ఒకరు చనిపోయారు.

**1882** - Lyon లో Bellecour రెస్టారెంట్ థియేటర్‌లో అక్టోబర్ 22, 1882 తేదీన బాంబు ప్రేలి ఒక ఉద్యోగి చనిపోయాడు.

1884 - స్కాట్‌లాండ్ యార్డ్‌లోని కొంతభాగం మరియు కార్ల్టన్ క్లబ్‌లోని కొంతభాగం మే 30, 1884లో **ఫెనియన్లు** చేసిన డైనమైట్ దాడిలో

ధ్వంసం అయ్యాయి. Nelson's Column దిగువ భాగాన ప్రేలని పరికరాన్ని కనుగొన్నారు.

**1885** - లండన్ టవర్ మరియు లండన్ బ్రిడ్జ్ దగ్గర జనవరి 25, 1885 తేదీన **ఫెనియన్లు** పెట్టిన బాంబులు ప్రేలాయి. మరో రెండు House of Commons (ఇంగ్లండులోని ప్రజాప్రతినిధుల శాసన సభ) దగ్గర ప్రేలాయి.

**1887** - బ్రిటిష్‌వాని ఖర్చుతో ఓ **ఫెనియన్** ఏజెంట్ **Westminster Abbey** ని పేల్చి విక్టోరియా రాణిని చంపాలనే పథకం ఫెయిలైంది. ఈ దాడికి పన్నిన పథకాన్ని జూన్ 21, 1887 తేదీన అమలుజరిపారు.

**1881** - అమెరికా అధ్యక్షుడు జేమ్స్ గార్‌ఫీల్డ్‌ని జూలై 2, 1881 తేదీన **Charles J. Guiteau** అనే మత దురభిమాని హత్యగావించాడు.

**1886 –** చికాగోలోని హే మార్కెట్ స్క్వేర్‌లో నిర్వహించిన లేబర్ ర్యాలీ పై బాంబుదాడి జరిగింది. ఈ దాడిలో 12 మంది చనిపోయారు. ఒక పోలీస్‌మాన్ కూడా ఉన్నాడు. మరో 17 మంది పోలీసులు ఈ దాడిలో గాయపడి హాస్పిటల్‌లో చనిపోయారు. ఈ దాడికి బాధ్యులు 8 మంది **విప్లవకారులు.**

**1891 – మే 11వ తేదీన జరిగిన Otsu సంఘటన.** రష్యా యొక్క **Nicholas II** పై **Tsuda Sanzo** అనే జపనీస్ పోలీస్ ఆఫీసర్ హత్యాప్రయత్నం చేశాడు.

**1893 –** ఫిబ్రవరి 3వ తేదీన **Ravachol** ఉరితీత నిర్ణయానికి ప్రతీకారంగా ఫ్రెంచ్ ఛాంబర్ ఆఫ్ డిప్యూటీస్ పబ్లిక్ గ్యాలరీ నుండి **Auguste Vaillant** ఓ నాటు పరికరాన్ని విసిరాడు. ఆ పరికరం యొక్క బలహీనతవలన, ఆ ప్రేలుడులో ఒక డిప్యూటీ మాత్రమే గాయపడ్డాడు.

**1893 –** ఏప్రిల్ 25వ తేదీన **Ravachol** తీర్పుకు ముందురోజు, రావచోల్ అరెస్ట్ కాబడిన వెరీ రెస్టారెంట్ ప్రదేశంలో బాంబ్ ప్రేలింది. రెస్టారెంట్ ఓనర్ మరియు మరొక వ్యక్తి చనిపోయారు. ఈ బాంబు దాడికి పాల్పడిన **Theodule Meunier** ను తరువాత 1894లో లండన్‌లో అరెస్ట్ చేశారు.

**1893 –** విప్లవకారుడు **Santiago Salvador,** బార్సిలోనా **Liceu** ఒపేరా హౌస్ స్టాల్స్‌లోకి రెండు బాంబులను విసిరాడు. పేలిన ఒక బాంబు వలన సుమారు 20మంది చనిపోయారు. చాలామంది గాయపడ్డారు.

**1894 –** లండన్‌లోని రాయల్ గ్రీన్‌విచ్ అబ్జర్వేటరీ దగ్గర ప్రేలుడు. బాంబు ముందుగానే ప్రేలడంతో దాడి చేయబోయినవాడే చనిపోయాడు.

**1894 –** ఫిబ్రవరి 12వ తేదీన **Auguste Vaillant** ను ఉరితీసిన వారంరోజుల తరువాత, ఎమైల్ హెన్రీ అనే వ్యక్తి సెయింట్ లాజరే రైల్వే స్టేషన్‌లోని 'టెర్మినస్' కేఫ్‌లోకి బాంబు విసిరాడు. ఒకరు చనిపోయారు. 20మంది గాయపడ్డారు. రావచొల్, వెయ్‌ల్లంట్, హెన్రీ అనార్చిస్ట్ మిలిటెంట్స్.

**1894 –** జూన్ 24వ తేదీన ఇటలీకి చెందిన అనార్చిస్ట్ **Sante Geronimo Caserio** ఫ్రెంచ్ ప్రెసిడెంట్ 'సదీ కర్నోట్'ను అగస్టే వెయ్‌ల్లంట్, ఎమైల్ హెన్రీ లకు ప్రతీకారంగా పొడిచి చంపాడు.

**1897 –** థెర్మల్ బాత్ రిసార్ట్‌లో మైఖేల్ ఏంజియోలిల్లో అనే అనార్చిస్ట్, కౌన్సిల్ ప్రెసిడెంట్ అయిన **Antonio Canovas del Castillo** ను కాల్చి చంపాడు.

**1898 –** సెప్టెంబర్ 10 వ తేదీన జెనీవాలో **Luigi Lucheni** అనే యువ ఇటాలియన్ అనార్చిస్ట్, ఆస్ట్రియా-హంగేరీ మహారాణి కౌన్సిల్ ప్రెసిడెంట్ అయిన **Elisabeth of Bavaria** ను పొడిచి చంపాడు.

**అంతేగాని ముస్లింలు మాత్రం కాదు.**

***Source :*** *Internet [http://en.wikipedia.org/wiki/List_of_terrorist_incidents]*

## పైన తెలిపిన 19వ శతాబ్దపు తీవ్రవాద దాడులలో ఏ ఒక్కదాడిలో కూడా ఓ ముస్లిమ్ గాని లేదా ఓ ముస్లిమ్ సంస్థ గాని పాల్గొనలేదు

మరి ఈ దాడులను చేసిందెవరు? వారెవరో తెలుసుకోవడం పాఠకులకు పెద్ద కష్టమైన పనికాదు. వారి తీవ్రవాదానికి, వారి మతం పేరును ఎందుకు తగిలించలేదు?

మరో ముఖ్యమైన విషయం : అప్పుడు కూడా ప్రపంచంలో కోట్ల సంఖ్యలో ముస్లిములున్నారు. అప్పటికి 'ఇస్లాం' ధర్మం 1200 సం॥ల నుండి ఆచరణలోనే ఉంది. పై దాడులు ఇస్లాం మతానికి సంబంధించినవారు చేసినవి కాదు.

కాని పై దాడులను చేసినవారి 'మతాలను' ఎవరైనా అనుమానించారా? అవమానించారా? లేదే!

మరి ఈ రోజున ఎవడో ముస్లిమ్ పేరు పెట్టుకున్నవాడు తప్పుచేస్తే, 'ఇస్లాం తీవ్రవాది' అని వాడిని వర్ణిస్తూ, 'ఇస్లాం' నెందుకు అవమానిస్తున్నారు? అనుమానిస్తున్నారు?

ఎక్కడో పాకిస్థాన్‌లోనో, ఆఫ్ఘనిస్తాన్‌లోనో ఎవరో ఏదో చేస్తే ప్రపంచంలోని ముస్లిములందరూ చేసినట్లు, 'ఇస్లాం'కి బురద అంటించాలని చూస్తున్నారు.

మరి అమెరికాలోనో, బ్రిటన్‌లోనో ఎవడో అదే పనిచేస్తే, వారి మత ధర్మానికి బురద అంటించే ధైర్యం మీడియా కుందా?

ఇండియాలో ఆ మత ధర్మానికి సంబంధించిన వారిని మీరు అనుమానించ గలరా? అవమానించ గలరా?

ఎందుకీ వివక్ష? పోనీ పాలకులలో అటువంటి వివక్ష ఉందనుకుంటే, రాజకీయాలలో ఇది సామాన్యమే అని కొంతైనా సరిపెట్టుకోవచ్చు. కాని ఇక్కడ వివక్ష చూపేది మీడియా.

**సత్యాన్నే వ్రాయవలసిన మీడియా ఎందుకిలా చేస్తుంది?**
**పాశ్చాత్యుల నుండి ఏమి ఆశించి ఇలా చేస్తుంది?**

**పాశ్చాత్య మీడియా ఏమని ప్రచారం చేస్తుంది?**

1. ముస్లిములంతా తీవ్రవాదులు కారు
2. కాని తీవ్రవాదులంతా ముస్లిములే!

మరి 19వ శతాబ్దపు తీవ్రవాద దాడులు ముస్లిములు చేయలేదు కదా! పాశ్చాత్యుల మీడియా లాజిక్ ప్రకారమే ఆలోచిద్దాం!

19వ శతాబ్దపు చివరిలో తీవ్రవాదులు ఎవరు? అని ఎవరైనా ప్రశ్నిస్తే ఏం జవాబు చెప్పాలి? జరిగిన దాడులలో ముస్లిముల ప్రమేయం లేదు కాబట్టి, "**ముస్లిములు తప్ప, ఇతరులే తీవ్రవాదులు**" అని చెప్పాలి కదా!

అలా చెప్పగలరా?

మరి 19వ శతాబ్దం వరకూ 'ఇస్లాం' ధర్మం తీవ్రవాదాన్ని ప్రేరేపించ లేనప్పుడు, గత 20వ శతాబ్దంలోనే ఎలా ప్రేరేపించింది?

ఇస్లాం ధర్మం మారిపోయిందా?

"ప్రపంచంలో అవతరించిన దగ్గరనుండి ఇప్పటివరకూ ఒక అక్షరం కూడా మారని దైవగ్రంథం ఏదైనా ఉందని సాక్ష్యాలతో సహా చెప్పాలంటే అది ఖుర్ఆన్ గ్రంథమే! అప్పటి రెండు ఒరిజనల్ గ్రంథాలలో ఒకటి ఇస్తాంబుల్‌లోనూ, రెండవది తాష్కెంటులోనూ ఉన్నాయి". కాబట్టి ఇస్లాం మారలేదు.

మారింది మనుష్యులే! మీడియా మారిపోయింది. సత్యాలను చెప్పడాన్ని కొన్ని విషయాలలో మీడియా మానుకుంది. అబద్ధాలను చెప్పడం నేర్చుకుంది.

**వాస్తవంగా ఆ దాడులలో పాల్గొన్నవారు:**

((1) Mormons అనేవారు ఓ మతానికి చెందిన సభ్యులు

(2) Fenian brotherhood సంస్థ బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా పోరాడే సంస్థ. వీరు ఎన్నో దాడులు చేశారు. బ్రిటిష్ వారికి దొంగ దారుల్లో దేశాలను ఆక్రమించడమే పని కదా! మన దేశాన్ని దాదాపు 200 సం॥లకు పైగా వశపరచుకుని, మనల్ని బానిసలుగా చేసుకుని పాలించారు.

మనదేశంలో కూడా అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్‌లాంటి విప్లవవీరులు బ్రిటిష్ వారిపై దాడి చేశారు. మనదేశ భక్తులు, ప్రియతములు అయిన **అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్‌**ల వలే, ఫెనియన్లు కూడా బ్రిటిష్ వారిపై దాడి చేశారు కాబట్టి, వారికి మనకి కామన్ శత్రువు 'బ్రిటిష్ వారు' కాబట్టి, ఫెనియెన్లు చేసిన తీవ్రవాద దాడులను సమర్థిద్దామా? లేక వారిని దుర్మార్గులుగా భావిద్ధామా?

(3) **Ku Klux Klan** : **అమెరికాలోని దక్షిణ రాష్ట్రాలలో అంతర్యుద్ధానంతరం నీగ్రోలకూ రోమన్ కేథలిక్కులకూ వ్యతిరేకంగా ఏర్పడిన రహస్య సమాజం.** Beginning in the late nineteenth century, white supremacist Ku Klux Klan members in the Southern United States engaged in arson, beatings, cross burning, destruction of property, lynching, murder, rape, tar-and-feathering, and whipping against African Americans, Jews, Catholics and other social or ethnic minorities.

During the twentieth century, members of extremist groups such as the Army of God began executing attacks against abortion clinics and doctors across the United States. A number of terrorist attacks, including the Centennial Olympic Park bombing during the 1996 Summer Olympics, were carried out by individuals and groups with ties to the Christian Identity and Christian Patriot movements; including the Lambs of Christ. A group called Concerned Christians unsuccessfully planned to attack holy sites in Jerusalem at the end of 1999, believing that their deaths would "lead them to heaven."

[Source: http://en.wikipedia.org]



Ku Klux Klan members and a burning cross, Denver, Colorado, 1921

(4) తెల్లజాతివారు : వీరు ఆఫ్రికన్ అమెరికన్స్‌ని ఎలా చిత్రవధ చేశారో తెలుసా?

(5) విప్లవకారులు

(6) బానిసత్వానికి వ్యతిరేకంగా జరిగినదాడులు మరియు వ్యక్తిగత దాడులు. వీటి గురించి అంతలోతుగా ఇక్కడ చర్చించనవసరం లేదు.

పైన వివరించినట్లు 19వ శతాబ్దంలో జరిగిన ఏ ఒక్క తీవ్రవాద దాడి కూడా ఒక ముస్లిమ్ వలన గాని, లేదా ఓ ముస్లిమ్ సంస్థవలన గాని జరగలేదు కదా, మరి ఆ కాలంలో 'ఇస్లాం' ధర్మం లేదా? ఉంది. మంచి స్థితిలోనే ఉంది. అప్పటికి ఇస్లాం ధర్మం యొక్క ఆచరణ మొదలై 1200 సం॥లు దాటాయి కూడా. ఆ సమయంలో కూడా దివ్య ఖుర్ఆన్‌ని కంఠస్థం చేసినవారు లక్షల సంఖ్యలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్నారు. ఇస్లాంనే ప్రాణంగా భావించిన వారున్నారు.

**మరి ఇస్లాం ధర్మం టెర్రరిజాన్ని ప్రోత్సహించేటట్లయితే, అప్పుడు ముస్లిములెందుకు తీవ్రవాదులు కాలేదు?**

'ఇస్లాం' అంటే శాంతి. అది మామూలు శాంతి కాదు. ఆ 'శాంతి' మానసిక ప్రశాంతత నిస్తుంది. ఆ 'శాంతి' ప్రతీ వ్యక్తి స్వయంగా తనకు తానుగా సకల లోకాల ప్రభువుకు అర్పించుకుని, ఆయన ఆజ్ఞల ప్రకారం ఆచరించడం ద్వారానే లభిస్తుంది. ఆ 'శాంతి' (ఇస్లాం) సంతోషమయ జీవనాన్ని అందిస్తుంది.

LTTE దాడులు చేస్తే, భారత తమిళులందరూ ఆ దాడులకు బాధ్యులా?

పాకిస్థాన్‌లో ఉన్న స్వల్ప తీవ్రవాదులను, తాలిబన్లని తయారు చేసిందెవరు? అమెరికాయే కదా! ఆనాడు సోవియట్ రష్యాకి వ్యతిరేకంగా దాడులు చేయించడానికి వీరిని అమెరికా తయారుచేసింది. ఉన్నవాడికి బలుపెక్కి, ఆ బలుపుతో పెద్ద దేశాలు ఆడే గేమ్‌లో ఇలాంటి వారు తయారౌతారు. గేమ్ పూర్తికాగానే వీరి అవసరముండదు.

అవసరం తీరిపోయింది కాబట్టి వారిని నాశనం చేయాలి. లేకపోతే తమకు గుదిబండలౌతారు. కాని అలా నాశనం చేయడం వలన కూడా తమకు లాభం చేకూరాలి. ఎలా అంటే ఒకే దెబ్బకు రెండు పిట్టలు లాగ. 'నాగరికం' పేరుతో అనాగరిక మృగాల వలె బ్రతుకుతున్న అమెరికన్ల లాంటి వారికి, సభ్యత సంస్కారాలతో బ్రతికే ముస్లిములంటే విపరీతమైన ద్వేషం.

మంచివాడు ఉన్నప్పుడే కదా, చెడ్డవానికి గౌరవం ఉండదు. అసలు ఆ మంచివాన్నే తనకంటే చెడ్డవానిగా చిత్రీకరిస్తే, సాపేక్షంగా ఈ చెడ్డవాడినే బెటర్ అంటారు కదా!

అటువంటి ఆలోచనతోనే, అమెరికన్లు తాము వాడుకుని వదిలించు కోవాలనుకున్న తీవ్రవాదులకు **'ఇస్లాం'** మత రంగును అతికించి ప్రపంచ ప్రజల దృష్టిలో 'ఇస్లాం' ధర్మానికి, ముస్లిములకు తీవ్రంగా నష్టం కలిగించాలని ప్రయత్నిస్తున్నారు.

వారి దగ్గర అక్రమంగా ప్రపంచ ప్రజలను దోచి సంపాదించిన సొమ్ముంది. మీడియా కూడా వారి చేతుల్లోనే ఉంది. మీడియాలో ఏది వస్తే అది నమ్మే అమాయక ప్రజానీకం ఎలాగూ రెడీగానే ఉన్నారు.

తమ పథకం బాగానే పారుతుందని, అమెరికా పరపతి పెరుగుతుందని, అమెరికా నాయకులు భావిస్తున్నారు. అది పెరగడం కాదు 'వాపు' అని ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నారు.

అమెరికాలోని రెండు టవర్స్‌ను కూల్పించింది అమెరికా ప్రభుత్వమేనని, అది తీవ్రవాదుల పనికాదని వివరించే ఎన్నో విశ్లేషణలు, సాక్ష్యాలు ఇంటర్‌నెట్‌లో ఉన్నాయి.

అమాయకులు ఈ రోజుకీ ఆ పనిచేసింది తీవ్రవాదులని నమ్ముతూనే ఉన్నారు. కాని ఈ విషయంపై ముందుగా అనుమానమొచ్చింది అమెరికా ప్రజలకే! 'సత్యం' తెలుసుకోవాలను కున్నారు. ఖుర్‌ఆన్ గ్రంథాన్ని చదివారు. ఇస్లాం ధర్మాన్ని అర్థం చేసుకోగలిగారు. తమకు మనశ్శాంతి ఇందులోనే ఉందంటూ, ప్రతీ సంవత్సరం సుమారు 20,000 మంది అమెరికన్ యువతీ యువకులు ఇస్లాం ధర్మాన్ని స్వీకరిస్తున్నారు. అందులో 14,000 మంది స్త్రీలే. ఇది అమెరికా ప్రభుత్వానికి తొత్తుగా పనిచేసే CNN వారి రిపోర్టే!

వాపు పెరగడం కాదని, ఆ నొప్పి ఎంత బాధగా ఉంటుందో అనుభవించడం అమెరికాలో ఇప్పుడిప్పుడే మొదలైంది.

అమెరికాలో ఎవరైనా చొక్కా, ఫ్యాంట్ చించుకుని రోడ్డుపై నిర్లక్ష్యంగా తిరిగితే, రెండవరోజు అలా తిరగడం మనదేశంలో కొత్త ఫ్యాషన్ అవుతుంది. అమెరికా వాడా! మజాకా! మనదేశంలో పిల్లలను LKG లో జాయిన్ చెయ్యగానే, వారి తల్లిదండ్రులు తమ పిల్లల పెద్ద చదువులు అమెరికాలో జరగాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటారు.

మనదేశ జాతీయజెండా రంగులంటే అంత ఇష్టం ఉన్నా లేకపోయినా, అమెరికా దేశ జాతీయపతాకం ప్రింటైన చొక్కా, ప్యాంట్‌లంటే ఎంతో ప్రేమ. ఇంతగా చొంగలు కార్చడం మనవారికి అలవాటయిపోయింది.

మీడియా కూడా అదే బాట పట్టింది. అమెరికా వాడు "ఇస్లామిక్ తీవ్రవాదం" అన్నాడు. ఇక్కడ భారతదేశంలోని మీడియా వారు కూడా అదే పదాన్ని వాడుతున్నారు.

హిందువులు, ముస్లిములు ఐక్యంగా సోదరులుగా జీవిస్తూనే, బ్రిటిష్ వారిపై పోరాడారు కదా! అప్పుడు ఇస్లామిక్ తీవ్రవాదం లేదే!

ఈ మధ్యకాలంలోనే ఈ పదం పుట్టింది. కాని ఇస్లాం ధర్మం ఈ మధ్యనే పుట్టలేదు కదా! 1400 సం॥ల క్రితం నుండి ఆచరణలోనే ఉంది. ఆధునిక సైన్స్‌కి పునాదులు వేసింది. బానిసత్వాన్ని అరేబియా నుండి తరిమికొట్టింది. బానిసత్వ నిర్మూలనకు పునాదులు వేసింది. పరమత సహనాన్ని పెంచింది.

ఈ రోజున మత దురభిమానం తీవ్రరూపం దాల్చింది. ఇస్లాం ధర్మంపై దుష్ప్రచారం చేస్తుంది.

**మరి మన బాధ్యతేమిటి?**

కొన్ని సంఘటనలను ఉదాహరిస్తూ నా అభిప్రాయాన్ని తెలియజేస్తున్నాను.

నా కూతురి పేరు 'ఫాతిమా'. 3వ తరగతి చదువుతుంది. తన క్లాస్‌మేట్ మా పాపతో ఇలా చెప్పిందట: "నీవు ఏమీ అనుకోకే, మీ ముస్లిములు మంచివారు కాదట". పోనీ మా పాప అల్లరి చేసి, మిగిలిన విద్యార్థినులను ఇబ్బందిపెడితే అలా మాట్లాడింది అనుకోవచ్చు. కాని తాను చాలా సైలెంట్.

మరి సమైక్యంగా ఉండవలసిన బావిభారత పౌరులు, చిన్నతనం నుండే ఇలా పెరిగితే ఏం జరుగుతుంది? తప్పు ఎవరిది? దుష్ప్రచారం చేసే మీడియాదా? లేక ఆ మాటలనే నమ్మి నిజాలను తెలుసుకోకుండా, పిల్లలకు నూరిపోసే తల్లితండ్రులదా?

ఎక్కడో బొంబాయి నగరం వరకూ ఎందుకూ? విశాఖపట్నంలోనే కొన్ని చోట్ల, ముస్లిములకు అద్దెకు ఇల్లు దొరకడం కష్టంగా ఉంది. ప్రక్కింట్లో ముస్లిం కుటుంబం ఉంటే భయపడుతున్నారు? ఎందుకు భయపడాలి? అలా భయపడేలా చేసిందెవరు?

**ముస్లిమ్ అంటేనే టెర్రరిస్టా?**

మరి భవిష్యత్తులో ముస్లిముల పరిస్థితి, వారి పిల్లల పరిస్థితి ఈ దేశంలో ఎలా ఉంటుంది? ఒక్కసారి ఊహించండి!

మన పిల్లల భవిష్యత్తులు బావుండాలి. మనదేశ ప్రజలు సమైక్యంగా ఉండాలి. అందుకేమి చేయాలి?

పరిష్కారం కొరకు అల్లాహ్ కరుణతో నాకు తోచిన ఓ విషయాన్ని చెబుతున్నాను. మీకు నచ్చితే పాటించండి.

"ఇస్లాం ధర్మం 'శాంతి ధర్మమే'కాని తీవ్రవాద ధర్మం కాదని, లౌకిక దేశమైన మన భారతదేశంలో ఓ ప్రత్యేక మతధర్మాన్ని అవమానించడం సమంజసం కాదని, దయచేసి 'ఇస్లామిక్ తీవ్రవాదం', 'ఇస్లామిక్ టెర్రరిస్ట్' అనే పదాలను ప్రింట్ మీడియా మరియు ఎలక్ట్రానిక్ మీడియా లో నిషేధించాలని మనవి చేస్తూ,

1. **గౌ॥ మనదేశ రాష్ట్రపతి గారికి,**
2. **గౌ॥ మన దేశ ప్రధానమంత్రి గారికి,**
3. **గౌ॥ సుప్రీం కోర్టు జడ్జిగారికి,**
4. **గౌ॥ మన రాష్ట్ర ముఖ్యమంత్రిగారికి,**
5. **గౌ॥ హైకోర్ట్ జడ్జిగారికి,**
6. **గౌ॥ ప్రెస్ కౌన్సిల్ ఛైర్మన్ గారికి**

పోస్ట్ కార్డుపై వ్రాసి, ప్రతీ నెలా ఒక్కొక్క కార్డును పంపించి, మన ఆవేదనను శాంతియుతంగా తెలియజేయాలి.

మన రాష్ట్రంలోని ముస్లిమ్ న్యాయవాదులను ఓ సారి ఈ విషయంపై దృష్టి పెట్టమని మనవి చేసుకుంటున్నాను.

డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు, M.Sc., Ph.D.

**ప్రజలను భయకంపితులను చేయడమే 'టెర్రరిజం' అయినప్పుడు, ఆ పనే చేస్తున్న నేటి మీడియా కూడా 'టెర్రరిస్టే' కదా! కాదంటారా? ముస్లిములు టెర్రరిస్టులు కాదు. తోటివానికి శాంతిబాటను పరిచయం చేస్తూ, శాంతిని కోరుకునే వారే ముస్లిములు.**

ప్రతీ స్త్రీ లేదా పురుషునికి తొలి బడి అమ్మ ఒడి. గొప్ప గొప్ప జ్ఞానులు, మేధావుల వెనుక తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంటుంది. తొలి గురువులు తల్లిదండ్రులే. ఆ తరువాతనే, పాఠశాలలో చేరిన దగ్గరనుండి, మిగిలిన గురువులు పరిచయమౌతారు. వీరందరినీ మీరు గౌరవించాలి. అయితే వీరందరికీ జ్ఞానాన్ని ఇచ్చిన సృష్టికర్తే విశ్వమంతటికీ గురువు - ఆయనే 'అల్లాహ్'. ఏ గురువు చెప్పినా అర్థం కాకపోయినా లేక మరేదైనా చెప్పుకోలేని సమస్య మీకొస్తే డైరెక్టుగా అల్లాహ్‌నే అడగండి. ఆయన వింటాడు. మీకు జవాబు కూడా వస్తుంది.

అయితే ఇక్కడ ఓ ముఖ్యవిషయాన్ని మీకు ఓ ఉదాహరణ ద్వారా చెబుతాను. సెల్‌ఫోన్‌లో మాట్లాడేటప్పుడు, మీ వైపు సిగ్నల్ సరిగ్గా లేకుంటే, అవతలి వ్యక్తి మాటలు మీ సెల్‌కు చేరవు కదా! అలాగే 'అల్లాహ్' ఇచ్చిన సమాధానం మీకు అర్థమవ్వాలంటే, మీ సిగ్నల్ బలంగా ఉండాలి. సెల్‌ఫోన్ సిగ్నల్ కాదు. అల్లాహ్‌పై మీ మనస్సులో ఉన్న విశ్వాసం చాలా బలంగా ఉండాలి. ఖుర్‌ఆన్‌ను, ముహమ్మద్(స) వారి బోధనలను (హదీసులను) అర్థం చేసుకుని, వాటి ప్రకారం మీరు ఆచరిస్తే, క్లాసులో మీరే టాప్ రేంకర్స్. విజయులు మీరే. అలా కాకపోతే అడగండి!

**2**

## సృష్టి (Creation)

మొదటి సంచికలో సృష్టికర్త గురించి చెప్పుకున్నాం కదా! అల్లాహ్‌యే సృష్టిస్తారని తెలుసుకున్నాం. మనిషి కూడా కొత్త వస్తువులను సృష్టిస్తాడు కదా అని మీకు సందేహం రావచ్చు. ఉదాహరణకు ఓ కార్పెంటర్ కుర్చీ తయారు చేస్తాడు. మరి అల్లాహ్ సృష్టికి, ఇతని సృష్టికి తేడా ఏమిటి?

కుర్చీని తయారుచేయాలంటే కార్పెంటర్‌కి చెక్క కావాలి. అంటే ఏదైనా కొత్త వస్తువుని తయారుచేయాలంటే, అప్పటికే సృష్టించబడిన మరొక వస్తువు లేదా వస్తువులు కావాలి. కాని అల్లాహ్ అంతకు పూర్వం ఉనికిలో లేని వాటిని ఏమీలేని శూన్యం నుండి సృష్టించాడు.

ప్రియమైన బాలలూ! ఇప్పుడు మీకర్థమైందా? ఏమీ లేని శూన్యం నుండి అల్లాహ్ సృష్టిస్తారని. ఖుర్‌ఆన్‌లో 6వ అధ్యాయంలో 101వ వాక్యంలో ఈ విషయాన్నే అల్లాహ్ చెప్పారు.

**"He created the heavens and the Earth from nothing ..."** (Surat al-An'am: 101)
**"ఆయనే ఆకాశాలనూ మరియు భూమిని ఏమీలేని శూన్యం నుండి సృష్టించాడు ..."** (సూరహ్ అల్-అన్'అమ్:101)

ఈ వాక్యం చదివాక, వెంటనే మీ బుర్రలో బల్బు వెలిగి ఉంటుంది. మీకు బిగ్ బేంగ్ (Big Bang) సిద్ధాంతం గురించి జ్ఞాపకం వచ్చి ఉంటుంది. మరి బిగ్‌బేంగ్ గురించి ఇంకా చదవని వారి సంగతేమిటి?

వారికి చెప్పాల్సిన బాధ్యత మనపై ఉంది.

బిలియన్ సంవత్సరాల క్రితం, ఓ పెద్ద ప్రేలుడు సంభవించి ఈ విశ్వం ఉనికిలోనికి వచ్చిందని, ఆ ప్రేలుడు వలన విరజిమ్మబడిన భాగాలే గ్రహాలుగా, నక్షత్రాలుగా మారిపోయాయట. విశ్వం ఆరంభం ఇలా జరిగిందని చెప్పే సిద్ధాంతమే - Big Bang

ఈ బిగ్‌బేంగ్‌కి సంబంధించిన సరదా సరదా విషయాలకోసం వచ్చే నెలవరకూ ఆగాలి మరి! (హారున్-యహ్యా సౌజన్యంతో)

(మిగతా భాగం వచ్చే సంచికలో)

| మీకు స్కూలులో ఇలా నేర్పి ఉంటారు | కాని మీరు తెలుసుకోవల్సిన అసలు నిజం ఏమిటంటే .. |
|---|---|
| 1. తెల్లని కాంతి వివిధ రంగులను కలిగి ఉంటుందని ఐజాక్ న్యూటన్ 17వ శతాబ్దంలో కనుగొన్నాడు. | 1. కాని ఈ విషయాన్ని పూర్తిగా కనుగొన్నవారు 11వ శతాబ్దంలో అల్-హైతమ్ మరియు 14వ శతాబ్దంలో కమాలుద్దీన్. న్యూటన్ కనుగొన్న విషయాలు అసలైనవే. కాని ఆ విధంగా కనుగొన్న విషయాలలో, 'తెల్లని కాంతి - ఏడురంగుల మిశ్రమం' అనే విషయం లేదు. |
| *Isaac Newton, during the 17th century, discovered that white light consists of various rays of colored light.* | *This discovery was made in its entirety by al-Haytham (11th century) and Kamal ad-Din (14th century). Newton did make original discoveries, but this was not one of them.* |

2. ఆల్జీబ్రా యొక్క *symbols* ని మొదటిసారిగా ఫ్రెంచ్ గణితశాస్త్రవేత్త *Francois Vieta* ఉపయోగించారు. 1591 సం॥లో, మనకు బాగా సుపరిచితమైన *'x'* మరియు *'y'* అక్షరాలతో సమీకరణాలను వివరిస్తూ ఆల్జీబ్రాపై ఓ పుస్తకాన్ని వ్రాశాడు. ఆసిమొవ్ ఇలా చెబుతున్నారు: రోమన్ అంకెల నుండి అరబిక్ అంకెలవరకు జరిగిన పురోగతి ఎంత ప్రభావాన్ని చూపిందో, అలాంటి ప్రభావాన్నే ఈ డిస్కవరీ కూడా చూపింది.

*The first man to utilize algebraic symbols was the French mathematician, Francois Vieta. In 1591, he wrote an algebra book describing equations with letters such as the now familiar x and y's. Asimov says that this discovery had an impact similar to the progression from Roman numerals to Arabic numbers.*

3. స్పెయిన్‌కి చెందిన *Arnau de Villanova* అనే అల్‌కెమిస్ట్ 14వ శతాబ్దంలో శుభ్రపరచిన ఆల్కహాల్‌ను ఆంశిక స్వేదనం ద్వారా మొదటిసారిగా ఉత్పత్తి చేశాడు.

*Purified alcohol, made through distillation, was first produced by Arnau de Villanova, a Spanish alchemist, in 1300 A.D.*

2. ఆల్జీబ్రాను కనుగొన్నవారు ముస్లిమ్ గణితశాస్త్రవేత్తలు. 9వ శతాబ్దపు ప్రారంభంలోనే సమీకరణాలలోని తెలియని *variables* కొరకు అక్షరాలను ఉపయోగించే భావనను పరిచయం చేసింది ముస్లిం గణిత శాస్త్రజ్ఞులే. ఈ వ్యవస్థ ద్వారా రకరకాల క్లిష్టమైన సమీకరణాలను వారు పరిష్కరించారు. ఆ పరిష్కరించిన వాటిలో *quadratic* మరియు *cubic* సమీకరణాలు కూడా ఉన్నాయి. *Symbols* ని ఉపయోగించి *binomial* (బైనామియల్) సిద్ధాంతాన్ని అభివృద్ధి చేసి, దానిని పరిపూర్ణం చేశారు.

*Muslim mathematicians, the inventors of algebra, introduced the concept of using letters for unknown variables in equations as early as the 9th century A.D. Through this system, they solved a variety of complex equations, including quadratic and cubic equations. They used symbols to develop and perfect the binomial theorem.*

3. అసంఖ్యాకమైన ముస్లిమ్ కెమిస్టులు వైద్య-స్థాయి ఆల్కహాల్‌ను ఆంశికస్వేదనం ద్వారా 10వ శతాబ్ద సమయానికే ఉత్పత్తి చేశారు. రసాయనిక శాస్త్రంలో ఉపయోగం కొరకు తొలి ఆంశికస్వేదన పరికరాలను భారీ స్థాయిలో తయారు చేసింది కూడా ముస్లిమ్ కెమిస్టులే! ఆల్కహాల్‌ని వారు *solvent* గానూ మరియు ఏంటిసెప్టిక్‌గా ఉపయోగించారు.

*Numerous Muslim chemists produced medicinal-grade alcohol through distillation as early as the 10th century and manufactured on a large scale the first distillation devices for use in chemistry. They used alcohol as a solvent and antiseptic.*

**గమనిక:**

*Algebra* అనే పదం *Al-Jabar* (అల్-జబర్) అనే అరబీ పదం నుండి, *Chemistry* అనే పదం *Al-Kemia* (అల్-కెమియా) అనే అరబీ పదం నుండి, *Alcohol* అనే పదం *Al-Kohol* (అల్-కొహొల్) అనే అరబీ పదం నుండి వచ్చినవే!

## ప్రైమరీ స్కూలులో చదివే పిల్లల కోసం ఓ రైమ్ (Rhyme) : అల్-ఖాలిఖ్ (సృష్టికర్త)

**AL-KHALIQ** (The creator)

*La illaha Ill Allah*
*Muhammadur-Rasullullah*
*Sall-Allahu Alayhi Wa Sallam*

Al Khaaliq made the oceans
Rivers, lakes, streams and rain
Bow their waves in pure submission
Upon the earth to praise his name

*La illaha Ill Allah*
*Muhammadur-Rasullullah*
*Sall-Allahu Alayhi Wa Sallam*

There is no creature among us
Upon the air or in the sea
That does not sing with wonder
Praising in community

*La illaha Ill Allah*
*Muhammadur-Rasullullah*
*Sall-Allahu Alayhi Wa Sallam*

The dry earth is a sign
To all of mankind
Brought to life with peaceful rain
And to us Allah will do the same

# ఖుర్'ఆన్‌ని అర్థం చేసుకుంటూ చదువుదాం

**"(ప్రవక్తా!) మేము ఎంతో శుభవంతమైన ఈ గ్రంథాన్ని నీ పై అవతరింపజేశాము, ప్రజలు దాని వాక్యాలను గురించి ఆలోచించాలనీ, బుద్ధిమంతులూ, ఆలోచనాపరులూ దానినుండి గుణపాఠం నేర్చుకోవాలనీని'' (దివ్య ఖుర్'ఆన్ 38:29)**

**ముహమ్మద్ (స) ఇలా చెప్పారు: "మీలో శ్రేష్ఠులు ఎవరంటే ఖుర్'ఆన్‌ని నేర్చుకునేవారు మరియు నేర్పించేవారు" (బుఖారి)**

ఖుర్'ఆన్‌లో దాదాపుగా 77,800 పదాలున్నాయి. అందులో దాదాపు 83 శాతం అంటే 64,282 పదాలను తీసుకుంటే, అందులోని కొన్ని పదాలే మాటి మాటికి వస్తూ ఉంటాయి. కాబట్టి ఈ 83 శాతం పదాలను నేర్చుకోగలిగితే, మీరు చదువుతున్నప్పుడే దాని అర్థం కూడా మీ పఠనంతో పాటుగా అర్థమైపోతూ ఉంటుంది.

ఒక సంవత్సరంలో 83శాతం పదాలను నేర్చుకునే విధంగా ప్రతీ నెల కొన్ని పదాలను అందించాలని ఈ శీర్షిక ప్రారంభించాము. కాని పాఠకుల సౌలభ్యం కోసం ఈ శీర్షికను 30 నెలలకు మార్చడమైనది.

ఈ శీర్షికకు సంబంధించిన ఇతర ముఖ్య వివరాలను మొదటి సంచికలో వివరించాము.

ఇక్కడ ముఖ్యంగా మీరు గమనించవలసింది ఏమిటంటే, అరబీ పదాలకు సర్వసామాన్యంగా ఉండే అర్థాన్ని మాత్రమే ఇవ్వడం జరిగింది. వాస్తవానికి ఆ పదానికి ఇంకా ఎక్కువ అర్థాలు ఉండవచ్చు. సందర్భాన్ని బట్టి ఇతర అర్థాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. కాని అటువంటి పదాల సంఖ్య తక్కువే. పదాలను అక్షరాల క్రమంలో (alphabetical order) ఇవ్వడం వలన అర్థాలు వెతకడం సులభమౌతుంది.

**అరబీ పదాలకు సరిపోయే ఖచ్చితమైన ఉచ్ఛారణను తెలుగులో ఇవ్వడం చాలా కష్టం. అందుకని ఈ పదాలను ఉచ్ఛరించడం కోసం మేమిచ్చిన ఉచ్ఛారణను కాకుండా, మీ దగ్గరలోని హాఫిజ్, మౌలానాలను లేదా అరబీ చదువగలిగిన వారిని సంప్రదించమని మనవి చేసుకుంటున్నాం.**

| **ఎవరి యొక్క?** | | | | **ఎవరు?** | | | |
|---|---|---|---|---|---|---|---|
| ...هِ | (హి) | = | **అతని యొక్క** (పు) | هُوَ | (హువ) | = | **అతడు** (పు) |
| ...هِمْ | (హిమ్) | = | **వారి యొక్క** (పు) | هُمْ | (హుమ్) | = | **వారిని** (పు) |
| ...كَ | (క) | = | **నీ యొక్క** (పు) | أَنْتَ | (అన్‌త) | = | **నీవు** (పు) |
| ...كُمْ | (కుమ్) | = | **మీ యొక్క** (పు) | أَنْتُمْ | (అన్‌తుమ్) | = | **మీరంతా** (పు) |
| ...يْ | (యీ) | = | **నా యొక్క** | أَنَا | (అనా) | = | **నేను** (పు/స్త్రీ) |
| ...نَا | (నా) | = | **మా యొక్క/మన యొక్క** | نَحْنُ | (నహ్‌ను) | = | **మేము** (పు/స్త్రీ) |
| ...هَا | (హా) | = | **ఆమె యొక్క** (స్త్రీ) | هِيَ | (హియ) | = | **ఆమె** (స్త్రీ) |
| ...هُنَّ | (హున్న) | = | **వారి యొక్క** (స్త్రీ) | هُنَّ | (హున్న) | = | **వారు** (స్త్రీ) |
| ...كِ | (కి) | = | **నీ యొక్క** (స్త్రీ) | أَنْتِ | (అన్‌తి) | = | **నీవు** (స్త్రీ) |
| ...هَا | (హా) | = | **వారి యొక్క** (br.pl.) | هِيَ | (హియ) | = | **అవి** (br.pl.) |
| ...هُمَا | (హుమా) | = | **వారిద్దరి యొక్క** (ద్వి) | هُمَا | (హుమా) | = | **వారిద్దరు** (ద్వి) |
| ...كُمَا | (కుమా) | = | **మీ ఇద్దరి యొక్క** (ద్వి) | أَنْتُمَا | (అన్‌తుమా) | = | **మీరిద్దరు** (ద్వి) |

(పు) = పు:లింగం (స్త్రీ) = స్త్రీలింగం (భ) = భవిష్యత్ కాలం (బ) = బహువచనం (ద్వి) = ద్వివచన పదం

br.pl. = broken plural

**కొంతమంది సోదరులు, తమకు అరబీ చదవడం రాదని, కాబట్టి అరబీ అక్షరాల దగ్గర నుండి మొదలు పెడితే వారికి ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ఆసక్తి ఉన్నవారికి అరబీ చదవడం నేర్చుకోవడానికి 7 రోజులు చాలు. అరబీ మొదటి నుండి నేర్పడం ఈ శీర్షిక యొక్క ఉద్దేశ్యం కానప్పటికిని, సోదరుల కోరికను కొంతమేరైనా తీర్చాలనే సంకల్పంతో 37వ పేజీలో అరబీ అక్షరాలను, వాటి గుణింతాలను ఇచ్చాము.**

## దైవ విశ్వాసి అయిన ఓ యువకుడు ఎటువంటి స్త్రీని తన జీవిత భాగస్వామిగా ఎన్నుకోవాలి?

ఈ విషయంలో ఖుర్ఆన్ చాలా స్పష్టమైన సూచన నిచ్చింది. అయితే, ''ఖుర్ఆన్'' చదువుకున్న యువతలో ఎక్కువ మంది ఈ సూచనను అంత సీరియస్‌గా తీసుకోలేదు. సీరియస్‌గా తీసుకోకపోవడం వలన ఎక్కువ శాతం యువకులు జీవితంలో ఊహించని నష్టానికి గురౌవుతూనే ఉన్నారు. సంతోషమయ జీవనానికి దూరమవుతున్నారు.

కాని ఖుర్ఆన్ సూచన ప్రకారంగా, అదే విషయంపై ముహమ్మద్ (స) వారు చేసిన బోధన ప్రకారంగా జీవిత భాగస్వామిని ఎన్నుకోగలిగితే, వారి సంసారాల్లో అంతా సంతోషమే. ఇన్షాఅల్లాహ్, కాపురాలు కూలిపోవు. కష్టాలు, సుఖాలు అనేవి అందరి జీవితాల్లోనూ ఉంటాయి. అవి రాత్రి, పగలులా వస్తూనే ఉంటాయి.

**''నిశ్చయంగా, ఎల్లప్పుడు కష్టంతోపాటు సుఖం కూడా ఉంటుంది. నిశ్చయంగా, ఎల్లప్పుడు కష్టంతోపాటు సుఖం కూడా ఉంటుంది''** (దివ్య ఖుర్ఆన్ 94:5-6)

కాని కష్టమొచ్చినా, సుఖమొచ్చినా ఒకేలా ఉండటం ఎప్పుడు సాధ్యమౌతుందంటే, వారి జీవితంలో సంతోషం ఉన్నప్పుడే. ఈ సంతోషం మన ఊపిరిలా ఎప్పుడూ ఉండాలి. అలా నిత్యం ఉండాలంటే సులభంగా ఆచరించగలిగే ''ఖుర్ఆన్ ఆదేశాలు మరియు దైవప్రవక్త ముహమ్మద్ (స) వారి బోధనల'' ప్రకారం జీవించడం ద్వారానే సాధ్యమౌతుంది.

ఓ ముస్లిం యువకుడు, వివాహం చేసుకోవడానికి ఎటువంటి ముస్లిం యువతిని ఎన్నుకోవడం శ్రేయస్కరమో ఈ క్రింది ఖుర్ఆన్ ఆయత్‌లో వివరించబడింది.

**''మరియు ముష్రిక్ స్త్రీలు, విశ్వసించనంత వరకు, మీరు వారిని వివాహమాడకండి. ముష్రిక్ స్త్రీ మీకు ఎంత నచ్చినా, ఆమె కంటే విశ్వాసురాలైన ఒక బానిస స్త్రీ ఎంతో మేలైనది''**

(దివ్య ఖుర్ఆన్ 2:221)

ఈ విషయానికి సంబంధించిన హదీస్ :

''అబూహురైరా(రజి) ఉల్లేఖనం : **ముహమ్మద్(స) ఇలా ప్రభోదించారు : స్త్రీని నాలుగు (విషయాల)పై పెళ్ళి చేసుకుంటారు. ఆమె ఐశ్వర్యం, వంశావళి, అందచందాలు మరియు ఆమె ధర్మం. మీరు ధార్మికురాలైన స్త్రీనే ఎన్నుకోండి** (లేకపోతే) **మీరు నష్టపోయిన వారవుతారు.**

(సహీహ్ బుఖారీ హదీస్ నెం. 5090, సంపుటి 7, 67వ పుస్తకం: వివాహం, 16వ అధ్యాయం)

ఇదే హదీస్‌ను, సునన్ ఇబ్నెమాజా లో 1858వ హదీస్‌గా, సహీహ్‌గా వాల్యూమ్ 3లో చూడవచ్చు. అయితే ఈ హదీస్‌లో 'మీరు ధార్మికురాలైన స్త్రీనే ఎన్నుకోండి' తరువాత ఒక అరబీ నానుడి ఉంది. దాని భావం 'మీకు మేలు కలుగుతుంది'. అంటే ధార్మికురాలైన స్త్రీని వివాహం చేసుకుంటే మేలు కలుగుతుంది (లేదా) అలాంటి స్త్రీని వివాహం చేసుకొనకపోతే నష్టపోవడం జరుగుతుందని తెలుస్తుంది.

మరో ప్రవచనంలో 'ధర్మ పరాయణురాలైన నల్లని బానిస, ఎర్రని కులీన కాంత కంటే మేలు' అని ఉంది. అంటే **ధర్మ పరాయణత లేని అందగత్తె కంటే ధర్మపరాయణురాలైన బానిస మేలు** అని తెలుస్తుంది.

అయితే అత్యధిక సంఖ్యలో యువకులు అందం, ఐశ్వర్యం వైపే మొగ్గు చూపుతున్నారు. కొందరు డబ్బు గురించి కాకుండా అందంగా ఉండాలని, తెల్లగా ఉండాలని కోరుకుంటున్నారు. నిజం చెప్పాలంటే, అందాన్ని ఎవరూ నిర్వచించలేరు.

అందం అంటే ఫలానా విధంగా మాత్రమే ఉండాలని ఎవరూ చెప్పలేరు. నిజానికి సంసారంలోగాని, భార్యాభర్తల దాంపత్య సుఖంలోగాని ఈ అందం మరియు రంగు యొక్క పాత్ర ఏమీ ఉండదని పెళ్లి అయిన కొన్నాళ్లకే తెలుసుకుంటారు. మానసిక సౌందర్యమే నిజమైన అందంగా తెలుసుకుంటారు. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటున్నట్లు ఉంటుంది వీరి పరిస్థితి.

సంసారంలో భార్యాభర్తలిద్దరి మధ్య ఉండవలసింది ప్రేమ. ఒకరిని సంతోషపెట్టాలని రెండవవారికుండాలి. ప్రేమ, ఆప్యాయత, అనురాగాలతో జీవించే భార్యాభర్తలు ఒకరికొకరు చాలా అందంగా కనిపిస్తారు. ఒకరి సాన్నిహిత్యం మరొకరికి ఎంతో హాయినిస్తుంది.

పెళ్లికి ముందు ఆకర్షణనే నిజమైన ప్రేమగా భావిస్తూ, పార్కుల్లో గంటలు, గంటలు మాట్లాడుకున్న చాలా జంటలకు, పెళ్లయ్యాక వారి మధ్య నున్నది ప్రేమకాదు, తాత్కాలిక ఆకర్షణేనని తెలుస్తుంది. పార్కుల్లో గంటల సమయాన్ని వెచ్చించిన వీరు కలిసి కొన్ని నిమిషాలు ఇంట్లో మాట్లాడుకోలేని పరిస్థితులొస్తాయి. ఈ విషయంలో ఒకరినొకరు దెప్పిపొడుచుకోవడం షరా మామూలే. అయితే వీరికి భిన్నంగా, పెళ్లయిన తర్వాత ప్రేమానురాగాలతో బ్రతికే భార్యాభర్తలు మాత్రం సన్నిహితంగా ఎంతోసేపు తనివితీరా మాట్లాడుకోగలుగుతారు.

ఒకసారి మహాప్రవక్త (స) వారిని ''**ఉత్తమ మహిళ ఎవరు?**'' అని ఎవరో అడుగగా, మహాప్రవక్త (స) సెలవిచ్చిన మూడు లక్షణాలలో ఒక లక్షణం ఏమిటంటే - **భర్త తనవైపు చూసినప్పుడు అతన్ని ప్రసన్నం చేసే మహిళ.**

భర్త ప్రసన్నుడు ఎప్పుడౌతాడు?

భార్యలో ప్రేమానురాగాల స్థానంలో, అహంకారం, స్వార్థం మొ॥వి చూస్తే, అంతకు ముందు ఎంతో అందగత్తెగా భావించిన తన భార్య అతనికిప్పుడు వికృతంగా అనిపిస్తుంది. ఆమె భర్తని ప్రసన్నం చేసుకోలేదు.

అలా కాకుండా, అందంగా లేకపోయినా సరే, బాగా చూసుకునే భార్యని కలిగియున్న భర్తకు, తన భార్య చాలా అందంగా కనిపిస్తుంది. **మా ఉద్దేశ్యం అందంగా ఉన్న వాళ్లంతా అహంకారులని కాదు.** ప్రేమలేని

అందానికి విలువ లేదు. అందంతోపాటు ప్రేమ ఉంటే ఆమె మరింత అందంగా కన్పిస్తుంది. ఈ విధంగా ప్రేమ అందాన్ని డామినేట్ చేస్తుందని తెలుసుకోవాలి. ఉదాహరణకు ప్రేమించే తల్లిలో, కొడుకు తల్లి ప్రేమని చూసి ఇష్టపడతాడే గాని, తల్లి అందం గురించి అతనికి ఆలోచనే రాదు. కొడుకుకు కనిపించే తల్లియొక్క గొప్ప అందం - మరేమిటో కాదు అవధులు లేని ఆమె ప్రేమే. ఏ ఇద్దరి మధ్యనున్న ప్రేమ అయినా సరే, వారి రూపురేఖలపై ఆధారపడదు.

సృష్టికర్త 'అల్లాహ్‌పై పూర్తి భరోసా ఉంచే యువతీ యువకులు ఖుర్‌ఆన్ ద్వారా అల్లాహ్ తెలిపిన ఆదేశాలనూ, ఆయన పంపిన చివరి ప్రవక్త ముహమ్మద్ (స) బోధనలను సునాయాసంగా ఆచరించ గలుగుతారు. ఇలాంటి విశ్వాసుల్లోని యువతీ, యువకులు ఆ 'దైవ విశ్వాస' లక్షణం ద్వారానే వివాహాలు చేసుకుంటే, వారిద్దరూ అల్లాహ్ కరుణతో ఎలాంటి కష్టాన్నయినా సునాయాసంగా భరించగలిగే మనోధైర్యాన్ని పొందడమే కాకుండా, దాంపత్య సుఖాన్ని పూర్తి స్థాయిలో పొందగలుగుతారు.

ఇది పరిశోధనాత్మక వ్యాసం అంటే మీకు నవ్వు రావచ్చు.

కాని ఇది నిజం. ఎన్నో జంటలపై జరిపిన పరిశోధన ద్వారానే ఈ వ్యాసం వ్రాయడం జరిగింది. పెళ్లయినవారు తప్పనిసరిగా హదీసు వెలుగు, ఇస్లామీయ జీవనసరళి (తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్, హైదరాబాద్), హదీసు కిరణాలు (ట్రూత్ పబ్లికేషన్స్), హదీసు మకరందం (అల్-హుఖ్ పబ్లికేషన్స్, హైదరాబాద్) మొ॥వి కనీసం రెండు, మూడు సార్లయినా చదవండి. తరచుగా చదివితే మరీ మంచిది.

రోగమొస్తే డాక్టర్ దగ్గరికెళతాం. కాని రోగం రాకుండా ముందుగా తీసుకోవలిసిన జాగ్రత్తల గురించి ఆలోచించడం వివేకం అవుతుంది. కాదంటే మూర్ఖత్వమే.

ఏ యువకుడైనా సెలూన్‌కి వెళితే, బార్బర్‌ని కొత్త బ్లేడ్ వేశాడా? లేదా? అని అడిగి ముందు జాగ్రత్త తీసుకుంటాడు. ఇక యువతీ యువకులు సిరంజి కొత్తది అని నమ్మకం కుదిరాకే హాస్పిటల్‌లో ఇంజక్షన్ చేయించు కుంటున్నారు. రక్త పరీక్షల దగ్గర కూడా ఇలా జాగ్రత్తలు తీసుకునేది 'ఎయిడ్స్' అనే రోగానికి భయపడి. ఎయిడ్స్ వలన జీవితం నాశనమై, అతి తొందరలోనే ప్రాణం పోతుంది.

కాబట్టి ప్రాణమంటే ఇంత తీపి ఉండి, ఇన్ని జాగ్రత్తలు పాటించేవారు, ఆ ప్రాణాన్ని సంతోషంగా ఉంచుకునే జాగ్రత్తలు కూడా తీసుకోవాలి. సృష్టికర్త ఆదేశానుసారం బ్రతికితే, ఇటువంటి ప్రాణాంతక వ్యాధులు సమాజంలో కనిపించేవే కాదు. సృష్టికర్త ఆదేశాలు తెలుసుకోండి. జీవితాన్ని సంతోషమయం చేసుకోండి. సుందర సమాజంలో మీరూ ఓ సభ్యులు కండి.

శారీరక అందం నీటి బుడగలాంటిది. నిజమైన అందం మనస్సుకు సంబంధించింది. సభ్యతా సంస్కారాలతో ధర్మం ప్రకారం బ్రతికే స్త్రీయే - తన భర్త దృష్టిలో అసలైన మిస్ యూనివర్స్. **- శాంతిబాట టీమ్**

**(35వ పేజీ తరువాయి...)**

క్రింద 28 అరబీ అక్షరాలను, వాటి పేర్లను, తెలుగులో వాటికి దగ్గరగా సరిపోయే శబ్దాలను గమనించండి. అరబీ భాషలో ఉచ్ఛారణ చాలా ముఖ్యమైనది. ఉచ్ఛారణ సరిగ్గా లేకుంటే అర్థమే మారిపోతుంది. **ఖచ్చితమైన ఉచ్ఛారణ కొరకు మీ దగ్గరలోని అరబీ తెలిసిన వారి సహాయాన్ని తీసుకోమని మా మనవి.**

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ض | ص | ش | س | ز | ر | ذ | د | خ | ح | ج | ث | ت | ب | ا |
| దాద్ | సాద్ | షీన్ | సీన్ | జా | రా | జాల్ | దాల్ | ఖా | హ | జీమ్ | సా | తా | బా | అలిఫ్ |
| **ద** | **స** | **ష** | **స** | **జ** | **ర** | **జ** | **ద** | **ఖ** | **హ** | **జ** | **స** | **త** | **బ** | **అ** |

| | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | ى | و | ه | ن | م | ل | ك | ق | ف | غ | ع | ظ | ط |
| | యా | వావ్ | హా | నూన్ | మీమ్ | లామ్ | కాఫ్ | ఖాఫ్ | ఫా | గైన్ | ఐన్ | జా | తా |
| | **య** | **వ** | **హ** | **న** | **మ** | **ల** | **క** | **ఖ** | **ఫ** | **గ** | **'అ** | **జ** | **త** |

**ఉదాహరణకు క్రింద 'ల' గుణింతం ఇవ్వబడింది. వాటిని అనుసరించి మిగతా అక్షరాల గుణింతాలను మీరు సునాయాసంగా తెలుసుకోవచ్చు.**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| لْ | لُ | (لٖ) | لِيْ | لِ | (لٰ) | لَا | لَ |
| లామ్ జజమ్ | లామ్ పేష్ | లామ్ ఖడీ జేర్ | లామ్-య-జేర్ | లామ్ జేర్ | లామ్ ఖడా జబర్ | లామ్ అలిఫ్ జబర్ | లామ్ జబర్ |
| **ల్** | **లు** | **లీ** | **లీ** | **లి** | **లా** | **లా** | **ల** |

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| لّٰ | لّ | لَوْ | لَيْ | لٌ | لٍ | لً | (لٗ) | لُوْ |
| | | లామ్-వావ్-జబర్ | లామ్-య-జబర్ | లామ్ దో పేష్ | లామ్ దో జేర్ | లామ్ దో జబర్ | లామ్ ఉల్టా పేష్ | లామ్-వావ్-పేష్ |
| **ల్లా** | **ల్ల** | **లౌ** | **లై** | **లున్** | **లిన్** | **లన్** | **లూ** | **లూ** |

| | | |
|---|---|---|
| ّ = తష్‌దీద్ | ث , س , ص | ఈ మూడు అక్షరాలకు తెలుగులో 'స' అనే శబ్దాన్ని ఇవ్వడం జరిగింది. కాని ఈ మూడు అక్షరాల ఉచ్ఛారణ (పలకడం)లో చాలా వ్యత్యాసముంది. అదే విధంగా 'జ' అనే శబ్దాన్నిచ్చే అరబీ అక్షరాలు 4 ఉన్నాయి. వీటి ఉచ్ఛారణలో కూడా చాలా వ్యత్యాసముంది. తెలుగులో ఖచ్చితమైన అరబీ ఉచ్ఛారణను చెప్పడం సాధ్యం కాదు. |

అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

# మనందరి బాధ్యత

మన కంటే ముందు ఈ భూమిపై ఎన్నో జాతులు పుట్టాయి. ఎన్నో జాతులు కాలగర్భంలో కలిసిపోయాయి. వారి నుండి గుణపాఠం నేర్చుకోవాలని, ఆ జాతుల గురించి దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ తెలియజేశారు. మరి మనం గుణపాఠం నేర్చుకున్నామా? లేక నాశనమైన జాతుల అడుగుజాడలలో నడుస్తున్నామా?

యూదులు 'ధర్మం' విషయంలో పూర్తిగా వారి మతపెద్దలైన 'రబ్బీ'లపై ఆధారపడ్డారు. వారు ఏది చెబితే అదే ధర్మం. అల్లాహ్ ధర్మశాస్త్రాలను ఏ జాతికి పంపినా సరే, ఆ శాస్త్రం ఆ జాతిలోని ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలి. ఇది ప్రత్యేకంగా ఆ జాతిలోని కొందరికే పరిమితం కాదు.

మతపెద్దకు ధర్మశాస్త్రంపైగాని, దైవంపైగాని విశ్వాసం లేకుండా, అతను స్వార్థపరుడూ, అవినీతిపరుడూ అయితే, అటువంటి పెద్దపై ఆధారపడిన వారిని, ధర్మంపేరుతో దోచుకోవడం జరుగుతుంది. వారిని మతభ్రష్టులను చేయడం జరుగుతుంది.

మరి మనమేమి చేస్తున్నాం? మనం కూడా ఆధారపడుతున్నామా? మస్‌జిద్‌కి ఇమామ్ రాలేకపోతే మరొకరు ఇమామత్ చేస్తారు. ప్రతీ ఒక్కరూ ధర్మానికి సంబంధించిన కనీస జ్ఞానాన్ని కలిగి ఉండాలి. ఖుర్ఆన్, హదీస్ గ్రంథాల గురించి ఆలిమ్‌లు చూసుకుంటారని, మనం వాటిని అధ్యయనం చేయడం మానివేస్తే, మనకూ పూర్వపు జాతులకు పట్టిన గతే పడుతుంది.

ఖుర్ఆన్ మరియు హదీస్‌లు ఏ ఒక్కరి సొత్తో కాదు. అవి సర్వమానవాళికి చెందినవి. వాటిని అధ్యయనం చేయడం, మనకు తెలిసిన ఒక వాక్యాన్నైనా ఇతరులకు చెప్పవలసిన బాధ్యత మనపై ఉంది. ఇది తప్పనిసరి. అందుకోసం మనమేమి చేయాలి? ఏ పనీ చేయకుండా, బ్రతుకుతెరువు కోసం ఎవరిపైనో ఆధారపడకూడదు. 'ధర్మ ప్రచారం' చేయడం వృత్తి (ప్రొఫెషన్) కాదు. ఇది వ్యాపారం అంతకంటే కాదు. మన జీవనోపాధికి ఏదైనా పనిచేసుకుంటూనే, 'దావా' కార్యక్రమాన్ని మనకు వీలైన స్థాయిలో చేయాలి.

దైవవిధేయుల్ని ఉన్నత సమాజంగా నిలబెట్టాము అని దివ్య ఖుర్ఆన్‌లో చెప్పబడింది. చేతులతో కష్టపడి సంపాదించి తిన్న భోజనమే గొప్ప భోజనమని ముహమ్మద్(స) వారు బోధించారు. మన చేయి ఎప్పుడూ పైనే ఉండేవిధంగా కష్టపడాలి. ఉన్నతంగా, నిజాయితీగా బ్రతకాలి.

మన నిజాయితీ ఏమిటో, మన సంకల్పం ఏమిటో అల్లాహ్‌కు బాగా తెలుసు. అమావాస్య రోజు కటిక చీకటిలో నల్లని రాతిపై, ఓ నల్లని చీమ కదలిక కూడా అల్లాహ్‌కు తెలుసు. ధర్మం గురించి చెప్పడం మన బాధ్యత. ఇదేమీ త్యాగం కాదు. **మనం ధర్మ ప్రచారం చేయాలంటే, వేరే రాష్ట్రం వారో, వేరే దేశం వారో మనకు ఆర్థిక సహాయం చేయాలా? అది వారి బాధ్యతా? ఎంత మాత్రం కాదు. ఇది పూర్తిగా మన బాధ్యతే!**

వీలుకుదిరితే రోజులో కాస్సేపు, అది కుదరకపోతే వారంలో కాస్సేపు, ఖుర్ఆన్ ద్వారా అందిన ఇస్లాం ధర్మ సందేశాన్ని తెలియని వారికి అందించండి. మీరు ధార్మిక ప్రచారానికి కావలిసిన మెటీరియల్ అంతా, ఇన్షా అల్లాహ్, శాంతిబాట పత్రిక ద్వారా అందిస్తాము. నాస్తికులకు, గ్రంథ ప్రజలకు, విగ్రహారాధకులకు, ముస్లిములకు చెప్పగలిగే విషయాలను ప్రతీ నెలా శాంతిబాటలో అందేటట్లుగా శీర్షికలను డిజైన్ చేయడం జరిగింది.

అల్లాహ్‌కు విధేయత చూపాలి. ముహమ్మద్(స)వారికి విధేయత చూపాలి. ముహమ్మద్(స)వారిపై ఎంతో ప్రేముందని నోటితో చెప్పడం కాకుండా, ఆయన బోధనలు, ఆచరణల ప్రకారమే మన జీవనవిధానముండాలి. ముహమ్మద్(స)వారు తన కేరక్టర్ ద్వారానే తొలి ప్రచారాన్ని మొదలు పెట్టారు. పాఠక సోదరులారా! మీరు కూడా మన ముహమ్మద్(స)వారిలాగే నిజాయితీగా, సౌమ్యంగా, నిస్వార్థంగా, చిరునవ్వుతో మీ తోటివారితో మెలగితే, ఇన్షా అల్లాహ్, అదే గొప్ప ధర్మ ప్రచారమవుతుంది. ఈ ధర్మ ప్రచారం కోసం మీరు ఆలిమ్‌లు కానవసరం లేదు. ఈ పత్రికలో ప్రతీ నెలా వస్తున్న వ్యాసాలను చదవండి. అర్థంకాకపోతే ఫోన్‌లో సంప్రదించండి. చదవడం రాని వారిని ఒకచోట సమావేశపరచి, ఈ పత్రికను చదివి వినిపించినా కూడా మంచి ఫలితం లభిస్తుందని మా నమ్మకం. ఏ మతధర్మం వారితోనూ మనకు వాదనలు వద్దు.

'ఇస్లాం'కి సంబంధించి గొప్ప, గొప్ప విషయాలు, వింతలు, విశేషాలు ఎన్నో ఉన్నాయి. వందల సంవత్సరాల నుండి చేస్తున్న అద్భుత పరిశోధనలూ ఉన్నాయి. అయితే అవి వేరే భాషలలో ఉన్నాయి. సామాన్యులకు సయితం అర్థమయ్యే సరళమైన తెలుగులో అందరికీ అందించాలనే, ట్రూవిజన్ మరియు వెలుగుబాట సొసైటీలు ప్రారంభించ బడ్డాయి. మేము ఆర్థిక పరిస్థితి గురించి ఆలోచించలేదు. మాకు అల్లాహ్ చాలు అనుకున్నాము. పైన చెప్పిన విషయాలను 'శాంతిబాట' ద్వారా అందించడానికి మీరు కూడా మాతో కలవండి. సమిష్టిగా కృషి చేద్దాం. దీనికోసం మీరు చేయవలసింది : రోజుకి 50 పైసలు 'శాంతిబాట' పత్రిక కోసం ఖర్చు పెట్టడం. ఫండ్స్ లేకుండా, ఎడ్వర్‌టైజ్‌మెంట్స్ లేకుండా, గవర్నమెంట్ వారిచ్చే న్యూస్ ప్రింట్ కాకుండా, ఖరీదైనది మరియు చాలా కాలం మన్నిక ఉండే క్వాలిటీ పేపర్‌తో మీ ముందుకు వస్తున్న శాంతిబాటను ఆదరించండి.

చందాదారులను చేర్పిస్తూ, ఈ మహాకార్యంలో పాల్గొనమని పాఠకులందరికీ మనస్ఫూర్తిగా మనవి చేసుకుంటున్నాము.

Jazakumullah Khair

– శాంతిబాట టీమ్

**Printed by** Md. Athaharullah, **Published by** Md. Athaharullah **on behalf of** VeluguBaata Educational Society (Regd.No. 569/2008), Samalkot and **Printed at** '*Akash Industries*', G-14, Industrial Estate, Samalkot - 533440 and **Published at** 2-8-31, Kota Bazar, Samalkot - 533440, **Editor:** Md. Athaharullah , Phone : 9347046090, Email: velugubaata@gmail.com, RNI Title Code APTEL11019

## శాంతిబాట పాఠకులకు ఓ శుభవార్త

రాబోయే 3వ లేదా 4వ సంచికతో పాటు క్రింది పుస్తకాన్ని ఇన్షాఅల్లాహ్ ఉచితంగా అందిస్తాము

మానవ చరిత్రలోనే మహోన్నతుడుగా నిరూపించబడిన దైవసందేశహరులు

# ముహమ్మద్(స) వారిపై

# ప్రపంచవ్యాప్తంగా జరుగుచున్న దుష్ప్రచారం

(సుమారు 200 పేజీలు, 1/8 డమ్మీ సైజ్, వెల: ఉచితం)

పబ్లిషర్స్: ట్రూవిజన్ ఎడ్యుకేషనల్ సొసైటీ (వైజాగ్) మరియు వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ (సామర్లకోట)

ఈ మహనీయున్ని ప్రముఖ చరిత్రకారులు, విమర్శకులు ఎంతో కొనియాడారు. అమెరికాలో మైఖేల్ యెచ్. హార్ట్ జరిపిన పరిశోధనాత్మక సర్వేలో ప్రపంచ మానవులలో మొదటి ఉన్నత స్థానం ముహమ్మద్(స) వారికి దక్కింది. ఈయన జీవిత చరిత్ర ముస్లిములలోనే ఎక్కువ శాతం మందికి తెలియనప్పుడు, ఇతర మతధర్మాల వారికి ఎలా తెలుస్తుంది?

ఓ వర్గం వారు ప్రతీ గంటకు ఇస్లాంకి వ్యతిరేకంగా ఓ పుస్తకాన్ని ప్రచురిస్తున్నారంటే, ఈ దుష్ప్రచారం కోసం ఎంత ఖర్చు చేస్తున్నారో అర్థమవుతుంది. ఇంటర్‌నెట్‌లో, ప్రింట్ మీడియాలో ఎంతో విద్వేషాన్ని వెళ్లగక్కుతున్నారు. ఆవేదన కలిగించేలా, తట్టుకోలేని స్థాయిలో నీచమైన పదజాలాన్ని ఉపయోగిస్తున్నారు.

బురద చల్లుతున్న ఇలాంటివారిపై మనం కూడా బురద జల్లితే, వారికి మనకూ తేడా ఏముంటుంది? అందుకే బురద జల్లేవాని చేతికంటిన బురదను కడిగి, వారికి సంస్కారాన్ని నేర్పవలసిన బాధ్యత మనపైనే ఉంది. ముహమ్మద్(స) వారికి నిజంగా విధేయులైన వారి బాధ్యత ఇదే!

ఈ సంవత్సరం జనవరి నుండి ఆగష్టు వరకూ ఈ పుస్తకం కోసమే పూర్తి సమయాన్ని కేటాయించి అందరికీ అర్థమయ్యే తెలుగులో వ్రాయడం జరిగింది. ఈ పుస్తకం చదివాక, ఇక ఎవరికీ ఎప్పుడూ ముహమ్మద్(స) వారిపై చెడుగా మాట్లాడే అవకాశం, ఇన్షా అల్లాహ్ రాదు అని పూర్తి విశ్వాసంతో చెప్పగలుగుతున్నాము.

ఏ ధార్మిక కార్యక్రమం ప్రారంభించినా, సున్నత్ ప్రకారం, అందరితో కలిసి చేయాలనేదే మా కోరిక. ఈ పనిలో మాతో భాగస్వాములు కావాలను కుంటున్నారా? మీరు కూడా వేరొకరికి ఉచితంగా ఈ పుస్తకాన్ని పంచాలనుకుంటున్నారా? అయితే 100 రు॥ల నుండి మొదలుకొని, మీకు వీలైనంత అందించండి. పోస్టల్ ఖర్చుతో కలిపి మీరు పంపిన మొత్తానికి సరిపడా పుస్తకాలను పంపుతాం.

పుస్తకాన్ని ప్రింటింగ్ కొరకు ప్రెస్‌కు ఇచ్చేలోపునే తెలియజేయమని కోరుతున్నాము.

రాష్ట్రమంతటా వేల కాపీలు ఉచితంగా పంచాలనుకున్నాము. మా రెండు సొసైటీల తరపున మరియు ఈ మహాకార్యంలో మాతో భాగస్వాములైన కొందరి సోదరుల తరపున సుమారు 3000 కాపీలను 'ఇన్షాఅల్లాహ్' ఉచితంగా అందిస్తాం.

రండి! మాకు చేయూత నివ్వండి! మనందరం కలిసి

### ప్రపంచ శాంతిదూత "ముహమ్మద్(స)" వారి గొప్పతనాన్ని ప్రజలందరికీ తెలియజేద్దాం.

ఉత్తమ భర్తగా, ఉత్తమ తండ్రిగా, ఉత్తమ స్నేహితుడుగా, ఉత్తమ బోధకుడిగా, ధైర్యశాలిగా, నిరాడంబరుడుగా, సహనశీలుడుగా, నిజాయితీ పరుడుగా, అనాథలకు ఆశ్రయంగా, ఆత్మాభిమానిగా, ఇంకా ఎన్నో మహోన్నత లక్షణాలను ఏకకాలంలో ఒకే వ్యక్తిలో కలిగి ఉండటం ఒక్క ముహమ్మద్(స) వారికే సాధ్యమైంది. ఈ మాట అన్నది మేము కాదు. ముస్లిమేతరులే తీర్పునిచ్చారు.

పూర్తి సాక్ష్యాధారాలతో, ప్రామాణిక గ్రంథాల ద్వారా వివరణ మరియు విశ్లేషణలతో రాబోతుంది.

### దుష్ప్రచారాన్ని ఖండించే విషయంలో, పూర్తి వివరాలతో ప్రపంచంలోనే దీనిని తొలి పుస్తకంగా తీర్చిదిద్దాలనే మా దృఢ సంకల్పాన్ని అల్లాహ్ సమ్మతించి ఉంటారని మా విశ్వాసం.



ఈ నెల

# కాంతి కిరణం

حَدَّثَنا عَبْدُ الْعَزِيزِ بنُ عَبْدِ اللهِ قالَ: حَدَّ
ثَنِي سُلَيْمانُ بنُ بِلالٍ، عَنْ ثَوْرِ بنِ زَيْدٍ
الْمَدَنِيِّ عَنْ أبِي الْغَيْثِ، عَنْ أبِي هُرَيْرَةَ
رَضِيَ اللهُ عَنْهُ عَنِ النَّبِيِّ (ﷺ) قالَ
:((اجْتَنِبُوا السبعَ الموبِقاتِ)) قالُوا : يا
رسولَ اللهِ، وما هُنَّ؟ قالَ: ((الشِّرْكُ باللهِ،
والسِّحْرُ، و قَتْلُ النَّفْسِ الَّتِي حَرَّمَ اللهُ إلَّا
بالحَقِّ، وأكْلُ الرِّبا، وأكْلُ مالِ اليَتِيمِ،
والتَّوَلِّي يَوْمَ الزَّحْفِ، وقَذْفُ المُحْصِناتِ
المُؤْمِناتِ الغافِلاتِ

హజ్రత్ అబూహురైరా(రజి) ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త(ముహమ్మద్ ﷺ) ఇలా చెప్పారు :

"ఏడు మహా వినాశనకరమైన పాపాలకు దూరంగా ఉండండి". దానికి సహచరులు "దైవప్రవక్తా! ఏమిటవి?" అని అడిగారు. ఆయన చెప్పారు : "అల్లాహ్‌కు సహవర్తుల్ని నిలబెట్టడం, చేతబడి చేయటం, అల్లాహ్ నిషిద్ధం చేసిన ప్రాణిని అన్యాయంగా చంపటం, వడ్డీ తినటం, అనాథుని సొమ్ము తినటం, శత్రువులతో యుద్ధం జరిగినప్పుడు వెన్ను చూపి పారిపోవడం, అమాయకులూ, సౌశీల్యవతులూ అయిన విశ్వాస స్త్రీల మీద అభాండాలు వేయటం."

(సహీహ్ బుఖారీ, హదీస్ నెం. 2766, సంపుటి 4, వసాయా పుస్తకం, 23వ అధ్యాయం : 'అల్లాహ్ యొక్క ఆదేశం')

కాపీల కొరకు సంప్రదించండి :

**ట్రూవిజన్ ఎడ్యుకేషనల్ సొసైటీ**
7-13-11, ఎ.యు. అవుట్‌గేట్ ఎదురుగా (డౌన్), చిన్న వాల్తేర్, విశాఖపట్నం-17
ఫోన్: 9885387392, 9666431202, Email: truevisionvizag@gmail.com

**వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**
2-8-31, కోట బజార్, సామర్లకోట - 533440, తూర్పు గోదావరి జిల్లా
ఫోన్: 9493102212, 9849892424, Email: velugubaata@gmail.com